స్త్రీలలో వచ్చే వ్యాధుల కథారూపకాలు

# ఛుప్ కె ఛుప్ కె...



(రహస్యభాష)




డాక్టర్ లంకా శివరామప్రసాద్

డాక్టర్ పి. జానకి దేవి

# ఛుప్ కె ఛుప్ కె

— (రహస్యభాష) —



డాక్టర్ లంకా శివరామప్రసాద్
డాక్టర్ పి. జానకీదేవి

# ఛుప్ కె ఛుప్ కె

**(రహస్యభాష)**

by

**Dr. Lanka Siva Rama Prasad**
**Dr. P. Janaki Devi**

✧✧✧———————————————✧✧✧

July 2015

All rights reserved

Copyright @ 2015
by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Distributed by-
All leading book centers
Visalandhra Publishing House
Navodaya Publishing House

**E-book: www.kinige.com**

Price : ₹ **100 $ 4**

Post Script : **Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

***This book is presented to...***

# ప్రస్తావన

ఇలియాడ్, ఒడెస్సీ, ఎపిక్‌సైకిల్, పారడైజ్‌లాస్ట్, పారడైజ్ రిగెయిన్డ్, ఈనీడ్, డివైన్ కామెడీ, పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్, మూడు గ్రీకు ట్రాజెడీలు, ఫాస్ట్, శిలప్పదికారం, మణిమేఖల, మస్నవి, లాంటి మహా కావ్యాల్ని ఇతర భాషలలోంచి తెలుగులోకి, సౌందర్యలహరి, భాగవతం, భగవద్గీతను ఇంగ్లీషులోకి అనువదించి సాహిత్యలోకానికి అందించిన సృజనలోకం ఇప్పుడు వైద్యగ్రంథాల్లోని అద్భుత విషయాలను కవిత్వంగా, కథలరూపంగా సమర్పిస్తోంది.

"ఒక సరస్సు–అనేక హంసలు" మానసిక వ్యాధుల్ని వివరించే తొలి దీర్ఘకావ్యం. మరణశాసనం–మృత్యువు గురించి నినదించే కవితారూపకం. 'కర్కాటకం' కాన్సరు చరిత్ర గురించి తెలిపే అరవై కవితల మణిహారం. 'ఛుప్‌కె ఛుప్‌కె' (రహస్యభాష–1) స్త్రీలలో వచ్చే వ్యాధుల్ని కథారూపకాలుగా వివరిస్తూ ప్రాక్పశ్చిమ కథాసీమల మూలాల్లోకి వెళ్తూ, వస్తూ పాఠకులను నూతన ఆలోచనా లోకాల్లో విహరింపచేస్తుంది.

రహస్యభాష–2 స్త్రీలలో వచ్చే ప్రముఖ క్యాన్సర్ల గురించి; రహస్యభాష–3 స్త్రీలలో వచ్చే ఇతర వ్యాధుల గురించి వివరిస్తాయి.

అపంశయ్య నవీన్, కోవెల సుప్రసన్నాచార్య, పేర్వారం జగన్నాధం, రామా చంద్రమౌళి, జి. శ్రీనివాసరావు, లంకా శివరామప్రసాద్ వంటి రచయితల గ్రంథాల్ని దాదాపు వందకు పైగా ప్రచురించినది సృజనలోకం.

తెలుగు సాహితీ లోకానికి అందజేస్తున్న వైద్యగ్రంథాల వరుసలో ఆవిష్కరించబడ్తున్న– రహస్యభాష–1 సాహితీ ప్రియుల మన్ననలనందు కుంటుందని సృజనలోకం గాఢంగా విశ్వసిస్తున్నది.

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| ఛుప్ కె ఛుప్ కె – 1 | **Introduction** | 1 |
| ఛుప్ కె ఛుప్ కె – 2 | **Man-Woman** | 3 |
| ఛుప్ కె ఛుప్ కె – 3 | **Menstruation** | 5 |
| ఛుప్ కె ఛుప్ కె – 4 | **Breast** | 9 |
| ఛుప్ కె ఛుప్ కె – 5 | **Menses** | 12 |
| ఛుప్ కె ఛుప్ కె – 6 | **Echo** | 15 |
| ఛుప్ కె ఛుప్ కె – 7 | **Caeserean Section** | 18 |
| ఛుప్ కె ఛుప్ కె – 8 | **Moon** | 24 |
| ఛుప్ కె ఛుప్ కె – 9 | **Menarche** | 29 |
| ఛుప్ కె ఛుప్ కె – 10 | **Boy or Girl** | 38 |
| ఛుప్ కె ఛుప్ కె – 11 | **How Many Children?** | 43 |
| ఛుప్ కె ఛుప్ కె – 12 | **Urinary Incontinence** | 50 |
| ఛుప్ కె ఛుప్ కె – 13 | **Forceps** | 54 |
| ఛుప్ కె ఛుప్ కె – 14 | **Hydatidiform Mole** | 63 |
| ఛుప్ కె ఛుప్ కె – 15 | **Pregnancy** | 69 |

# ఛుప్ కె ఛుప్ కె - 1

## (రహస్య భాష)

మౌనంగా భరించాలా ఈ బాధల్ని, దుఃఖాల్ని? ఎన్నాళ్లిలా? మౌనం గొప్పదే! సహనం మెచ్చుకోతగ్గదే! ఆకాశంలో సగమైన మాకు అవకాశాల్లో సగమెవ్వరిచ్చారు? అడిగిన ప్రతి ప్రశ్నకూ జవాబు 'నోరు ముయ్!' అని కసురుకోవడమే కదా! ఎన్నాళ్లని ఈ మౌన దేహ ప్రదేశంలో రహస్యభాషతో మమ్మల్ని మేము పలకరించుకోవాలి? ఎవరో అల్ప సంఖ్యాకులకు స్వేచ్ఛా సంగీత విపంచిని మీటే అవకాశం దొరికినా, మిగతావాళ్లమందరం సరిగా 'సరిగమల్ని' నేర్చుకోనివ్వనివాళ్లమే కదా!

రా! మంచీ చెడుల మధ్య నున్న ప్రదేశంలోకి!
అక్కడ నీతో నేను మనసు విప్పి మాట్లాడ్తాను.
ఆ స్వేచ్ఛా పచ్చిక మీద శయనించే ఆత్మలకు
ఈ ప్రపంచపు కర్కశ నిర్బంధపు ఆంక్షలుండవు!

గలగల పారే ఏరులా ప్రవహించే నేను ఎందుకిలా నిశ్శబ్దపు మడుగునయ్యానో అర్థం కాలేదా! మాట్లాడవేం అని అడుగుతావే మరలా మరలా! నిశ్శబ్దాన్ని భరించగలిగిన వారే కదా మాటల్ని భరించగలిగేది. రా! వెళదాం నిశ్శబ్ద వనంలోకి! సంధ్యాకాంతులు విరిసే సమయాన కాంతి పదముద్రలు మినహా మిగతావన్నీ స్తబ్దమవుతాయి.

సంధ్యాసమయపు పూర్వ నిశ్శబ్దాన్నెప్పుడైనా విన్నావా? తుఫాను ముందరి ప్రశాంతతను, తుఫాను భీభత్సానంతర నిశ్శబ్దాన్ని పరికించావా? నిన్నెవరైనా ప్రశ్నించినప్పుడు సమాధానమివ్వలేనప్పటి నిశ్శబ్దాన్ని, రాత్రిపూట సుదూర గ్రామాల దారుల్లోని నిశ్శబ్దాన్ని, ఒక మహావక్త ప్రసంగించబోయే ముందు సభా ప్రాంగణంలో నెలకొనే ప్రశాంతతను, లంకంత ఇంటిలో ఒంటరిగా నీవున్నపుడు నీ గది తలుపులు మూసుకున్న మరుక్షణం తాండవించే నిశ్శబ్దాన్ని గమనించావా? విభిన్నమైన ఈ నిశ్శబ్దాల్ని నీవు శ్రద్ధగా విన్నపుడు అవి ఎంతో అద్భుతంగా అనిపిస్తాయి.

నిశ్శబ్దాన్ని మాటలకన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నపుడు, ఆమె కళ్లు పేజీలుగా, ఆమె కన్నీళ్లు పంక్తులుగా కనిపిస్తాయి. మాటలు నిదురించేప్పుడు నిశ్శబ్దం మొలకలెత్తి

పరివ్యాప్తం కాగా, ఏదో ఒకరోజు అవి నీలో నిదురలేచి పలకరిస్తాయన్న నమ్మకం నీకుంటుంది.

ఆడపిల్ల పుట్టబోయేప్పటి నుంచి పుట్టి గిట్టే వరకూ జరిగే అనేక అల్లకల్లోల భీభత్స, నిశ్శబ్ద సంభాషణల్ని ఒక్కొక్కటే మనం ఈ రహస్య భాషలో వినబోతున్నాం. ప్రపంచ ప్రసిద్ధికెక్కిన అనేక కథల్ని, కన్నీటి జడుల్ని దర్శించి వాటికి దొరికిన, దొరకని పరిష్కారాల్ని, బాధలకు ఉపశాంతిని భౌతిక మనోమయ నేత్రాలతో వీక్షిస్తూ అక్షరాల రూపంలో వాటిని చర్చిద్దాం!

రండి! మౌనాన్ని వీడి సంభాషణలకుపక్రమించండి!

"ఛుప్ కె ఛుప్ కె రాత్ దిన్,
ఆంశు బహానా యాద్ హై,
హమ్‌కొ అబ్‌తక్ ఆషిఖీ కా,
వొ జమానా యాద్ హై' –

* * * * *

"....నిశ్శబ్దంగా గడచిన ఒక రాత్రి...
తలుపు వద్ద ఏదో హృదయ స్పందన.
బయట పొగమంచులో ఓ స్త్రీ
ఎండుపుల్లలే శిరోజాలుగా, పచ్చటి మొక్కలు వస్త్రాలుగా,
ఆకుపచ్చని నీటిబిందువులు ఆమెపై నుంచి జాలువారుతుండగా

ఆమె నాతో అన్నది– 'నీవే నేను,'
నేను చాలా దూరం ప్రయాణం చేసాను,
నాతోరా! నీకు నేను తప్పక చూపించాల్సిన దొకటున్నది'–
ఆమె వెళ్లిపోవడానికి వెనుదిరిగింది.
ఆమెపై కప్పుకున్న అంగీ తొలిగింది అప్రయత్నంగా!
ఆ మరుక్షణమే ఎక్కడ చూసినా... స్వర్ణకాంతులు...
ఎటు చూసినా ఉదయపు అరుణ స్వర్ణచ్ఛాయాకాంతులే!"–

**'సరస్సు అడుగున నివసించే స్త్రీ'–**
**(క్లారిస్సా పింకొలా ఎస్టెస్ – 'వుమెన్ హూ రన్ విత్ ద వోల్వ్స్)**
**(Clarissa Pincola Estes - Women who run with the wolves)**

# ఛుప్ కె ఛుప్ కె - 2

## (రహస్య భాష)

## (Man-Woman)

మానవ స్త్రీని 'వుమన్'గా పిలుస్తాము. 'అపురూపమైనదీ ఆడజన్మ' అని మనం గొంతెత్తి గానం చేస్తాము. తల్లిని మించిన దైవం లేదని, 'యత్ర నార్యస్తు పూజ్యంతే – రమంతే తత్ర దేవతాః' – అని కీర్తిస్తాం. విజయుడైన ప్రతి మగవాడి వెనకా ఓ స్త్రీ ఉంటుందని భావిస్తాం.

వుమన్ (Woman) అనే పదం వైఫ్‌మాన్ (Wifemann) అనే పాత ఇంగ్లీషు మాట క్రమంగా 'విమ్మన్ (Wimmann), వుమ్మన్ (Wumman), వుమన్ (Woman) గా రూపాంతరం చెందింది. వైఫ్‌మాన్ అంటే స్త్రీ (Female Human). వెర్ (Wer) అంటే పురుషుడు. (Male human). మ్యాన్ (Man), మాన్ (Monn), మానవుడు (Human) ఇది ఇద్దనీ సూచించేవి మొదట్లో. కాలక్రమేణా వైఫ్‌మాన్ (స్త్రీ) పదంలోని వైఫ్ (Wife) వివాహమైన స్త్రీని పిలిచే మాటగా మారింది. Womb వోంబ్–గర్భసంచి ఉన్న మనిషి గనుక వుమన్ అన్నారన్న వ్యుత్పత్తి నిజంకాదు. వాంబె (Wambe) అంటే స్టమక్ (Stomach-పొట్ట). వాంబె నుంచి వోంబ్ వచ్చింది. మనం గర్భిణీస్త్రీలను 'పొట్ట'తో ఉందని అంటాం కదా!

వీనస్ (శుక్ర) దేవతకు చిహ్నమైన '♀' గుర్తుతో స్త్రీలను, మార్స్ (అంగారక, కుజ) చిహ్నమైన '♂' గుర్తుతో పురుషులను సూచిస్తున్నామిప్పుడు. వీనస్ దేవత సంతానోత్పత్తి దేవతగా, స్త్రీత్వానికి ప్రతీకగా నిలిచింది. వీనస్ చేతిలోని అద్దాన్ని సూచించే గుర్తు '♀' రసవాదులు దానిని రాగికి (Copper) గుర్తుగా వాడారు. పైన ఉన్న 'O' ఆత్మకు + భౌతిక రూపానికి గుర్తులు.

పదహారవ శతాబ్దానికి పూర్వం గరల్ (Girl) అనే పదం బాలబాలిక లిద్దరికీ అన్వయించబడేది. తర్వాత దానిని ఆడపిల్లలకు, పెళ్లికాని స్త్రీలను సంబోధించడానికి వాడినారు. గరల్ అనేది కన్యత్వానికి ప్రతీకగా మారింది. తరువాతి ఘట్టం 'పెద్దమనిషి' అవ్వడం (menarche), అనేక మానవ తెగలలో ప్రత్యేక ప్రతిపత్తిని సంతరించుకున్నది. రకరకాల వేడుకలు (rites of passage) చిన్నారి బాలిక యవ్వనపు వనంలోకి అడుగుపెట్టిందని చెప్పేవే.

ఇండో యూరొపియన్ పురాణాల్లో మొదటి మానవుడు మనువు. (మానస్–జర్మని; మను–సంస్కృతం, అవెస్తా, Menes-మెనెస్–ఈజిప్టు) ఈ పదాన్నుంచే మనిషి వచ్చినా అది క్రమేపీ మగవాడికి గుర్తుగా 'మాన్'గా అంగీకరించబడింది. సున్న పైన గురి చూస్తున్న బాణం '♂' మగజాతికి చిహ్నమై అది రోమన్ యుద్ధదేవత 'మార్స్'ను సూచిస్తుంది.

స్త్రీ పురుషుల మధ్య ఉన్న వైవిధ్యాన్ని వ్యాఖ్యానిస్తూ జాన్‌గ్రే (John Gray) 1990 ప్రాంతంలో వ్రాసిన Men are from Mars - Women are from Venus - (మార్స్ నుంచి మగవాళ్లు, వీనస్ నుంచి ఆడవాళ్లు) అన్న గ్రంథం దాదాపు అయిదు కోట్ల ప్రతులు అమ్ముడుపోయి సంచలనం సృష్టించింది.

యాజ్ఞవల్క్య ఋషి బృహదారణ్యకోపనిషత్‌లో స్త్రీ పురుషుల గురించి 'అర్థ బృగలం ఇవ' – చీల్చిన వెదురు బొంగులోని భాగాలుగా వ్యాఖ్యానించాడు.

ప్లాటో దీనినే మరొక రకంగా చెబుతాడు– 'దేవతలు తమ వినోదం కోసం ఒక వింత జీవిని నాలుగు చేతులు, నాలుగు కాళ్లు, రెండు శిరస్సులు, రెండు రకాల జననేంద్రియాలతో సృజించి, ప్రాణం పోసి ఒక్కొక్కరు ఒక్కొక్క వరాన్నిచ్చి ఆశీర్వదించినారట. ఆ వింతజీవి తనకున్న శక్తులతో దేవతలనే చికాకు పెడుతూ, వాళ్లనే ధిక్కరించసాగింది. పట్టుకోబోతే అందదు. రెండుకాళ్లతో పరుగెత్తడం, అవి అలిసిపోతే మరో రెండుకాళ్లతో అందకుండా పారిపోతూ, తనకున్న నాలుగు చేతుల్తో విశృంఖల విధ్వంసాన్ని సృష్టిస్తే ఆగ్రహించిన దేవాధిదేవుడు పదునైన కత్తితో ఆ వింత జీవిని రెండు భాగాలుగా చీల్చగా ఒక భాగం మగవాడిగా, రెండవది స్త్రీగా మారాయట. అందుకే తనకు జోడీ అయిన అర్ధభాగం దొరికే వరకు స్త్రీ పురుషులు వెదకుతుంటారని, దొరకగానే ఒక్కటవుతారని అంటారు.

బహుశా దేవతలు విసిరిన భాగం 'మార్స్'లో పడింది మగవాడిగా (ఎప్పుడూ యుద్ధకాంక్ష కలవాడు), వీనస్‌లో పడింది స్త్రీగా (అందంపై, అలంకరణపై మక్కువ) రూపొందిందని మనం అనుకోవచ్చు. విభిన్న ప్రకృతులు గల వీళ్లు ఒకరినొకరు మార్చగలమని అనుకుంటారు. అనుకుని ఆశాభంగం చెందుతారు.

షేక్స్పియర్ అంటాడు– "మహిళలారా! మగవాళ్లెప్పుడూ మోసగాళ్లే! ఒక కాలు సముద్రంలో, ఒక కాలు తీరంలో! ఏనాడూ స్థిమితం లేనివాళ్లు వీళ్లు".

జాన్ వాన్‌బ్రు చెబుతాడు "స్త్రీ తన హృదయాన్ని, నీకు ఒకసారి ఇచ్చిందా ఆమె శరీరం నిన్ను వదిలిపోదు ఎన్నటికీ!"

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 3

## (రహస్య భాష)

## (Menstruation)

"అది నన్ను నలిపేస్తోంది, అది నన్ను కొరికేస్తోంది.
మెలికలు తిరిగి లొంగిపోతుంటే నాలోని నన్ను బయటకు నెట్టేస్తున్నది"

వర్ణించ శక్యం కాని ఆ కష్టాన్ని నీకెలా చెప్పను? ఆ బాధను ఎవరితో పంచుకోను? ఆకాశంలో సగమని అనుకున్నపుడే పగిలిన ఆ సగం ఆకాశం నుంచి కుండపోతగా వర్షిస్తున్నది రుధిరమా? మేని ఛాయపై లోలోన మెరిసిన అరుణ వర్ణమా?

నిక్షిప్త జీవగడియారం కొత్త గంటలు కొట్టినప్పుడు, కొండల్లో, లోయల్లో సరికొత్త కదలిక. ఆ జలపాతం అలలకు గుండె అల్లల్లాడితే అమ్మ ఒడిలో తలదాచుకున్న రోజింకా గుర్తే. క్లాసురూంలో కూర్చుని పాఠం వింటున్నపుడు ఎక్కడో ఏదో కదిలినట్లై తడవకూడని చోట తడిచిన పొలమై అచ్ఛాదితా వస్త్రంపై అమరిన తడి మరకను అందరూ ఆక్షేపించి నవ్వినపుడు పొందిన అవమానపు రంగునే ఇంద్రధనుస్సులో చూడగలిగాను? కళ్లనిండా నీళ్లు కమ్మినపుడు కనిపించినదే వర్ణం?

నీటిచుక్కలు దారాలయ్యేప్పుడు కోటి దిక్కులు పిక్కటిల్లే బాధ. లేత రెక్కలు విరిగి నేలకొరిగినట్లు, స్వేచ్ఛ చిక్కుల్లో పడినట్లు చెప్పరాని వ్యధ. పెద్దరికం, పెళ్లి, కాపురం, మాతృత్వం లాంటి పెద్ద డిగ్రీలన్నీ పేరు ముందూ, చివరా చేరినా, మూలగదీ, చాపాపోయి మోడరన్ సేఫ్టీలొచ్చినా నెలనెలా మేం పడే నెప్పుల్ని పట్టించుకున్నదెవరు?

వేడి వేడి సెగలొచ్చి, దట్టమైన పొగలొచ్చి, అడవంతా ఒడిలిపోయి జలపాతం ఆగిపోతే, ఆడతనం కోసం పడే తపన కన్నా, ఒక్కోసారి ఆ గొడవ పోయిందన్న నిట్టూర్పే మిన్న.

అంటే గర్భసంచి ఆగర్భ శత్రువయ్యిందా? డిస్పోజబుల్ సంచుల్లా గర్భసంచుల్ని తీసి పడేయ్యడమేమిటి? ఈ హిస్టెరెక్టమీ హిస్టీరియాల కథాకమామీషు లేమిటో చూసే ముందు ఈ కథ చెబుతాను.

అనగనగనగా ఒక ఊళ్లో ఒక తల్లి తన ముగ్గురు వయసొచ్చిన ఆడపిల్లలతో నివసిస్తుండేది. వాళ్లకు ఆరుగురు అన్నలుండేవారు కాని వాళ్లు ఉద్యోగాల కోసమై

దూరదేశాలకు వెళ్లారు. ఆ ఆడపిల్లలు ఎంత అందంగా ఉండేవారంటే వాళ్ల గురించి ఆ రాజ్యమంతటా చెప్పుకునేవాళ్లు. ఒకరోజున వాళ్ల ఇంటికి ఓ అతిథి వచ్చాడు. అతడు రాజసంగా, ఠీవిగా, దర్పంగా ఉన్నాడు కాని అతడి గడ్డం మాత్రం నీలిమందులో తడిసినట్లు నీలంగా ఉండి, అతడి కళ్లు క్రూరత్వపు చూపుల్ని బాణాల్లా విసుర్తుంటే ఆ ఆడపిల్లలు భయపడి తల్లి చాటున దాక్కున్నారు.

అందుకని అతగాడు వాళ్లను మచ్చిక చేసుకోడానికి రకరకాల నగలు, చీని చీనాంబరాలను బహుమతులుగా ఇచ్చి వాళ్లతో కలివిడిగా తిరుగుతుంటే క్రమేపీ అతడు వాళ్ల కళ్లకు ముఖ్యంగా ఆఖరు చిన్నదానికి అందంగా కనబడినాడు. అందుకని అతగాడు పెళ్లి చేసుకుందామన్నప్పుడు ఆమె భయభయంగానే ఒప్పుకున్నది. పెళ్లైన తరువాత అతడు ఆమెను తన కోటకు తీసుకువెళ్లి రాణిని చేసినాడు.

కొద్ది రోజులు గడచినాక అతడు తన భార్యతో అన్నాడు– “నేను పనిమీద ఊరెళ్తున్నాను. నీకు కావాలంటే మీ వాళ్లను పిలిపించుకో. ఇక్కడి నౌకర్లు చాకర్లతో పనులు చేయించుకో! ఇవిగో తాళం చేతులు. నీవు ఏ గదిలోకి అయినా వెళ్లు కాని, ఈ చిన్ని తాళంచెవి పట్టే తాళమున్న గది తెరవవద్దు, లోనికి వెళ్లవద్దు. ఇది నా ఆజ్ఞ” అతడు వెళ్లిపోయినాడు.

ఆమెతో ఉండడానికి ఇద్దరు అక్కలూ వచ్చారు. మాటామంతీ, భోజనాలు అయ్యాక వాళ్లు కోటంతా చూద్దామనుకుని, దగ్గర వున్న తాళం చెవులతో ఒక్కోగదీ తెరిచి లోన ఉన్న రత్నాలు, మణులు, బంగారం, వస్త్రాలు, ఆయుధాలు చూసి ఆశ్చర్యపోతూ తమ చెల్లెలి అదృష్టానికి మురిసిపోయారు. చివరకు దూరంగా చీకటిలో ఉన్న గది కనిపించింది. వాళ్లు వాడని తాళం చెవి కూడా అతడు వద్దన్నదే. అయినా లోపలేమున్నదోనన్న కుతూహలం వాళ్లను ఆగనివ్వలేదు.

కొవ్వొత్తి వెలుగులో ఆ చిన్ని తాళంచెవితో ఆ చీకటి గది తలుపు తెరుస్తుంటే భయంకర శబ్దంతో తలుపు తెరుచుకుంది. లోపల ఎండిన రక్తపు మడుగు, దుర్వాసన, ఎముకలు, పుర్రెలు ఒకదానిపై ఒకటి పేర్చి ఉన్నాయి. కెవ్వున కేకపెట్టి ఆ ముగ్గురూ తలుపు మూసేసి బయటకు వచ్చారు. భయంతో గజగజా వణుకుతూనే అక్కలిద్దరూ తమతమ గదుల్లోకి పోయాక, ఆమె తాళంచెవిగుత్తివేపు చూస్తే, ఆ చిన్నితాళం చెవి నుంచి ఒక్కొక్క చుక్క రక్తం కారుతున్నది. జేబులో వేసుకుంటే జేబు తడిచింది. గుడ్డతో తుడిస్తే గుడ్డ రక్తమయమయ్యింది. ఏం చెయ్యాలో తోచక ఆమె ఆ తాళపుచెవిని

గుత్తి నుంచి విడదీసి అందరి బట్టలు ఉండే బీరువాలో అంగీల మధ్య దాచింది. రక్తంతో ఆ అంగీలు, వస్త్రాలు తడిచిపోతున్న సంగతి ఆమె గమనించలేదు.

మరుసటిరోజు నీలిగడ్డపు వ్యక్తి వచ్చాడు. కుశల ప్రశ్నలైనాక అతడే అడిగాడు కోట ఎలా ఉందని. బిక్కుబిక్కుమంటూనే ఆమె చెప్పింది బాగుందని. తాళం చెవుల గుత్తి తీసుకుని వెంటనే అతడు గమనించాడు చిన్న తాళంచెవి లేని విషయాన్ని. గట్టిగా గద్దించి అడిగాడు– "నిజం చెప్పు? ఏదీ ఆ తాళంచెవి?" ఆమె జరిగింది చెప్పింది. ఆగ్రహంతో ఊగిపోతూ అతడు ఆమె జుట్టు పట్టుకుని ఆ చీకటి గదివేపు లాక్కువెళ్లాడు. అతడి చూపు పడగానే ఆ గది తలుపులు తెరచుకున్నాయి. లోపల ఎండిన రక్తపు మడుగులు, దుర్వాసన. అతడు ఇంతకు ముందు పెళ్లి చేసుకుని చంపిన భార్యల శవాలు, పుర్రెలు, ఎముకలు... ఆమెను చంపడానికి కత్తి పైకెత్తాడు.

ఆమె బతిమలాడింది. కన్నీళ్లతో కాళ్లావేళ్లా పడింది. ఒక్క అర్ధగంట టైమిమ్మని అడిగింది. దేవుడిని ప్రార్థించేందుకు అవకాశమిమ్మని ప్రాధేయపడింది. ఏకళనున్నాడో గాని, అతడు విడిచిపెట్టగానే, ఆమె తన అక్కలున్న చోటుకు పోయి కోట పైకెక్కి ప్రార్థిస్తూ– "అక్కలారా! మన అన్నలు వస్తున్నారా?" – అని అడిగింది.

వాళ్లన్నారు– "లేదమ్మా! మైదానాల్లో ఏ అలికిడీ లేదు"–

ప్రతి అయిదు నిమిషాలకూ ఆమె అడుగుతూనే ఉన్నది, వాళ్లు అదే చెబుతున్నారు.

ఇంతలో అతడి కేక కర్కశంగా వినిపించింది– "నీకిచ్చిన టైం అయిపోయింది"–

ఆమె అడిగింది– "అక్కలారా! మన అన్నలు వస్తున్నారా?"

వాళ్లన్నారు– "లేదమ్మా! కాని ఏదో సుడిగాలి ఇటుగా వస్తున్నది"–

ఆ క్రూరుడు పైకి వచ్చి, మోకాళ్లపై కూర్చుని ప్రార్థన చేస్తున్న ఆమె జుట్టు పట్టుకుని తల నరకడానికి కత్తి ఎత్తబోయాడు. సుడిగాలిలా దూసుకువచ్చిన ఆమె సోదరులు అతడికడ్డం వచ్చి అతడి చేతిలోని కత్తిని నేలకు పడగొట్టి, తమ ఖడ్గాలతో అతడిని ముక్కలు ముక్కలుగా నరికి కాకులకు గద్దలకు ఆహారంగా వేసారు. ఆ నీలిగడ్డపు వ్యక్తి చనిపోయాకనే ఆ చిన్ని తాళంచెవి నుంచి రక్తం కారడం కూడా ఆగిపోయింది.

ఆకాశం, సముద్రం, భయం, విచారాలు, దిగులు, నీలంగా ఉంటాయి. స్త్రీలలో ఉన్న భయాలకు, దిగుళ్లకు వాళ్లు ప్రతిస్పందించిన తీరును 'హిస్టీరియా' అని పిలిచేవాళ్లు. హిస్టెరా అనే గ్రీకు పదానికి సమానార్ధకం లాటిన్‌లో యుటెరిస్ (Hystera-uterus-womb) గర్భసంచికి సంబంధమైనది– అని అర్థం. హిస్టిరియా అనే మానసిక వ్యాధి స్త్రీల శరీరంలో గర్భసంచి ఎండిపోయి, తేలికగా ఉండి పొట్టలో అటూ ఇటూ స్థానభ్రంశం చెందుతూ తిరుగుతుందని, (Wandering uterus) భావించి వైబ్రేటర్లు, వాటర్‌స్ప్రేలు, మాసేజ్‌లు చికిత్సగా వాడేవారు. ఛార్‌కాట్, ఫ్రాయిడ్‌లు – చిన్ననాటి బాధాపూర్వకమైన శృంగారానుభవాలు హిస్టిరియాకు దారితీస్తాయన్నారు. ఇప్పుడు దీనిని 'Conversion disorder' బాహ్య పరివర్తనా రూపవ్యాధిగా భావిస్తున్నారు.

అనేకమందిలో ఒకేసారి వచ్చే విపరీత ప్రవర్తనను Mass Hysteria (సామూహిక విచలిత ప్రవర్తన) అంటారు. ఉదాహరణకు బాణామతి, సాలెమ్ మంత్రగత్తెల విచారణ (Salem), బానిసల తిరుగుబాటు ఇవన్నీ 'Moral panic' - నైతిక భయాల వలన వచ్చే గుంపు ప్రవర్తనగా శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

ఒకప్పుడు విధవరాళ్ల వ్యాధి (Widow's disease)గా పేర్కొనబడిన 'హిస్టిరియా', నేడు– గృహహింస, బలాత్కారం, మానసిక హింసల పర్యవసానంగా వచ్చే మానసికవ్యాధిగా, Catch-all Junk disease, స్కిజోఫ్రెనియా లాంటి మానసిక వ్యాధులలో ఒక అంశంగా, బాహ్య పరివర్తనా రూపవ్యాధిగా పరిగణిస్తున్నారు.

అసహాయురాలైన ప్రతి స్త్రీ జీవితంలోకీ నీలిగడ్డపు క్రూరుడొకడు ప్రవేశించి కుతూహలపు తాళంచెవినిచ్చి తన వలలో చిక్కుకునేట్లు చేస్తాడు. అపరాధ భావన రక్తపుచుక్కలా కారుతూన్నపుడే, దుష్టుడి మరణంతో కథ సుఖాంతమవుతుంది.

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 4

## (రహస్య భాష)

## (Breast)

కుచౌ సద్యః స్విద్యత్తట ఘటిత కూర్పా సభిదురౌ – అని సౌందర్యలహరిలో జగద్గురువు శంకరాచార్యుల వారు వర్ణించారు. 'కమలాకుచ చూచుక కుంకుమతో' అంటూ వేంకటేశ్వర సుప్రభాతాన్ని మనం భక్తిప్రపత్తులతో గానం చేస్తాము... 'కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ నేలనేడ్చెదో' అని సహజకవి పోతన తన కలలో కనిపించిన సరస్వతిని ఓదార్చాడు.

పాలిండ్లు, పయోధరాలు, వక్షోజాలు, చనుగుబ్బలు, రొమ్ములు, స్తనములు, కుచకుంభాలు, ఇలాంటి రకరకాల పేర్లతో పిలువబడే వక్షోజాలను ఇంగ్లీషులో బ్రెస్ట్ (Breast) అని పిలుస్తారు. ఇండోయూరొపియన్ భాషలో భ్రెయుస్ (Bhreus - to swell, to sprout) ఉబుకుట, మొలకెత్తుట అని అర్థం. జర్మనీ– బ్రుస్టామ్ (Breustam); ఇంగ్లీషు– బ్రియొస్ట్ (Breost - Breast, Bosom);

ప్రతి వక్షోజంలో పదిహేను నుంచి ఇరవై నారింజ తొనల్లా భాగాలుంటాయి. వాటి నుంచి ఒక్కొక్క నాళము చనుమొన (Nipple)లో తెరచుకుంటుంది. ఆడ, మగ ఇద్దరిలోను ఉండే వక్షోజాలు యుక్తవయసు వచ్చేప్పటికి స్త్రీలలో 'ఈస్ట్రొజన్' హార్మోన్ వలన వృద్ధిచెందగా, మగవారిలో టెస్టొస్టెరాన్ వలన పెరగవు. క్షీరదాలలో కనిపించే ఈ రూపాంతరం చెందిన స్వేదగ్రంథి వలననే వీటికి ఆ పేరు వచ్చింది. (Mammary gland - mammals) అరకిలో నుంచి కిలోగ్రాము బరువుండే వక్షోజాలలో చాలామందికి ఎడమ వక్షోజం పెద్దదిగా ఉంటుంది. (గుండెపైన ఉండడం, ఎక్కువ రక్తనాళాలుండడం వలన)

వెనకటి రోజుల్లో అనేక గుట్టలను, కొండలను వక్షోజ పర్వతాలు (Breast mountain)గా పిలిచి సంతానం కోసం పూజలు వ్రతాలు చేసేవారు. బోధిధర్ముడు (Da mo) ధ్యానంలో గడిపిన గుహ ఉన్న పర్వతం, ఉగాండా–కెన్యా సరిహద్దులలోని ఎల్గాన్ పర్వతం, స్కాట్లాండ్‌లోని పాప్స్ కన్యా పర్వతం, అనూ కన్య జంట వక్షోజ పర్వతాలుగా టాలిమ్ ద్వీపం– ఫిలిప్పీన్స్‌లోని కొండలు, ఎఫ్రొడైట్ దేవత వక్షోజాలుగా ప్రసిద్ధికెక్కిన మైకొనాస్ కొండలు, అమెరికాలోని టెటాన్ పర్వత శ్రేణులు (Tits = Breast) – ఇవన్నీ అలా పేరు తెచ్చుకున్నవే.

పాత రాతియుగం నాటి వీనస్ ఆఫ్ విల్లెన్ డార్ఫ్, అస్తార్తె శిలాస్తంభం (అనేక వక్షోజాలతో), కైబిలి (Cybele) దేవత విగ్రహం, ఐసిస్ విగ్రహం, మినోవన్ నాగదేవత – వీరి విగ్రహాలలో ప్రత్యేకత వక్షోజాలు అనేకంగా ఉండడం లేదా ప్రముఖంగా కనిపించడం. వీరిని సంతానోత్పత్తి దేవతలుగా కీర్తిస్తూ పూజించేవారు. ప్రాచీన గ్రీకుదేశంలో 'కౌరొట్రొఫాస్' (పాలిస్తున్న తల్లి) విగ్రహారాధన ఎంతో ప్రాచుర్యంలో ఉండింది. జననాంగాలను వక్షోజాలను శరీరం కన్నా పెద్దవిగా చూపించే విధానం తొలినాటి విగ్రహాలలో కనిపిస్తుంది. 'బూతు దేవత'గా (Obscene goddess)గా ప్రాచీన గ్రీకు దేశంలో పూజలందుకున్న బవబోతల్లి (Baubo), (లాంబె)కి చనుమొనలే కళ్లు, జననేంద్రియాలే పెదాలు. 'తన కాళ్ల మధ్య నుంచి మాట్లాడ్తుందామె' అనే వాక్యం ఈ దేవతనుంచే వచ్చింది. గ్రీకుల మరో దేవుడు ప్రయాపస్ (Priapus). స్తంభించిన శిశ్నం పెద్దదిగా ఉండే ఈ విగ్రహం ఆరోజుల్లో ప్రతి గ్రీకు ఇంటిలోనూ పూజలందుకునేది.

ఈరోజుల్లో ప్లాస్టిక్ సర్జనులు రొమ్ములను పెద్దగా, చిన్నగా చేయడంలో ఆరితేరారు. వాలిన రొమ్ముల్ని సరిచేయడం, ఇప్పుడు చిటికెలో పని. వక్షోజాలలో వచ్చే గడ్డలకు, అనేక వ్యాధులకు ఈనాడు వైద్యం అందుబాటులో ఉన్నది. కాని అందరిని కలవరపరుస్తున్నది, మగవాళ్లకన్నా వందరెట్లు ఆడవాళ్లకు వచ్చే క్యాన్సర్‌లలో దాదాపు ఇరవై అయిదు శాతం ఉన్న ఈ బ్రెస్ట్ క్యాన్సర్. 2012లో పదిహేడు లక్షల మందిలో ఈ వ్యాధి నిర్ధారించబడగా రమారమి అయిదు లక్షల మందిని బలితీసుకున్నదీ క్యాన్సర్. ప్రతి లక్షమంది స్త్రీలలో ఇరవై నుంచి తొంభైమందికి ఈ క్యాన్సర్ వస్తుందని అంచనా. నూటికి ఎనభై మందికి వయస్సు యాభై దాటినాక వచ్చే ప్రాణాంతక వ్యాధి ఇది.

క్రీస్తుపూర్వం 1500 సంవత్సరాల నాడే ఈజిప్టు ఎడ్విన్‌స్మిత్ పాపిరస్‌లో ఎనిమిది రొమ్ము క్యాన్సర్ల ప్రస్తావన ఉన్నది. ఎర్రగా కాల్చిన శలాకలతో వాతలు బెట్టి కాల్చేసే ప్రక్రియ ఆనాటి వైద్య విధానం. "ఈ వ్యాధికి వైద్యం లేదు" అని వ్రాసుకున్నారు వాళ్లు. దేవుడి శాపంగా, నల్లని పైత్య ప్రకోపంగా, కుటుంబంలో ఎవరికన్నా వస్తే తనకూ రావచ్చేమోనన్న భయం కారణంగా ఈ క్యాన్సర్ వస్తుందని వైద్యులు, ప్రజలు అనుకునేవారు.

ఫ్రెంచి రాజు పధ్నాలుగవ లూయీ తల్లి– మహారాణి ఆనె ఆఫ్ ఆస్ట్రియా, జార్జి వాషింగ్‌టన్ తల్లి మేరీ, పర్యావరణ శాస్త్రవేత్త రాచెల్ కార్సన్, సింథియా

నిక్సన్, నాన్సి రీగన్, నమ్రతా సింగ్ గుజ్రాల్, ఏంజెలినా జోలి, వీళ్లందరూ బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడినవారే.

ఈ వ్యాధిని గురించి అవగాహన ఏర్పరచడానికి ఏర్పడిన 'పింక్ రిబ్బన్' ప్రచారోద్యమం అనేక దేశాలలో ప్రాచుర్యాన్ని పొందింది.

వక్షోజాలను తీసివేయడం (Mastectomy) శస్త్రచికిత్సగా, రేడియేషన్, కీమోథెరపీ మందులు ఈ వ్యాధిని తగ్గించడానికి, అరికట్టడానికి వ్యాప్తిలోకి వచ్చాయి.

పూర్వకాలంలో 'అమెజాన్లు'గా పేరుపడిన స్త్రీ విలుకాళ్లు తమ కుడి వక్షోజాన్ని ఖండించి ఆ ప్రాంతాన్ని చదునుగా ఉండేట్లు చేసుకునేవారని (a - Mazos – వక్షోజరహితం) అనుకున్నది నిజం కాదని పరిశోధకులంటున్నారు. రొమ్ములు కోసుకుని ఆత్మార్పణ చేసుకున్న క్రైస్తవ సన్యాసినుల (సిసిలీలోని సెయింట్ అగాథా) చరిత్రలు క్రైస్తవ గ్రంథాలలో వర్ణించబడి ఉన్నాయి. తన భర్తను దొంగగా పరిగణించి విచారణ లేకుండా చంపినందుకు ఆగ్రహంతో కణ్ణగి పాండ్యరాజుని ప్రశ్నించగా, తప్పు తెలుసుకున్న పాండ్యరాజు, రాణిల మరణం; కణ్ణగి తన వక్షోజాన్ని పెరికి మధురానగరంపై విసరగా ఆ నగరం యావత్తూ బూడిదైన సంఘటనలను 'శిలప్పదికారం' తమిళ గ్రంథంలో ఇల్లంగో అదిగళ్ అద్భుతంగా వర్ణించాడు.

క్రీస్తుశకం రెండు వందల సంవత్సరం నాటికే ప్రసిద్ధికెక్కిన సంగం కవిత్వంలో– ఒక వీరమాతను ఎవరో– ఈ ముసిల్దాని కుమారుడు యుద్ధరంగంలో వెన్నుచూపాడు అని ఆక్షేపించగా, ఆమె ఆగ్రహంతో కరవాలాన్ని చేతబూని – 'నా కుమారుడు కదనాన వెన్ను చూపిన మాట నిజమని ఋజువైతే వాడికి పాలిచ్చిన రొమ్ములను అక్కడే కోసి పడేస్తాను' – అని పలికి యుద్ధ రంగమంతా కలయతిరుగుతూ చచ్చి పడి బోర్లా ఉన్న శవాలను తన కాలితో పక్కకు తిప్పుతూ వెదకసాగింది. ఒకచోట శత్రువు గుండెల్లో తన బల్లేన్ని దించిన చేయి అలాగే ఉండగానే, ఖండఖండాలుగా నరకబడినట్లున్న తన కుమారుడి శవాన్ని చూసి ఆరోజే ఆ వీరుడి పుట్టినరోజుగా భావించిందామె.

అటువంటి ధైర్యశాలులు పుట్టిన నేలపై ఉన్న మనకు మౌనం తగదు. ఎన్నో విషయాలను మనసు విప్పి మాట్లాడుకుందాం! ఈ రహస్య భాషా ప్రపంచంలో అనేక అద్భుత విషయాలను అన్వేషిద్దాం! స్వాగతం!

# ఛుప్ కె ఛుప్ కె - 5

## (రహస్య భాష)

## (Menses)

చెట్టుమీద ఏపిల్ని చేబట్టుకు తిన్నావు, అవ్వా! ఈవ్ నీవు!
ఆనాటి నుంచి మాకు, వచ్చిందీ నెల చావు!
చెప్పలేము ఎవ్వరితోటి, ఓర్వలేము బాధ ధాటి! అవ్వా! ఈవ్ నీవు!
దేవుడి ఆజ్ఞను దేనికొరకు మరిచావు?

ఋతుస్రావం, నెలసరి, బహిష్ఠు, పిరియడు, బయట ఉండడం పర్యాయ పదాలైన నెలవారీ రక్తస్రావం స్త్రీలను చాలా సంక్లిష్ట పరిస్థితిలోకి నెట్టింది. ఆమె స్వేచ్ఛకు ప్రతిబంధకంగా మారి అనేక కట్టుబాట్లకు లోనయ్యేలా చేసింది. మూడు రాత్రులు గడప బయట ఉండేలా ఆచారాలు వచ్చాయి. దేవాలయ ప్రవేశ నిషేధాలు, పూజలకు అనర్హత స్త్రీలకు ఈ సహజ క్రియవల్లనే వచ్చింది. కొన్ని తెగలలో బహిష్ఠ గుడిసెలు ఎర్రగుడారాలు (Menstrual huts) ప్రత్యేకంగా ఉండేవి. బహిష్ఠ అనంతరం స్త్రీ శరీరాన్ని పరిశుద్ధ పరచే క్రియలు అనేక మతాచారాల్లో మనం గమనించవచ్చు. (మిక్వా-యూదుమతం; ఘుసల్-మహమ్మదీయ మతం). మానవజాతి తొలి ఆచార సంస్కారాల్లో ఇది ప్రముఖ పాత్ర వహించింది.

విశ్వరూపుడిని చంపి బ్రహ్మాహత్యా పాతకం మూటగట్టుకున్న ఇంద్రుడు తన కళంకాన్ని పోగొట్టుకోడానికి స్త్రీలను, వృక్షాలను, నేలను, నీటిని ప్రార్థించాడట. వాళ్లు దయార్ద్ర హృదయులు గనుక అతడి పాపాన్ని భరించగా అతడు పాపవిముక్తుడైనాడు. భూమిలోని చౌడునేల, వృక్షాల నుండి స్రవించే జిగురు, నీటిపై నురగ, స్త్రీలలో నెలసరి రక్తస్రావం, ఆ ఇంద్రుడి పాపఫలమని భాగవతం ఆరవ స్కంధంలో చెప్పబడింది. దానికి ప్రతిఫలంగా ఇంద్రుడు భూమికి స్వయంగా గుంటలను పూడ్చుకునే తత్త్వాన్ని, వృక్షాలకు చిగురించే శక్తిని, నీటికి సహజంగా శుభ్రపడే గుణాన్ని, స్త్రీలకు శృంగార సౌఖ్యాన్ని, రసప్రాప్తిని వరాలుగా ఇచ్చాడని ఐతిహ్యం.

కొన్ని ప్రాచీన గ్రంథాలలో నెలసరి రక్తస్రావానికి అధిదేవతగా సరస్వతిని పేర్కొన్నారు. సరస్వతి అంటే 'ప్రవాహం', నీటిని కలిగి ఉన్నది అని కదా అర్థం. సుమెరియన్లకు ఇనాన్నా దేవత ప్రేమకు, నెలసరికి అధిదేవత.

యూదుల మత గ్రంథమైన టోరా (లెవిటికస్ 15:19-30)లో 'బహిష్టు స్త్రీని స్పృశించినవారు ఆరోజు సాయంకాలం వరకు అపరిశుభ్రులే' అని చెప్పబడింది. క్రైస్తవులలో ఈ ఆచారాన్ని పెద్దగా పాటించరు. జీసస్ తనను తాకిన స్త్రీని ఆశీర్వదించి స్వస్థపరచినాడు (మార్క్ 5:24). బహాయి విశ్వాసులు దేహపు అపరిశుభ్రతకన్నా ఆత్మయొక్క స్వచ్ఛతను గౌరవిస్తారు. వారిలో ఈ పట్టింపులు లేవు. మహమ్మదీయ మతంలో స్త్రీలు ఉపవాసం ఉండడం, ప్రార్థించడం లాంటి పవిత్ర కార్యక్రమాలకు బహిష్టు సమయంలో అనర్హులుగా భావించబడింది. హిందూ మతంలోని అగ్రకుల స్త్రీలు బహిష్టు సమయంలో ఇంటిలోని దక్షిణగది (ఢాకినీ దేవతా నివాసం)లో గాని, ప్రధాన గడప బయట గాని ఉండవచ్చును. వారికి వంటగదిలోకి, ఇతర గదుల్లోకి, దేవాలయాల్లోకి ప్రవేశం నిషేధించబడినది. కాశ్మీరు పండితులలో ఈ నిషేధం లేదు. సిక్కు మతంలో కూడా స్త్రీలకు ఎటువంటి నిషేధాలు లేవు.

తమకత్యంత సన్నిహితులైన మగ స్నేహితులతో కూడా మాట్లాడలేని సందర్భంగా నూటికి ముప్పైమంది అమెరికన్ ఆడపిల్లలు 'నెలసరి'ని పేర్కొన్నారు. ఇండియాలో దక్షిణ దేశం, అస్సాంలలో- 'రజస్వల' (తొలిసారి రక్తస్రావం) సందర్భాన్ని వేడుకగా చేసుకున్నా తర్వాత నెలసరి దినాల్లో స్త్రీ దేహాన్ని అపరిశుభ్రంగా భావిస్తారు.

నెలసరి సమయంలో వచ్చే మానసిక ఉద్వేగాలు, దైహిక మార్పుల్ని (రొమ్ముల్లో నెప్పి, వేడి; చిరాకు, భయం, ఉద్వేగం, దుఃఖం, నిద్రపట్టక పోవడం, తలనెప్పి, కడుపునెప్పి, మొటిమలు, కీళ్లనెప్పులు, వళ్లునెప్పులు) ప్రిమెన్‌స్ట్రుయల్ సిండ్రోమ్ (Premenstrual Syndrome-PMS) అంటారు. ఇది ఒక్కో స్త్రీలో ఒక్కో రకంగా ఉండవచ్చును. నెలసరికి పదిరోజుల ముందుగా ప్రారంభమై, రక్తస్రావంతో ఈ లక్షణాలు తగ్గిపోతాయి.

మెన్సెస్ అనే పదం మెన్సా (లాటిన్) అంటే మంత్ (నెల) నుంచి రాగా మంత్ (month) - మూన్ (moon) నుంచి వచ్చింది. చంద్రునిలోని వృద్ధి క్షయాలు, సముద్రంలోని ఆటుపోట్లకు మల్లే మానవ మస్తిష్కంపై కూడా ప్రభావాన్ని చూపిస్తాయని కొందరి శాస్త్రజ్ఞుల విశ్వాసం. చంద్రుడు గొప్ప దాయి (The greatest obstetrician) అని పూర్వీకులు నమ్మేవారు. అమావాస్యకు పౌర్ణమికి వచ్చే సముద్రపు ఆటుపోట్లు, జీవజంతువులలోని జీవచక్రంలో వచ్చే మార్పులు, స్త్రీలలో ఋతుకాలంలో మరింత ఎక్కువై మానసిక దైహిక క్షోభను

కలిగిస్తాయి. అయితే ఇది స్త్రీల జన్మకాలాన్నిబట్టి, దైహిక నిర్మాణాన్ని బట్టి వేర్వేరుగా ఉంటాయి.

సెరటొనిన్, గ్లుటమేట్‌లు ఎక్కువగా ఉండడం, బీటా ఎండార్ఫిన్‌లు తగ్గడం, సూడోకొలిన్ ఎస్టరేజ్‌లు పెరగడం ఈ (PMS) ఋతుకాలపు విచలిత ప్రవర్తనకు కారణం కావచ్చు. కాఫీ టీలు ఎక్కువగా త్రాగడం, దిగులు, కుటుంబ చరిత్ర, పని ఒత్తిడి, మెగ్నీషియం, కాల్షియం, మాంగనీస్, విటమిన్ బి-6, విటమిన్-ఇ, విటమిన్-డి తక్కువగా ఉండడం వలన ఈ లక్షణాలు రావచ్చును.

ఋతు స్రావానికి ముందు ఉండే ఈ విచలిత స్థితిలో కొందరు స్త్రీలు హింస, దౌర్జన్యాలతో ప్రవర్తిస్తారు. తమ సహచరులను చంపినవారు, గాయపరచిన వారు అక్కడక్కడా కనిపిస్తారు. న్యాయస్థానాలు, న్యాయాధిపతులు ఒక్కోసారి ఈ స్థితిని మానసిక ఉన్మాదంగా భావించి నేరస్తులకు తక్కువ శిక్ష విధించిన సందర్భాలున్నాయి.

విటమిన్లు (డి, ఎ, యి, బి-6), లవణాలు (కాల్షియం, మెగ్నీషియం) ప్రొజాక్, జోలోఫ్ట్ లాంటి మందులు; నిర్గంధి (చేస్ట్‌బెర్రీ) సెయింట్ జాన్స్ వొర్ట్ (ఛేజ్ డెవిల్) లాంటి చెట్లమందులు ఈ వ్యాధికి విరుగుడుగా ప్రాచుర్యంలో ఉన్నాయి.

-"మిత్రమా! నేను వెళ్లిపోతున్నాను. జ్వరం వస్తే ఉపవాసముండు. చల్లి చేస్తే బాగా తిను. కాని ఈ గొడవకు మాత్రం నీకేది తోస్తే అది చెయ్యి. ఎర్రటి గుడారంలో నేనున్నప్పుడు నెలసరి మృత్యు ప్రవాహపు మకిలి నా నుంచీ జారిపోగా నేను పరిశుద్ధురాలినౌతాను."-

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 6

## (రహస్య భాష)

## (Echo)

హలో! హలో! ఎవరక్కడ? ఎవరక్కడ?
ఎవరూ లేని నాకు ఎదురయ్యేది నా నీడ!
నిశ్శబ్దపు లోగిలిలో నినదించే గుండెదడ!
ఎఖో! ఎఖో! ఎఖో! ఎఖో! ఎఖో!

ఆకాశంలో దేవతలకు అధినాయకుడు జ్యూస్ (ద్యుః–వెలుగు) – అంటే వెలుగులోకపు రాజు. మన దేవేంద్రుడి లాంటివాడు. అతడి భార్య 'హెరా'. దేవేంద్రుడిలానే ఆ దేవుడికీ కళాపోషణ ఎక్కువ. అందంగా ఎవరైనా కనిపిస్తే ఆడా మగా తేడాలేకుండా మనసు పారేసుకునేవాడు. అంతేకాకుండా ఎద్దురూపంలోనో, గ్రద్ధరూపంలోనో, బంగరు వర్షంలానో కురిసి బలాత్కారం చేసేవాడు. ఇట్లా అనేక సక్రమ, అక్రమ సంతానాలతో 'దేవతలకు, మనుష్యులకు తండ్రి' (Zeus - Pater - ద్యు పితరుడు) గా పేరు తెచ్చుకున్నాడు.

పాపం, శచీదేవి లాంటి 'హెరా'కు అనుమానం ఎక్కువ. అసలే ఇంటాయన పోకడలు లోకప్రసిద్ధమైనవి కనుక ఒక కంట కనిపెట్టే ఉండేది. అందుకని అతగాడు పర్వతకన్య 'ఎఖో'ను హెరాకు పరిచయం చేసాడు. 'ఎఖో'కు మాట్లాడడం ఇష్టం. మొదటిమాట, మధ్యమాట, చివరిమాట అన్నీ తనవే కావాలనుకుంటుంది. అంతేకాక 'ఎఖో'కు ఎన్నో కథలు వచ్చు. కొండలపై నుంచి పడే జలపాతంలా మాట్లాడుతూనే, హెరా దేవతకు, ఈనాటి మన టి.వి. సీరియళ్లలా ఎంతకూ జరగని కథలు చెబుతూ ఉండేది. ఆ అదను చూసుకుని దేవేంద్రుడు భూలోక కన్యలతో శృంగారం వెలగబెట్టేవాడు. ఎంత దాచినా దాగనిది దేవరహస్యమే కదా! దేవేరికి విషయం తెలవగానే 'అత్తమీద కోపం దుత్త మీద చూపించినట్లు' 'ఎఖో'ను శపించింది– 'వాగుడు కాయలా ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడడం ఇక కుదరదు! ఇకనుంచి నీవు మొదట మాట్లాడావా నశించిపోతావు. చివరిమాట మాత్రం నీదే అవుతుందిలే! పో ఇక్కడ్నుంచి' అన్నది.

చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తూ 'ఎఖొ' కొండల దగ్గర దుఃఖిస్తూ, గుహల్లో, జలపాతాల్లో, చెట్టూ చేమల్లో, గుట్టల్లో మనశ్శాంతిని వెదుక్కుంటూ ఎవరైనా హలో అంటే హలో అంటూ ప్రతిధ్వనించసాగిందట.

ఒకరోజున ఆ పర్వతకన్య 'ఎఖొ' తిరుగుతున్న వనాల్లోకి ఓ అందగాడు వేటకని వచ్చాడు. అతడిపేరు నర్సిస్సస్. నదీ దేవుడికి వనకన్యకు పుట్టినవాడు. ఇప్పటి సిక్స్‌పాక్ మగాళ్లలా తన అందాన్ని చూసి తానే మురిసిపోతూ ఆడపిల్లల్ని కసురుకునేవాడు. అతడిని చూసి ఆడపిల్ల 'ఎఖొ' తొలిచూపులోనే మనసు పారేసుకుంది. అతడికి కాస్త దూరంలో వెనకగా నడుస్తూ అనుసరిస్తుంటే, అనుమానం వచ్చి అతడన్నాడు– 'ఎవరక్కడ?'. ఆమె ప్రతిధ్వనించింది– 'ఎవరక్కడ?' కాసేపు దాగుడుమూతలయ్యాక అతగాడి ఎదుటబడి 'ఎఖొ' తన ప్రేమను తెలియబరచింది. అతడు తీవ్రమైన మాటలతో తిరస్కరించాడు. గుండె పగిలిన 'ఎఖొ' దుఃఖిస్తూ, దుఃఖిస్తూ ఒకప్పుడు కొండలు గుట్టలు, వనాలు, మైదానాలు అంతా తానేయై తిరిగిన ఆమె చిక్కిశల్యమై, కొండగుహల్లోకి కానరాకుండా అదృశ్యమై చివరకు ప్రతిధ్వనిగా మిగిలిపోయింది.

ఈ విషయం 'నెమిసిస్' అనే కోపదేవతకు తెలిసింది. 'ఆడపిల్లలంటే అంత చులకనా' అనుకుని నర్సిస్సస్‌ను ఒక అద్భుతమైన నీటికొలను వేపు దారి మళ్లించింది. ఆ సరస్సు నీరు అద్దంలా స్వచ్ఛంగా ఉండి నిశ్చలంగా ఉన్నాయి. అటు వచ్చిన 'నర్సిస్సస్' ఆ నీళ్లలో తన అందాన్ని చూసుకుంటూ తన్మయుడై తన ప్రతిబింబాన్ని ప్రేమించినవాడై ఆ ఉన్మాదస్థితిలో ప్రతిబింబాన్ని కౌగిలిలోకి తీసుకోవాలని ప్రయత్నించి నీటిలో మునిగి చనిపోయాడు. అతడు చనిపోయిన చోట జాజిమల్లె (నర్సిస్సస్ పూలమొక్క) పుట్టింది. డఫొడిల్స్ లాంటి బంగరు రంగు పూలను కూడ 'నర్సిస్సస్' అని పిలుస్తారు. ఇదీ 'ఎఖొ'–నర్సిస్సస్'ల కథ.

నవీన వైద్యశాస్త్రంలో 'ఎఖొ' ఉపయోగాలు అనేకం. దీనిని 'సోనోగ్రఫి' అంటాం. గర్భిణిస్త్రీలను పరీక్షించేది అల్ట్రాసౌండ్, గుండెను పరీక్షించేది రెండు డైమన్షన్ల (2D) ఎఖొ, శరీరంలో ఇతర భాగాలను పరీక్ష చేయడానికి డాప్లర్‌తో కూడిన ఎఖొ యంత్రాలను వాడుతున్నారు. ఇప్పుడు 3D, 4D ఎఖోలు వచ్చి తల్లి గర్భంలోని శిశువు కదలికల్ని శరీర నిర్మాణాల్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.

వీటిలో మనం శబ్దతరంగాలను శరీరభాగాల్లోకి పంపించి వాటి నుంచి వచ్చే ప్రతిధ్వనులను (ఎఖొ) తెరపై చూడగలము కనుక ఈ ప్రక్రియకు ఎఖొగ్రఫి, సోనొ (సొనొ–సౌండ్) గ్రఫి అనే పేర్లు వచ్చాయి.

మన వినికిడి శక్తి 20–20000 తరంగాల మధ్య ఉంటుంది. గబ్బిలాలు, కుక్కలు, డాల్ఫిన్లు, మిడతలు, గొల్లభామలు, తిమింగిలాలు, చేపలు, మనుషుల్లా ఉండే పార్‌పొయిస్‌లు, అనేక కీటకాలు మనకన్నా ఎక్కువ వినికిడి శక్తి (20000–200000 తరంగాలు) కలిగి ఉన్నాయి. పెద్దవాళ్లు వినలేని శబ్దాలను చిన్నపిల్లలు వినగలరు. అందుకే ఒక అమెరికన్ సెల్‌ఫోను కంపెనీ పిల్లలకు మాత్రమే వినబడే రింగ్‌టోను తయారు చేసిందట. తన పదిహేడేళ్ల కుమార్తెను అల్లరి పెడ్తున్న పన్నెండు–పదిహేనేళ్లున్న ఆకతాయిలను బెదరగొట్టడానికి 'హొవార్డ్ స్టేపుల్‌టన్ – 2005లో 'మస్కిటో' అనే ఎలక్ట్రానిక్ పరికరాన్ని టీనేజి పిల్లలు వినగలిగిన రేంజి (17400 తరంగాలు)లో తయారుచేసి గూండాయిజం చలాయిస్తున్నవారిని హడలు గొట్టాడు. ఇద్దరు, ముగ్గురు జులాయి పిల్లలు ఏదైనా షాపు దగ్గర మూగితే 'మస్కిటో' వాళ్లు మాత్రమే వినగలిగిన రేంజిలో శబ్దాలు చేస్తుంది.

సెల్‌ఫోన్ల ద్వారా, సెల్‌టవర్ల ద్వారా వెలువడే తరంగాల వల్ల పక్షులలో తగ్గిన ప్రత్యుత్పత్తి శక్తి వీటిని గురించి, 'మూగవోయిన వసంతం'గా మరోసారి మాట్లాడుకుందాం.

ధ్వని తరంగాల ఇతర ఉపయోగాలు, సొనొగ్రఫి ప్రయోజనాలు 'ఎఖొ' పర్వతకన్యను మనకు ఎన్నటికీ గుర్తు చేస్తూనే ఉంటాయి. బీజాపూర్ గోల్‌గుంబజ్‌లోని గుసగుసల మందిరం, గోల్కొండ ఖిల్లాలో చప్పట్లు ప్రతిధ్వనించే ప్రాంతం, చైనాలోని స్వర్గదేవాలయపు ప్రతిధ్వనుల గోడ, ఇంగ్లండులోని సెయింట్ పాల్ చర్చి, మెక్సికోలోని కుకుల్కాన్ గుడి ఇంకా ఎన్నో భవనాలు తమలో దాగి ఉన్న 'ఎఖో' కన్యను ఇప్పటికీ మనకు గుర్తు చేస్తాయి.

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 7

## (రహస్య భాష)

## (Caeserean Section)

మాక్బెత్ (Macbeth) – 'ఎందుకు వృథాగా శ్రమపడతావు? తల్లి కడుపు నుంచి మామూలుగా పుట్టినవాడెవ్వడూ నన్ను చంపలేడు'.

మాక్‌డఫ్ (Macduff)- 'అవునా! అయితే నీ చావు మూడింది. మామూలుగా కనకముందే మా అమ్మ కడుపు కోసి బయటకు తీసారు నన్ను'. 'Macduff was from his mother's womb untimely ripped' –

ఈ ఘట్టం షేక్స్పియర్ (William Shakespeare) వ్రాసిన Macbeth-Act-5; Scene-8 లోనిది. మాక్‌డఫ్‌తో జరిగిన ద్వంద్వయుద్ధంలో మాక్‌బెత్ మరణిస్తాడు.

సిజేరియన్ సెక్షన్ (Caeserean Section or C.Section) ఇప్పుడు ఎంతో ప్రాచుర్యం పొందిన శస్త్రచికిత్స. అమెరికాలో 2012 సంవత్సరంలో ఇరవై ఆరు లక్షలకు పైగా సాధారణ కాన్పులు, పదమూడు లక్షలు శస్త్రచికిత్స (C.Section) కాన్పులు అంటే 33% శాతం కాన్పులు సిజేరియన్ సెక్షన్‌తో జరిగాయి. లండన్ (U.K.)లో 24 శాతం; కెనడా 26 శాతం; ఆస్ట్రేలియా 31 శాతం, అమెరికా 23–40 శాతం, కంపానియా 60 శాతం ఉండగా మనదేశంలో ఇప్పుడు 9 శాతం నుంచి పెరుగుతున్నది. పట్టణాలలో, ప్రైవేటు ఆస్పత్రులలో 10–30 శాతం కాన్పులు సిజేరియన్ సెక్షన్ వల్లనే జరుగుతున్నాయని అంచనా.

ప్రతి ఇంట్లోనూ ఇవ్వాళ సిజేరియన్ సెక్షన్ కాన్పుతో పిల్లల్ని కంటున్న వాళ్లనే చూస్తున్నాం. నమ్మకం, హస్తవాసిల స్థానే భయం, ధనం ముఖ్యపాత్రలు వహించడంతో అటు కాన్పులు కనేవాళ్లకు, చేసేవాళ్లకు మధ్య అంతరాలు అనంతంగా పెరిగి అనుమానాలెక్కువయ్యాయి. 'అమ్మాయి నెప్పులు పడలేదు, ఆపరేషను చేసేయండమ్మా' –అనేవాళ్ల సంఖ్య పెరిగింది. గంటలు గంటలు మామూలు కాన్పుచేసి మామూలు ఫీజు తీసుకునేకన్నా గంటలో ఆపరేషను అయిపోతుంది, డబ్బులూ కాస్త ఎక్కువ వస్తాయనే ఆలోచన డాక్టర్లలోనూ పెరిగింది. 'నేను పది కాన్పులు కన్నాను. సూది మందెరగను' అనే తల్లులే నేడు 'చేసెయ్ డాక్టరు ఆపరేషను' అంటున్నారు. దవాఖానాలపై దాడులు, డాక్టర్లపై

చేయి చేసుకోవడం పెరిగాక వాళ్లూ అభద్రతా భావనలకు లోనై స్వంత నిర్ణయాలకన్నా పరిస్థితులు నిర్ణయించే వాటికి తలలూపుతున్నారు. ఇద్దరు లేక ఒక సంతానం ఇప్పుడు అందరికీ ఆమోదయోగ్యమయ్యింది కనుక ప్రతి కాన్పు ఎంతో విలువైనదిగా భావించబడి, దురదృష్టకరమైన సంఘటనలు, ప్రమాదాలకు బాధ్యులుగా వ్యక్తులను నిందించడం, నిలదీయడం సర్వసాధారణమైంది.

ఇంత ముఖ్యమైన ఈ సిజేరియన్ సెక్షన్‌కు ఎంతో పూర్వ చరిత్ర ఉన్నది.

చంద్రగుప్త మౌర్యుడి భార్య దుర్ధర. నంద వంశ నిర్మూలనంలో చాణక్య చంద్రగుప్తులు ప్రధానపాత్ర వహించారు. తన శిష్యుడైన చంద్రగుప్తుడికి విష ప్రయోగ భయం లేకుండా అతడి ఆహారంలో కొద్దిపాటి మోతాదులో విషం కలుపుతూ వచ్చినాడు చాణక్యుడు. పొరపాటున ఆ ఆహారాన్ని కొంత చంద్రగుప్తుడి భార్య, పూర్ణగర్భిణి 'దుర్ధర' తిని విగతజీవురాలైంది. దగ్గర్లోనే ఉన్న చాణక్యుడది గమనించి మరణించిన దుర్ధర పొట్టను కోసి కడుపులో ఉన్న బిడ్డను బయటకు తీసినాడని, అప్పటికే ఒక చుక్క విషం కడుపులోని శిశువుకు చేరగా అతడి ముఖంపై బిందువు (మచ్చ) ఏర్పడిందని అందుకే ఆ శిశువుకు బిందుసారుడు (బింబిసారుడు) అనే నామకరణం చేసారని జైనగ్రంధం 'రాజావళి కథ'లో వ్రాయబడి ఉన్నది. చంద్రగుప్తుడు (340-298 B.C.); అతడి కుమారుడు బిందుసారుడు (298-272 B.C.); బింబిసారుని కుమారుడు అశోకుడు (269-232 B.C.).

ప్రాచీన చైనా రికార్డుల ప్రకారం- ఎల్లో ఎంపరర్ (Yellow Emperor) హువాంగ్ ది (2698-2598 B.C.) తర్వాత ఆరవ తరం వాడైన ల్యుఝాంగ్ ఆరుగురు కుమారులు - ఇదే పద్ధతిలో (Post Mortem Caeserean Section) జన్మించారని తెలుస్తోంది. అతడి ఆరవ కుమారుడు జిలియాన్ (Jilian) 'మి' కుటుంబాన్ని (House of Mi) స్థాపించాడు.

ఐరిష్ పురాణాలలో (Ulster cycle)లో ఫెర్బెండ్ అనే వీరుడి (Furbaide Ferbend) తల్లిని అతడి మేనత్త విషప్రయోగానికి గురిచేయగా తల్లి మరణిస్తుంది. అతడు కూడా మాతృమరణానంతరం శస్త్రచికిత్స ద్వారా జన్మించినవాడే.

బాబిలోనియన్ తాల్ముడ్ (Talmud) యూదు గ్రంథంలో ఈ పద్ధతిని యోట్జె డొఫెన్ (Yotzei Dofen) అని పిలిచేవారు.

ప్లిని (Pliny the elder) ప్రకారం జూలియస్ సీజర్‌కు ఆ పేరు సిజేరియన్ సెక్షన్ ద్వారా జన్మించిన దగ్గర బంధువు నుంచి వచ్చిందంటాడు.

Roman Lex Regia (Royal law) of న్యూమా. పాంపిలియస్ (Numa Pompilius 715-673 BC) కాలంలో చనిపోయిన తల్లి కడుపు కోసి బిడ్డను బయటకు తీయడం చట్ట సమ్మతమైంది. పదవ నెల గర్భిణిగా ఉన్నపుడు ఈ శస్త్రచికిత్స చేసేవారు.

'Caedere' అంటే 'to cut' (కోయడం) అని అర్థం. జూలియస్ సీజర్ పూర్వీకుడు – as ab utero caeso = cut from the womb - గర్భసంచిని కోయగా జన్మించాడని అందుకే అతడి పేరు సీజర్‌గా, అతడి తరువాత తరాలకు సంక్రమించిందని 'ప్లిని' (Pliny the elder) పేర్కొన్నాడు. అంతేకాని జూలియస్ సీజర్ తన తల్లి కడుపు నుంచి కోతవల్ల బయటకు రాలేదు. ఆమె 'అరిలియా' (Aureleia). తర్వాత మరో కుమారుడికి జన్మనిచ్చింది. అందుచేత జూలియస్ సీజర్ మామూలు కాన్పులోనే జన్మించాడంటారు.

ఈ సిజేరియన్ సెక్షన్‌కు 'Emperor's cut, Emperor's incision, Sezaryen, Imperial cut, Czar cut, అరబిక్ 'విలాదా', హీబ్రూ– నితువాఖ్ కేసరి, Kzar cut, Kaiser cut; Kaiserchnitt - ఇలా అనేక భాషలలో అనేక పేర్లున్నాయి.

క్రీస్తుశకం 1204–1240 లోని కటాలన్ సాధువు Raymond Nonnatus (Non natus - not born) పేరు. అతడు తన తల్లి కడుపు నుంచి శస్త్రచికిత్స ద్వారా జన్మించినట్లు తెలుపుతున్నది.

షానామాలో పేర్కొనబడిన ఇరాన్ యోధుడు Rostam 'రుస్తుం' జన్మ వృత్తాంతంలో సిమర్ఘ్ (Simurgh), జాల్‌కు శస్త్రచికిత్స (సిజేరియన్) ఎలా చెయ్యాలో నేర్పగా రుబాబా, ఆమె కుమారుడు 'రుస్తుం'లు బతికి బట్టకట్టినారు.

సిజేరియన్ సెక్షన్ ఆరోజుల్లో చనిపోయిన వారిమీద చేసి శిశువును బయటకు తీసేవారు. బతికున్నవాళ్ల కడుపు కోసి బిడ్డను తీసినా తల్లి బతకడం దాదాపు జరిగేది కాదు. అలా బతికిన తల్లి గురించి సాక్ష్యాధారాలతో ఋజువైనది 1850లో. స్విట్జర్లాండు - Siegershausen లో జాకబ్ న్యూఫెర్ అనే Pig gelder (వరాహ రైతు) తన భార్య నెప్పులతో పడ్తున్న కష్టాన్ని చూడలేక కడుపు కోసి బిడ్డను తీసాడని, తల్లీబిడ్డలు క్షేమమని చెప్పుకున్నారు.

రోమన్ల కాలంలో కూడా ఇటువంటి ఘటనలు అప్పుడప్పుడు జరిగేవి. క్రీస్తుశకం వరకు ఈ శస్త్రచికిత్సలో నూటికి ఎనభై అయిదు మంది మరణించేవారు.

ఆఫ్రికాలోని great lake region లో పంథొమ్మిదవ శతాబ్దపు యూరోపియన్ ప్రయాణీకులు అక్కడ ఈ శస్త్రచికిత్స సర్వసాధారణంగా జరగడం గమనించారు. పురిటినెప్పులతో బాధపడుతున్న తల్లికి ఆల్కహాలు, కొన్ని మొక్కల రసాల్ని కలిపి తాగించి ఈ శస్త్రచికిత్స చేసి శిశువును బయటకు తీసేవారు.

డాక్టర్ జేమ్స్ బారి – కేప్‌టౌన్, ఆఫ్రికాలో తొలిసారిగా ఈ శస్త్రచికిత్సను చేసిన యూరోపియన్ డాక్టరు (1817–1828 ప్రాంతంలో). అమెరికాలో (వర్జీనియా వెస్ట్) డాక్టర్ జెస్సెబార్నెట్ తన బార్య ఎలిజబెత్‌పై ఈ శస్త్రచికిత్స చేసాడు (1794లో).

మార్చి 5, 2000 నాడు మెక్సికోలో ఐనెస్ రామిరెజ్ (Ines Ramirez) తన మీద తాను ఈ శస్త్రచికిత్స చేసుకుని తన కొడుకు (Orlando Ruiz Ranirez) తో సహా బతికి బట్టకట్టింది. ప్రపంచంలో ఇటువంటి వ్యక్తి మరొకరు లేరంటారు.

శస్త్రచికిత్స ద్వారా జన్మించిన శిశువుకు, మామూలుగా జన్మించిన శిశువుకు మత న్యాయాల్లో తేడా ఉన్నది. శస్త్రచికిత్స ద్వారా పుట్టిన మగపిల్లవాడికి (Bechor - తొలి మగసంతానం) సంక్రమించాల్సిన ఆస్తి హక్కులపై యూదులలో ఇప్పటికీ వివాదమున్నది.

భారత, రామాయణ, భాగవతము, ఇతర పురాణాల్లో ఇక్ష్వాకు వంశం వాడైన కల్మాషపాదుడి భార్య మదయంతి (దమయంతి), వసిష్ఠుడి వలన నియోగ సంప్రదాయంలో గర్భిణియై పన్నెండేళ్లకూ పురిటినెప్పులు రాక, కాన్పు కాకపోవడంతో తన పొట్టను తానే ఓ పదునైన రాయి (అశ్మన్)తో కోసి బిడ్డడిని బయటకు తీసిందని అందుకే అతడికి ‘అశ్మకుడ’నే పేరు వచ్చిందంటారు. (కొన్ని పురాణాల్లో ఏడేళ్లు గర్భము, శస్త్రచికిత్స చేసింది వసిష్ఠుదని చెప్పబడింది). ఇతడికి పదకొండు తరాల తరువాత శ్రీరామచంద్రుడు దశరథుడు, కౌసల్య దంపతులకు జన్మించినాడు.

(ఈ అశ్మకుడి సామ్రాజ్యం షోడశ జనపదాల్లో (అంగ, అశ్మక, అవంతి, చేది, గాంధార, కాంభోజ, కాశి, కోసల, కురు, మగధ, మల్ల, మత్స్య, పాంచాల, సూరసేన, వజ్జి, వత్స) ఒకటి. గోదావరి, మంజీర నదుల మధ్య ప్రాంతమై, వింధ్య పర్వతాలకు దక్షిణాన ఉండేది. తెలంగాణాలోని నిజామాబాద్, ఆదిలాబాదులో కొంత, నాందేడు, యవాత్మల్ (మహారాష్ట్ర) ఈ జనపదంలో ఉండేవి. తెలంగాణాలోని ‘కోటిలింగాల’ ఈ జనపదానికి రాజధాని.)

గ్రీకు పురాణాల ప్రకారం అపోలో (సూర్యుడు) దేవుడు దేవతల వైద్యుడైన ఎస్క్లెపియస్ (Asclepius)ను ఈ రకమైన శస్త్రచికిత్స ద్వారానే తల్లి గర్భం నుంచి తీసినాడు.

ఆధునిక సిజెరియన్ శస్త్రచికిత్స ద్వారా కాన్పు చేసినది జర్మన్ గైనకాలజిస్టు ఫెర్డినాండ్ అడాల్ఫ్‌కెరర్ (Ferdinand Adolf Kehrer) 1881లో.

**సిజేరియన్ సెక్షన్ (Cesarean Section, C. Section)**
**ఎప్పుడు చేయాలి? ఎందుకు చేయాలి?**

- 39 వారాలు దాటిన గర్భిణి స్త్రీకి.
- తల్లికి గాని, బిడ్డకు గాని ప్రమాదం సంభవిస్తుందనిపించినపుడు.

**ఇతర కారణాలు :**

- బిడ్డ అడ్డం తిరిగినపుడు (Abnormal presentations)
- ఎక్కువ సమయం పడ్తున్నపుడు (Dystocia), ఎంతకూ బిడ్డ కిందకు దిగనప్పుడు.
- శిశువుకు ఊపిరాడకపోయినపుడు (Foetal distress)
- తాడు, తలకు ముందున్నపుడు (Cord prolapse)
- గర్భసంచి పగిలినపుడు (Uterine rupture)
- రక్తపోటు అధికంగా ఉన్నపుడు (High Blood pressure)
- కవలలు, ముగ్గురు లేదా ఎక్కువ శిశువులు.
- మాయలో తేడాలు (Placenta) - Placenta praevia etc
- మామూలు కాన్పు కష్టమైనపుడు, ఫోర్‌సెప్స్, వాక్యూం ద్వారా శిశువును బయటకు తీయలేకపోయినప్పుడు.
- శిశువు బరువు అధికమై ఉంటే (4 కిలోగ్రాములకన్నా అధికం)
- బొడ్డుతాడులో తేడాలు (Vasa praevia etc).
- గుర్రపు వాతం (Pre eclampsia, Eclampsia)
- తల్లికి HIV వ్యాధి ఉన్నపుడు, కొన్ని ఇతర సుఖవ్యాధులలో.
- ఇదివరకటి కాన్పులో నష్టాలు కలిగినపుడు.
- ఇదివరకు శస్త్రచికిత్స ద్వారా కాన్పు కన్నపుడు.
- తల్లిచనిపోయి శిశువు బతికే ఉంటే (Post humous).

**మూడు కారణాలు :**

- Maternal distress - తల్లికి ఇబ్బంది.
- Fetal distress - బిడ్డకు ఇబ్బంది.
- Obstetrician's (Doctor's) distress - డాక్టరుకు ఇబ్బంది.

కనీసం రెండు మూడు గంటలు నెప్పులు పడినా బిడ్డ కిందకు దిగకపోయినా, గర్భసంచి ద్వారం 4 నుంచి 6 సెంటిమీటర్లకు పైగా పెరగకపోయినా ఆపరేషను గురించి ఆలోచించాలి.

లక్షమందికి నలుగురు మామూలు కాన్పులో, పదముగ్గురు ఆపరేషన్ వలన చనిపోతారని అంచనా.

ఆపరేషన్ తరువాత కొందరికి కుట్లు చీము పట్టడం, పేగులకు అతుకులు పడడం (Adhesions), హెర్నియా లాంటి ఉపద్రవాలు, కాంప్లికేషన్‌లు రావచ్చు. కొందరు మానసికంగా దిగులు చెందుతారు. (Post Partum Psychosis)

నడముకు సూది ద్వారా మత్తు మందిస్తే (Spinal Anaesthesia) తలనెప్పి (Spinal Headache) కొంతమందికి వస్తుంది. (తాత్కాలికంగా).

ఒకసారి సిజేరియన్ శస్త్రచికిత్స తరువాత అందరికీ మరల సిజేరియన్ అవసరం ఉండకపోవచ్చు. కాని మామూలు కాన్పుకై ప్రయత్నిస్తే ప్రమాదాలు ఎక్కువ.

39 వారాలకు ముందు గర్భిణీస్త్రీకి శస్త్రచికిత్స చేస్తే శిశువుకు ప్రమాదమెక్కువ. (39-41 వారాలు - పూర్ణగర్భిణి). పసిపాపను నియోనేటల్ కేర్ యూనిట్ల (NICU) లో ఉంచాల్సి రావచ్చు.

ఏది ఏమైనా నాగరికత, ధనం, అనుమానం, భయం పెరిగినకొద్దీ సిజేరియన్ సెక్షన్ల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నమ్మకం, విశ్వాసం, ప్రేమ, కరుణ లాంటి సుగుణాలు మాత్రమే వ్యాపార దృష్టి నుంచి వ్యక్తులను మానవత్వం వేపు నడిపిస్తాయి.

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 8

## (రహస్య భాష)

## (Moon)

They dined on mince and slices of quince
Which they ate with a runcible spoon
And hand in hand, on the edge of the sand
They danced by the light of the moon.

'ఎడ్వర్డ్ లియర్' తన 'Nonsense Songs' (1871) లో వెన్నెలలో విహరిస్తున్న ఓ జంట గురించి చెబుతున్నాడు. 'రాబర్ట్ బ్రౌనింగ్'కు కోపం వచ్చింది. వెన్నెలంటే నా జేబులో పెట్టుకున్న దీపం కాంతి అనుకున్నావా? Do I carry the moon in my pocket?' -

– 'లేదు. లేదు. అయినా ఆ విషాదపు పొలికేక విన్నావు కదా! కృష్ణ పక్షపు చంద్రుని వెలుగులో చీకటి నీడలు దోబూచులాడుతుంటే తన దెయ్యపు ప్రేమికుడికై విలపిస్తున్న ఓ అమాయక ప్రేమికురాలు ఆర్తనాదం అది. గుండెల్ని పిండేస్తున్నది' – అన్నాడు కొలరిడ్జి (1816 – కుబ్లాఖాన్)

'అయినా ఎవరికి తెలుసు? అందమైన వ్యక్తులతో నిండిన ఆకాశపు నగరి నుంచి వెలువడిన కాంతిగుమ్మటం కాకూడదా ఆ చందమామ' అని కమ్మింగ్స్ చెబుతుంటే, తిలక్ అన్నాడు 'మీ సంగతి నాకు తెలియదు కాని, నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' –

మరి టెన్నిసన్ ఊరుకుంటాడా–

'వెన్నెల వీధుల్లో వెండి తెరచాప నావపై
నిను ముద్దాడి లాలించ నీ తండ్రి వస్తున్నాడు.
అంతవరకూ శయనించుము అమ్మ ఎదపై నీవు
నిదురపో చిన్నారి! నిదురపో తల్లీ!'

అంటూ టెన్నిసన్ జోలపాడుతున్నాడు.

అవును.

ఆస్మాన్ మె నికలె, తారె, చాంద్ మామా కితనే ప్యారే
దేఖో ఇన్‌కీ షాన్ నిరాలి, సూరత్ కితనీ భోలీ భాలీ

రోజ్ సబేరే ఛిప్ జాతెహై, జైసే హమ్‌సే షర్మాతే హై
ఆవో చందా మామా ఆవో, అపనీ ఘర్‌కీ బాత్ సునావో!

"రా చందమామా నీ సంగతులు చెప్పు, మా రహస్య భాష విను. ఇటు రా!"

* * *

స్త్రీల దేహాలను, మనసులను ఇంతగా కలచివేసే చంద్రుడు అనేక జాతి ప్రజలకు అనేక విధాలుగా ఆరాధనీయుడైనాడు. మానవ తెగలలో ఎక్కువ మంది చంద్రగ్రహాన్ని స్త్రీగా భావించినారు.

చీకటి పడినాక రాత్రిపూట కనిపిస్తూ నిద్ర, కలలు, మెలకువలా మరణానంతర జీవితపు సరిహద్దును సమీపింపచేసి మరల ఉదయపు వెలుగులో అదృశ్యమౌతూ తన చుట్టూరా అద్భుతాలను, మంత్రనగరాన్ని సృజింప జేసుకున్న శీతాంశుమూర్తి చంద్రుడు.

సూర్యుడిలా కాక వృద్ధిక్షయాలతో, తన వదనాన్ని ఒకవేపు మాత్రమే చూపిస్తూ నెలవంక నుంచి రాకా పూర్ణచంద్రబింబమై మరల క్రమేపీ క్షీణిస్తూ అమావాస్య చంద్రుడిలా అంతర్ధానమౌతాడు. ఈ వృద్ధి క్షయాలు కాలానికి, మార్పునకు, జనన మరణాలకు చిహ్నాలైనాయి.

పసిఫిక్ సముద్రంలోని పాలినేసియా ద్వీపవాసులకు చంద్రుడు హినా (Hina) అనే సృష్టికర్త. ఆ తల్లిని పూజించే స్త్రీలను Wahines అంటారు.

ప్రాచీన పర్షియాలో విశ్వమాత– మెత్రా (Metra) చంద్రగ్రహం.

మెక్సికోలోని అజ్టెక్‌లు చంద్రదేవతను 'మిక్తెకాక్యుతల్' (Mictecacuital) అని పిలుస్తారు. ఆమె రాత్రి వినువీధుల్లో సంచరిస్తూ మనుషుల్ని వేటాడ్తుందని భయపడేవారు.

న్యూజిలాండ్‌లోని మావొరి (Maori) జాతి ప్రజలు చంద్రదేవతను నరాహారి (Man eater) అంటారు.

ప్రాచీన గ్రీకులు మృతులు చంద్రగ్రహంలో నివాసముంటారని భావించేవారు. ఇదే భావన హిందువులలో ఉన్నది. పితృదేవతలు ఆత్మల్లా చంద్ర గ్రహంలో ఉండి పునర్జన్మకై నిరీక్షిస్తుంటారని మనవాళ్ల నమ్మకం.

మధ్య ఆసియాలోని తార్తార్‌లకు చంద్రదేవత జనన మరణాలకు అధినేత. ఇంకా రాజుల పూర్వీకులు చంద్రదేవత, సూర్యదేవుడుల సంతానమని భావించేవారు. గ్రీకుల చంద్రదేవతకు మూడు రూపాలు– హెకాటె, సెలెనా,

సింథియా. రోమన్ల చంద్రదేవత ల్యూనా (Luna). 'ఇంకా' ప్రజల (inca) చంద్రదేవత పేరు Mama killa (మామా కిల్లా, Mother moon, చంద్రమ్మతల్లి).

అమెరికా రెడ్ ఇండియన్లు చంద్రదేవతను – మరణం లేని వృద్ధ వనిత, శాశ్వతస్త్రీ అని పిలుస్తారు.

గ్రీన్‌ల్యాండ్‌లో ఇన్యూట్‌లకు చంద్రుడు వేటగాడు. నార్స్ జర్మన్ కథల్లో, హిందూ సాంప్రదాయంలో చంద్రుడు మగవాడు.

చంద్రుడిలోని మచ్చను కొందరు వృద్ధస్త్రీగా, కట్టెపుల్లలు మోస్తున్న వ్యక్తిగా, చెవుల పిల్లిగా, కప్పగా, గోదురుకప్పగా రకరకాలుగా వర్ణించారు. చైనా జపాను ప్రజలకు చంద్రుడిలోని కుందేలుకు అమరత్వాన్నిచ్చే శక్తి ఉందని నమ్మకం.

చంద్రుడిని 'మహా మంత్రసాని' (The greatest midwife) అనేవారు కొందరు. ఎందుకంటే సముద్రంలోని ఆటుపోట్లలా రక్తస్రావంలో హెచ్చు తగ్గులుంటాయని వాళ్ల నమ్మకం.

ఒక వైద్యుడు– 'ఇక నుంచి శస్త్రచికిత్సలు నేను అమావాస్య కాలంలో చేసి పున్నమి కాలంలో విశ్రాంతి తీసుకుంటాను' అన్నాడు. అతడి అనుభవంలో పున్నమిరోజుల్లో కాంప్లికేషన్లెక్కువ శస్త్రచికిత్సలు చేస్తే.

వైద్య పితామహుడైన హిప్పొక్రెటిస్ ప్రమాణం (Hippocrates oath) లానే హిప్పొక్రెటిస్ 'లా' (Hippocrates law) ఉన్నది. రాశులు మీనమేషాదులు పన్నెండింటిని శిరస్సు నుంచి పాదాల వరకు రాశులుగా విభజించి ఒక్కో రాశికి అవయవ భాగాల్ని నిర్దేశించారు. శిరస్సుకు మేషం (Aries).... పాదాలకు మీనరాశి (Pisces)..... ఇలా చంద్రుడి ప్రతి రాశిలో సుమారుగా 2½ రోజులుంటాడు. వ్యక్తి గ్రహస్థితి ప్రకారం ఆ రోజున శస్త్రచికిత్స చేసే భాగానికి అధిపతి అయిన రాశిలో చంద్రుడున్నపుడు ఆ భాగంపై గాని అవయవంపై గాని ఆపరేషన్ చేస్తే మృత్యువు గాని, ఉపద్రవాలు కాంప్లికేషన్స్ గాని సంభవిస్తాయంటాడు. (Donot touch that part with steel in which sign the moon is traversing). అయితే ఈ సిద్ధాంతాలకు శాస్త్రీయపరమైన ఆధారాలు లేవు.

మూన్‌కు మనకు గల సంబంధ బాంధవ్యాలు

Moon (month, monday, moone, mone, mona, monon)

Luna (Lunar, Seleno)

సౌరకుటుంబం పుట్టుక – 5 బిలియన్ సంవత్సరాల క్రితం.

చంద్రగ్రహం పుట్టుక – 4.5 బిలియన్ సంవత్సరాల క్రితం.

భూమిని మార్స్ (అంగారక) గ్రహమంత గ్రహశకలం ఢీకొనగా భూమి నుంచి విడివడిన ముక్క చంద్రగ్రహంగా, భూమికి ఉన్న ఏకైక ఉపగ్రహంగా మారింది. భూమిపై ఆ ప్రాంతం నీరు నిండి పసిఫిక్ (Pacific) శాంత మహా సముద్రం ఏర్పడింది. (భూమి, చంద్రగ్రహం రెండింటి ఐసొటోపిక్ సిగ్నేచర్లు–Isotopic Signatures ఒకేలా ఉన్నాయి.) భూమికి చంద్రుడికి మధ్య దూరం దాదాపు నాలుగు లక్షల కిలోమీటర్లు (3,60,000–4,06,700). భూమి చుట్టూ పరిభ్రమించడానికి 27 రోజుల ఏడుగంటల 43 నిముషాలు పడ్తుంది చంద్ర గ్రహానికి. పున్నమి నుంచి పున్నమి నాటికి పట్టేకాలం 29.5 రోజులు.

నెలసరి (Menses, Periods)కి అధిష్ఠాన దేవతలుగా గ్రీకు పురాణాల్లో వర్ణించబడినవారు శుక్లపక్షానికి –పెర్సిఫొని; నెలసరికి –ఇస్తార్ (బాబిలోన్ అరుణ దేవత). కృష్ణ పక్షానికి – డిమాటర్ (భూదేవత).

దైత్యులు (టైటాన్‌లు) హైపరియాన్, థియియాలకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు. సెలెని (Selene-చంద్రదేవత; ఈవాస్ (Eos) సంధ్యాదేవత. హిలియాస్–సూర్యదేవుడు.

సెలాస్ అంటే కాంతి. సెలెని మరోపేరు మెనె (Mene) – మూన్. ఫ్రిజియన్ చంద్రుడి పేరు – మెన్ (Men). సెలెని చంద్రవంక ఎండెమియాన్ (Endymion)ను ప్రేమించి అతడికి శాశ్వత నిద్ర వచ్చేలా చేసింది.

హిందువుల ఇతిహాసాలననుసరించి శ్రీరామచంద్రుడు సూర్య వంశీయుడు. పాండవులు చంద్రవంశ రాజులు.

గురువు బృహస్పతి భార్య తారకు బుధుడిని కన్నవాడు చంద్రుడు. విఘ్ననాయకుడిని చూసి నవ్వి 'వినాయక చతుర్థిరోజున నిన్ను చూసినవారు అపవాదుల పాలౌతారు' అన్న శాపం పొందినవాడతడు.

కుండలినీ విద్యలో 'ఇడా' నాడిని చంద్రనాడి అంటారు. చంద్రుడు సస్యాలకు, ఓషధులకు అధిపతి.

కొన్ని కొన్ని తెగలలో నెలసరి సమయాలలో ఆడవారిని ప్రత్యేకమైన కుటీరంలో ఉంచేవారు (డోగాన్ ప్రజలు). కొందరు పరిశోధకులు ఒకేచోట ఆడపిల్లలున్నపుడు వారిలో కొందరి నెలసరి (Menstrual Cycle) ఒకే విధంగా ఉండడం గమనించారు. దానికి Menstrual Synchrony అని పేరు పెట్టారు. ఇవి ఇంకా శాస్త్రీయపరంగా ఋజువు కాలేదు. చంద్రుడికి మరో పేరు (Lu-

nar). దీని నుంచే ల్యూనార్, ల్యూనాటిక్స్ పదాలు వచ్చినాయి. రోమన్ల చంద్ర దేవతకు మూడు రూపాలు– హెకాటె, ప్రొసర్పినా, ల్యూనా (చంద్రవంక).

ల్యూనాటిక్ (Lunatic) అనే పదం మానసిక రోగులకు వర్తిస్తుంది. ఈ పదానికి of the moon, moon struck - అని అర్థం. ఆ కాలంలో (క్రీస్తు శకం 4–5 శతాబ్దాలు) ఫిట్స్ (ఎపిలెప్సి), పిచ్చి (Madness) కు కారణం చంద్రుని ప్రభావమనుకునేవారు. చంద్ర గ్రహణానికి కారణంగా భావించే రాహువు, కేతువులు North, South lunar nodes - సూర్యచంద్ర భ్రమణ మార్గాలు కలిసే చోట్లు. వాటికి మన పూర్వీకులు రాక్షస రూపాల్నిచ్చినారు.

**కొన్ని ప్రశ్నలు–శాస్త్రీయ సమాధానాలు : చంద్రుడి వృద్ధి క్షయాలవల్ల–**

1) ఫిట్స్ (Epilepsy), పిచ్చి (Madness) పౌర్ణమి రోజున ఎక్కువవుతాయా?
2) శస్త్రచికిత్సలో ప్రమాదాలు అధికమా?
3) పెంపుడు జంతువులు ప్రమాదాల బారిన పడతాయా?
4) నెలసరికి నెలవంకకు సంబంధముందా?
5) జంతువులలో విపరీత ప్రవర్తన ఉంటుందా?
6) నిద్రా చక్రంలో ఏవైనా మార్పులు వస్తాయా?

వీటన్నిటికీ సమాధానం – ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలేవీ చంద్రుడి వృద్ధి క్షయాలకు పైన ఉదహరించిన విషయాలకు సంబంధమున్నదని నిర్ధారించలేదు. ఇంకా పరిశోధనలు చేస్తూ శాస్త్రజ్ఞులు వాటిని అన్ని కోణాలలో పరిశీలిస్తున్నారు.

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 9

## (రహస్య భాష)

## (Menarche)

ఈనాటి వార్తలలోని ముఖ్యాంశాలు.

- కిరిస్టి అల్‌సోప్ ఇస్తున్న సందేశమేమంటే మహిళల వయస్సు ముప్ఫై అయిదేళ్లు దాటితే సంతానం కలిగే అవకాశాలు బాగా తగ్గిపోతాయని– 'Fertility falls off a cliff'.
- Apple, Face Book - నిర్వాహకులు తమ ఉద్యోగినులకు వైద్య సదుపాయాల్లో భాగంగా 'Egg freezing' ను జనవరి 2015 నుండి అనుమతిస్తున్నారు.
- ముప్ఫై ఆరేళ్ల స్వీడిష్ మహిళకు ఇంతకు ముందు గర్భసంచి మార్పిడి (Uterus womb transplant) జరిగింది. గత సెప్టెంబర్‌లో ఆమెకు సిజేరియన్ సెక్షను ద్వారా కాన్పు చేసినారు.

మన దగ్గర ఈనాడు డాక్టర్ గారున్నారు. వారిని కొన్ని సందేహాలకు సమాధానాలను అడుగుదాం. డాక్టర్ గారూ...

1) వయసు పెరిగినకొద్దీ సంతానోత్పత్తి అవకాశాలు తగ్గడానికి కారణాలేమిటి?
2) ఎందుకు కొందరు స్త్రీలు వంధ్యలుగా (Infertile) ఉండి పోతున్నారు?
3) ఈ కొత్త సంతానోత్పత్తి విధానాలేమిటి?
4) Social egg freezing అంటే ఏమిటి?
5) గుండె మార్చినట్లు గర్భసంచి మార్చవచ్చునా?

వయసుకు సంతానోత్పత్తికి కల సంబంధం :

ఆడపిల్ల తొలిసారిగా రజస్వల అవడాన్ని 'Menarche' పెద్దమనిషి కావడం, రజస్వల, ఇలా వేరువేరు పేర్లతో పిలుస్తారు. అన్ని మానవ తెగల్లో, దేశాల్లో ప్రజలు ఈ ఘటనను Passage of Rites, స్త్రీ జీవితంలో ముఖ్య సంఘటనలలో ఒకటిగా భావిస్తారు.

రజస్వల (Menarche=గ్రీకు=men=moon; Arkhe - Beginning) యుక్తవయసు స్త్రీలలో కలిగే తొలి నెలసరి ప్రవాహం (menstrum flow). ద్వాదశ సంవత్సరాల వయస్సులో (12–14) జరిగే ఈ ఘటన ఆడపిల్ల యుక్త వయస్సుకు వచ్చినట్లుగా తెలియజేస్తుంది. సంతానోత్పత్తికి సిద్ధంగా ఆమె శరీరంలో మార్పులు సంభవిస్తాయి.

**శరీరంలో వచ్చే మార్పులు :**

- శరీరపు బరువు పెరగడం (17% కొవ్వుశాతం)
- మెదడులోని Hypothalamus లో Arcuate Nucleus లో నాడీకేంద్రం GnRH (Gonadotrophin Release Hormone ను విడుదల చేస్తుంది.
- పిట్యూటరీ గ్రంధి నుంచి వెలువడిన రసాయనాలు (Hormones) అండాశయం (Ovary) నుంచి ఈస్ట్రోజన్‌ను స్రవింపజేస్తాయి.
- రెండు మూడు సంవత్సరాలయ్యేసరికి గర్భసంచి, వక్షోజాలు, కటివలయం, కొవ్వు కణాలలో (Uterus, Breasts, Pelvis, Adipose tissue) మార్పులు సంభవిస్తాయి.
- ఈస్ట్రోజను (Estrogen) - వలన గర్భసంచి లోపలి పొర (Endometrium)కు రక్తనాళ వ్యవస్థ అధికమవుతుంది.
- ఈస్ట్రోజను పరిమాణాన్ని బట్టి ఎండోమెట్రియం పొర కరిగి, రక్తం, కణాలతో కలిసి గర్భసంచి నుంచి వెజైనా (Vagina) ద్వారా బయటకు వెలువడ్తుంది.
- ప్రతిరోజూ దాదాపు 30–35 మిల్లీలీటర్ల రక్తం బయటకు పోతుంది. కొంతమందికి విపరీతమైన కడుపునెప్పి తెరలు తెరలుగా వస్తుంది (Spasmodic Dysmenorrhoea).

రజస్వలానంతరం దాదాపు 80 శాతం మందికి మొదటి సంవత్సరంలో అండం విడుదల కాదు (Anovulatory). 50 శాతం మందికి మొదటి మూడు సంవత్సరాలు, 10 శాతం మందికి మొదటి ఆరు సంవత్సరాలలో అండం విడుదల కాక సంతానం కలగదు.

క్రమపద్ధతిలో అండం విడుదల కావడానికి (Ovulation) శరీరంలో

ఉండాల్సిన కనీస కొవ్వుశాతం 22% దీనిని న్యుబిలిటీ (Nubility) అంటారు. (Nubile=యుక్తవయస్సు, వివాహానికి సిద్ధంగా ఉన్న కన్య. 1973 నుంచి ఆకర్షణీయంగా ఉన్న ఆడపిల్లను న్యుబైల్ పదంతో పిలుస్తున్నారు. (అటువంటి పదాలు కన్యలకైతే Nympheta, Lolita; మగపిల్లలకు Faunlet, Shotaro).

అరవైశాతం బాలికలలో ఎనిమిదేళ్ల వయసు నుంచి ముందుగా చనుమొనలు, వక్షోజాలు కొద్దికొద్దిగా పెరగడం మొదలవుతుంది. (Estradiol వలన). సాధారణంగా ఎడమ వక్షోజం పెద్దగా ఉంటుంది. ఇలా వక్షోజాలు పెరగడాన్ని థెలార్కి (Thel-చనుమొన, Nipple) (Arkhe-Beginning = ప్రారంభం) Thelarche= Breast bud అంటారు. మగపిల్లల్లో రొమ్ములు పెరిగితే 'Gynecomastia' అని పిలుస్తారు.

**కొంతమంది పదేళ్లు, అంతకు లోపే రజస్వల అవుతున్నారెందుకు?**

- చిన్నప్పటి నుంచి లావుగా, బొద్దుగా ఉండడం (Childhood Obesity)
- చిన్నప్పటి నుంచి తండ్రి సంరక్షణ లేకపోయినా.
- కుటుంబంలో కలహాలు
- పుట్టినప్పుడు బరువు తక్కువగా ఉండడం (low birth weight)
- ఒకే సంతానం, తల్లిదండ్రులు స్మోకర్స్ (Smokers)
- శ్వేతజాతీయులు కానివారిలో, చనుబాలు తాగనివారు.
- తల్లికి కాన్పు సమయంలో గుర్రపువాతం, రక్తపుపోటు అధికంగా ఉన్నపుడు.
- వ్యాయామానికి దూరంగా ఉన్నవాళ్లలో.

**రజస్వల కర్మలు (Rites of Passage) :**

వివిధ దేశాల్లోని, వివిధ తెగల ప్రజలు ఈ ముఖ్యమైన ఘటనను అనేక రకాలుగా పండుగలా జరుపుకుంటారు.

- జపాన్‌లో రజస్వల అయిన బాలికకు Sekihan అనే వంటకం ఎర్రబియ్యం, చిక్కుళ్లు (Beans) కలిపి వండిన దాన్ని ఆహారంగా ఇస్తారు. ఎర్రబియ్యం దొరక్కపోతే రాగుల్ని (Millets)ను వాడుతారు.
- ఇండియాలో కొన్నిచోట్ల ఋతుసదంగు (Ruthu Sadangu) (ఋతుశుద్ధి) అనే ఉత్సవాన్ని జరుపుతారు.

- మెస్కాలెరొ అపాచీ రెడ్ ఇండియన్లు ప్రతి సంవత్సరం ఎనిమిది రోజుల పాటు ఆ సంవత్సరంలో పెద్దమనుషులైన ఆడపిల్లలందరికీ కలిపి ఒకేసారి ఉత్సవంగా చేస్తారు.
- నేపాల్‌లో 'కుమారీ'లుగా పూజింపబడే కన్యలందరూ రజస్వలానంతరం దివ్యాత్మ వారిని విడిచిపోయిందని భావించి ఆనాటి నుంచి సాధారణ జీవితాన్ని గడుపుతారు.
- ఆస్ట్రేలియాలోని Aborigines - ఆదిమప్రజలు – రజస్వల అయిన బాలికకు Love magic గురించి వివరించి, ఒక ప్రత్యేకమైన కుటీరంలో నాలుగైదు రోజులు ఉంచుతారు. రక్తస్రావం ఆగిపోయినాక ఆమె నదిలోకి వెళ్లి స్నానం చేసి వచ్చేలోపున ఆ కుటీరాన్ని అగ్నికాహుతి చేస్తారు. ఆమె వచ్చి తనకు జోడైన యువకుడితో కలిసి కాపురం చేస్తుంది.
- ఇప్పుడు అమెరికాలోని కొన్ని స్కూళ్లలో Sex education ద్వారా menarche గురించి బోధిస్తున్నారు.
- మైక్రొనెసియాలోని యులితి 'Ulithi' తెగలో మెనార్కిని కుఫర్ (Kufar) అంటారు. బహిష్టు రోజులలో Menstrual House లో, మిగతా రోజుల్లో తనకోసం నిర్మించబడిన గుడిసెలో ఉంటుంది వివాహమయ్యేంత వరకు.
- శ్రీలంకలో ఆడపిల్ల రజస్వల అయినప్పుడు ఆ సమయాన్ని బట్టి జ్యోతిష్కుడు కాలగణన చేసి భవిష్యత్ జీవితం గురించి వ్యాఖ్యానిస్తాడు. ఆరోజు పండుగలా జరుపుకుంటారు.
- ఇథియోపియా (Ehiopia)లో Beta Jewish స్త్రీలకు Menstrual huts నదులు, ఏటి ప్రవాహాల పక్కనే ఉంటాయి. అందుకే ఆ ప్రజలు తమ ఇళ్లను నీటి వసతి ఉన్న చోట నిర్మించుకుంటారు.
- నైజీరియాలోని టివ్ (Tiv) తెగ ప్రజలు రజస్వల అయిన ఆడపిల్ల పొట్టపై నాలుగు వాతలు పెడ్తారు.
- నవాజొ తెగలో (అరిజోనా, USA) జరిపే ఉత్సవాన్ని కిన్నాల్‌దా (Kinn-al-duh) అంటారు. నవాజొదేవత రూపంలో ఉండేట్లు రజస్వల అయిన ఆడపిల్లకు దుస్తులు, శిరోజాలంకరణ చేస్తారు. దానిని Changing woman

అని పిలుస్తారు. ఆమె బలాన్ని అంచనా వేయడానికి పరుగు పందేలు నిర్వహిస్తారు.

- కెనడాలోని (Canada) నూత్కాప్రజలు (Nuu-chah-nulth) రజస్వల అయిన బాలికను సముద్రంలోకి తీసుకువెళ్లి వదిలేస్తారు. అక్కడ నుంచి ఆమె ఈదుకుని తీరానికి వస్తే సంసార సముద్రం ఈదటానికి అర్హురాలని భావిస్తారు.
- ఇండియాలో హిందువులు షోడశ సంస్కారాలలో ఒకటైన ఋతుశుద్ధిని ఉత్సవంగా నిర్వహిస్తారు.
- ఇండియాలో హిందువులు షోడశ సంస్కారాలను (కర్మలను) (Sixteen Sacraments) నిర్వహిస్తారు. అందుకే ఈ భూమి కర్మభూమిగా పిలువ బడింది. అవి: 1) గర్భాదానము, 2) పుంసవనము, 3) సీమంతము, 4) జాతకర్మ, 5) నామకరణం, 6) నిష్క్రమణ, 7) అన్నప్రాశన, 8) కేశఖండన, 9) కర్ణవేధన, 10) అక్షరాభ్యాసం, 11) ఉపనయనం, 12) వేదారంభం, 13) కేశాంతం (మగపిల్లలకు); ఋతుశుద్ధి (రజస్వలానంతరం–ఆడపిల్లకు), 14) సమవర్తనం, 15) వివాహం, 16) అంత్యేష్ఠి.

వయసుకు, స్త్రీ సంతానోత్పత్తి దశలకు కొందరు 'జీవగడియారం' కారణం (Biological Clock) గా వర్ణిస్తారు. రజస్వల (Menarche) నెలసరి (Menses), గర్భము (Pregnancy); శిశుజననం (Delivery) బహిష్టు నిలుపుదల (Menopause) వీటన్నిటినీ నియంత్రించేది స్త్రీలలోని జీవగడియారం.

## వయసు పెరిగిన కొద్దీ సంతానోత్పత్తి తగ్గుతుందా?

**ఇదీ లెక్క (Henri Leridon - France)**

ముప్ఫై ఏళ్ల వయసులోపు–

నూటికి డెబ్బై మందికి సంవత్సరంలోపు గర్భం వస్తుంది.
నూటికి తొంభై మంది నాలుగేళ్లలోపు గర్భిణీలవుతారు.

ముప్ఫై అయిదేళ్ల వయసులోపు–

నూటికి 66 మందికి సంవత్సరంలోపు
నూటికి 84 మందికి నాలుగేళ్ల లోపు

నలభై ఏళ్ల వయసులోపు-

నూటికి 44 మందికి సంవత్సరం లోపు

నూటికి 64 మందికి నాలుగేళ్ల లోపు గర్భవతులౌతారు.

హంగరీలో ఒక అధ్యయనం ప్రకారం ముప్పై ఏళ్లలోపు స్త్రీలలో పదిశాతం, ముప్పై అయిదేళ్లలోపు స్త్రీలలో (13-22%); నలభై ఏళ్లలోపు స్త్రీలలో (24-46%) Infertility వంధ్యత్వం ఉంటుందని తెలిసింది.

**సాధారణాంశాలు :**

తొలిసారి నెలసరి (రజస్వల-Menarche) 12-14 సంవత్సరాల వయస్సు.

గర్భము ధరించడానికి అవకాశము ఎక్కువ ఉండే వయస్సు 20-28 సం॥

అవకాశాలు సన్నగిల్లే వయస్సు - 35 సంవత్సరాల నుండి

బహిష్ఠులు ఆగే ముందు కాలం - Perimenopause - 6-8 సంవత్సరాల ముందు.

బహిష్టులుడగడం (Menopause) - 40-61 సంవత్సరాల వయసులో.

నెలసరి ఆగిపోవడం (బహిష్టు ఆగడం, ముట్లుడగడం) - ఒళ్లంత వెచ్చటి చల్లటి మంటలు, రాత్రిళ్లు చెమట పట్టడం, తలనెప్పి, మైగ్రేన్, గుండెదడ, జననేంద్రియాల్లో మార్పులు, (దురద, పొడిగా మారడం), మూత్ర సంబంధమైన ఇబ్బందులు, నడుంనెప్పి, కీళ్లనెప్పులు, శరీరమంతా చీమలు పారినట్లు అనిపించడం, దిగులు, నీరసం, చిరాకు, నిద్ర పట్టకపోవడం, శృంగారాభిలాష తగ్గడం - ఇవన్నీ మెనొపాజ్ చిహ్నాలు.

40-61 సంవత్సరాల మధ్య సంభవించే మెనోపాజ్ ఎక్కువమందికి 51 సంవత్సరాల వయసులో వస్తుంది.

జపాన్‌లో దీనిని Luxury disease అంటారు. ఎందుకంటే డబ్బున్న వాళ్లు మాత్రమే మెనొపాజ్ (Menopause = Konenki) ను ప్రకటించుకుంటారని, మిగతావాళ్లు దానిని జీవితంలో ఓ మార్పు కింద భావించరు కనుక.

హిందూ స్త్రీలను మెనొపాజ్ తరువాత దేవాలయాల్లోకి అనుమతిస్తారు.

1930 నుంచి మెనొపాజ్‌ను ఒక వ్యాధి కింద ఉత్తర అమెరికా, బ్రిటన్‌లలో గుర్తించి 'Standardization of the body' విధానంలో వైద్యం చేస్తున్నారు.

రీసస్ కోతులు, చింపాంజీలు, ఏనుగులు, తిమింగలాల్లో మెనొపాజ్ ఉన్నది కాని కుక్కల్లో, పిల్లుల్లో మెనొపాజ్ లేదని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

ఆఖరు నెలసరి తరువాత 12 నెలలు గడచినాక స్త్రీ మెనొపాజ్‌లో ప్రవేశించినట్లుగా భావిస్తారు.

## ఎందుకు కొందరు స్త్రీలు సంతానలేమితో బాధపడ్తున్నారు?

సంతాన లేమి (వంధ్యత్వం–infertility) అనేది 15–44 సంవత్సరాల మధ్య వయసు ఉన్న స్త్రీలలో 10 శాతం మందికి ఉంటుంది.

మగవారిలో వారికోసీల్ (Varicocele); ఇంద్రియ కణాలు లేకపోవడం, తక్కువగా ఉండడం (Azoospermia, low count) వంటి కారణాలు, ఆడవాళ్లలో అండాశయం, గర్భవాహిక, గర్భసంచిలో సమస్యలు; ఆల్కహాలు, పొగతాగడం, మందులు, కాన్సర్ కీమోథెరపి, రేడియేషన్ ఇవన్నీ సంతానలేమికి కొన్ని కారణాలు. సంతానలేమితో బాధపడ్తున్న దంపతులలో– భర్తలో ఉన్న లోపాల వల్ల మూడవవంతు మంది, భార్యలో ఉన్న లోపాల వలన మూడవ వంతు మంది, ఇద్దరిలోనూ లేక ఇతర కారణాల వలన మరో మూడు వంతుల మందికి సంతానం కలగదు.

## కొత్త సంతానోత్పత్తి విధానాలేమిటి ?

- మందులు
- గర్భసంచిలో ఇంద్రియాన్ని ఉంచడం (Intra Uterine insemination)
- ART (Assisted Reproductive Technology) (11-39% success)
  - IVF (In vitro Fertilization) (టెస్ట్‌ట్యూబ్ బేబీ)
  - Zygote transfer
  - Gamete transfer
  - Intracytoplasmic sperm injection
- Surrogacy (అద్దెగర్భం) – భర్త వీర్యం వేరొక స్త్రీలో ఉంచగా ఆమె గర్భిణీగా, నవమాసాలు శిశువును మోసి కన్నాక దంపతులకిచ్చుట.
- Gestational Carrier – (పిండగర్భం) – భార్యాభర్తల అండం వీర్యం కలయికతో తయారైన పిండాల్ని అద్దెగర్భంలో ఉంచడం.

**'Social egg freezing' అంటే ఏమిటి?**

అభివృద్ధి చెందిన అండాలను - లిక్విడ్ నైట్రోజన్‌లో $-196^0c$ (సెంటిగ్రేడ్) దగ్గర నిల్వ ఉంచుతారు. అవసరమైనప్పుడు వాటిని మామూలు ఉష్ణోగ్రతకు తెచ్చి గర్భసంచిలో ప్రవేశపెడతారు.

'Social egg freezing' ఎవరైనా స్త్రీ తనకిప్పుడే వివాహం వద్దు కాని, తన ప్రశస్తమైన అండాలను దాచి ఉంచుకోదలుచుకుంటే శీతల పద్ధతిలో వాటిని నిల్వ ఉంచి తనకు కావాల్సినప్పుడు తన సహచరుడి వీర్యంతో వాటిని కలిపి - టెస్ట్‌ట్యూబ్ బేబీ - IVF పద్ధతిలో సంతానాన్ని పొందవచ్చును.

మలేసియా, ఆస్ట్రేలియా, బ్రిటన్, నెదర్లాండ్స్, అమెరికాలో ఈ పద్ధతి బహుళ ప్రచారంలో ఉన్నది.

క్యాన్సర్‌తో బాధపడ్తున్న స్త్రీలు కీమోథెరపి, రేడియోథెరపిలకు ముందే అండాలను శీతల పద్ధతిలో నిల్వ ఉంచుకుని తరువాత IVF పద్ధతిలో సంతానాన్ని పొందవచ్చును.

భారతంలో (కౌరవుల జననం) గాంధారీ తన పొట్టపై మోదుకొనగా బయటపడిన గర్భశకలాలను నేతికుండలలో భద్రపరచి శీతల ప్రదేశంలో ఏడాదిపాటు ఉంచాక పిండాలు పెరిగి శిశువులుగా జన్మించారని చెప్పబడింది.

**గుండె మార్చినట్లు గర్భసంచి మార్చవచ్చునా?**

మొదటి గర్భసంచి మార్పిడి (Uterine transplant) టర్కీలోని అంటల్యా (Antalya) (9-8-2011)లో పుట్టుకతోనే గర్భసంచి లేని స్త్రీకి చేసినారు. ఆమె గర్భం దాల్చింది కాని ఎనిమిదవ వారంలో గర్భస్రావమైంది.

2012లో స్వీడన్‌లో తల్లి నుంచి కుమార్తెకు గర్భసంచి మార్పిడి చేసినారు. 2013లో స్వీడన్‌లో గర్భమార్పిడి చేసుకున్న స్త్రీ 2014 అక్టోబరులో సిజేరియన్ సెక్షన్ ద్వారా మగశిశువును కన్నది.

భాగవతంలో బలరాముడి జననం గురించి చెప్పబడింది. సప్తమ గర్భాన్ని దేవకి గర్భము నుంచి రేవతీ గర్భంలోకి మార్చగా జనించిన శిశువును 'సంకర్షణుడు' అని, రాముడని, బలరాముడని పిలిచినారు. Embryo transfer గా దీనిని చెప్పవచ్చును.

భారతంలో కౌరవ జననం – గర్భ శకలాలను నేతి కుండలలో ఉంచి శీతలస్థితిలో ఉంచగా నవమాసాలూ పూర్తయినాక కౌరవులు నూరుగురు, నూట ఒకటో శకలం 'దుస్సల'గా జననమొందుతారు. ఇవి ఆనాటి Test Tube method గా పరిగణించవచ్చును.

ద్రోణుడు, అగస్త్యుడు, ద్రుపదుడు వీళ్లంతా వీర్యాన్ని నేతి కుండల్లో ఉంచి శీతల స్థితిలో నిల్వ ఉంచగా పుట్టినవాళ్లు. టెస్ట్‌ట్యూబు బేబీలే కానీ వీళ్లు అండం నుంచి పుట్టలేదు.

ఇంద్రుడికి వృషణాల మార్పిడి (Testicles transplant), మగవాళ్లు గర్భం ధరించడం (యువనాశ్వుడు మాంధాతకు జన్మనివ్వడం, కృష్ణుడి కొడుకు సాంబుడు శాపవశాన గర్భాన్నిదాల్చి ముసలాన్ని కనడం) శివుడు తన కుమారుడైన వినాయకుడికి ఏనుగు తలను (తల మార్పిడి– Head transplantation) మార్పిడి చేయడం, స్త్రీగా జన్మించి పురుషుడుగా మారడం (ఇళ–సుద్యుమ్నుడు). ఇళ రూపంలో బుధుడిని వివాహమాడగా ఇళా బుధులకు పురూరవుడు జన్మిస్తాడు. (చంద్రుడు, తారల కుమారుడు బుధుడు) – ఆ విధంగా చంద్రవంశం ప్రారంభమవుతుంది.

రామాయణ, భారత ఇతిహాసాల్లో, పురాణాల్లో ఇటువంటి విశేషాలెన్నో ఉన్నాయి. వీటిని మనం క్రమేపీ తెలుసుకుందాం ఈ రహస్యభాషలో.

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 10

## (రహస్య భాష)

## (Boy or Girl)

అనాది కాలం నుంచీ ఈ గొడవ ఆడవాళ్లకు తప్పడం లేదు. ఏదో ఒకటే ఎన్నుకోవాలి తప్పదంటే ఏం చేస్తుందామె? పిల్లలంటే ఇష్టంలేని వాళ్లెవరు? అయినా ఒక్కోసారి తెగించి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుంది.

క్రీస్తుపూర్వం 970-931 ప్రాంతంలో ఇజ్రాయెల్ దేశానికి ప్రభువు సొలొమాన్. ఓ రోజున అతడికి న్యాయనిర్ణయం చేయాల్సి వచ్చింది. సమస్య చాలా తీవ్రమైంది. ఒకే ఇంటిలో నివసిస్తున్న ఇద్దరు స్త్రీలకు ఒకే వయసున్న ఏడాదిలోపు కొడుకులు. ఒకేలా ఉంటారిద్దరూ. ఒక దురదృష్టకరమైన రాత్రి ఒక తల్లి నిద్రలో ఒత్తిగిల్లగా నలిగి ఓ పసికందు కన్నుమూసాడు. ఆమె చనిపోయిన తన పసికందును నిద్రపోతున్న ఆమె పక్కలోకి మార్చి బతికున్న పసిబిడ్డను తనవేపుకు తీసుకోబోతుంటే రెండో ఆమె కళ్లు తెరిచి ఏదో కుట్ర జరుగుతున్నదని గమనించింది. బతికున్న బిడ్డ నాదంటే నాదని ఇద్దరూ తిట్టుకుని, కొట్టుకుని సమస్య తెగక బతికున్న పసికూనను తీసుకుని ఘనత వహించిన, 'సొలొమాన్' ప్రభువు తీర్పు కోసం వచ్చారు.

ధర్మసంకటంలో పడినాడు సొలోమాన్ ప్రభువు. దేవుడు... సోలోమాన్‌ను నీకేం కావాలంటే అతడు కోరుకున్నదదే యుక్తాయుక్త విచక్షణ (Wisdom). ఒక్కక్షణం ఆలోచించి తలారిని రప్పించి ఆ పసిబిడ్డడిని నిలువుగా, సమంగా రెండుగా నరికి ఆ తల్లులిద్దరికీ చెరొక ముక్కా ఇచ్చేయమన్నాడు. సభ యావత్తూ దిగ్భ్రాంతి చెందింది. ఏమిటీ తీర్పు? ప్రభువు ఉద్దేశమేమిటి? అంతటా నిశ్శబ్దం.

తలారి కత్తి పైకెత్తాడు. ఇంకో క్షణం ఆగి ఉంటే పసిబిడ్డడు రెండు ఖండాలై పోయేవాడు. ఆ ఇద్దరు స్త్రీలలో ఒకామె దిగ్గున అడ్డం వచ్చింది ఏడుస్తూ- "ప్రభూ! ఈ బిడ్డడిని ఆమెకే ఇచ్చివేయండి, అతడు బతికుంటే చాలు". అదేక్షణం రెండో స్త్రీ కూడా ఆవేశంగా అరిచింది.

"మీ తీర్పు గొప్పది ప్రభూ! రెండు ముక్కలు చేయండి. నాకు దక్కనిది ఆమెకూ దక్కడానికి వీల్లేదు!"

ఒకామె ప్రేమమూర్తి. ఇంకోస్త్రీ అసూయా గ్రస్తురాలైన క్రోధవతి. సొలొమాన్‌కు నిజం తెలిసింది. ప్రేమమూర్తికి బిడ్డడినిప్పించి, అసూయకు లోనైన ఆమెతో నిజం చెప్పించాడు.

సోఫీకి ఎదురైన సమస్య ఇటువంటిదే! కాని కొంచెం తేడా. అక్కడ (Auschwitz) న్యాయమూర్తులు వేరు. నియంత భటాధిపతుల్లో ఒకడు (Doctor Mengele) నిష్కర్షగా పలికాడు– "ఇద్దరూ నీ పిల్లలే. ఒకరిని ఎంచుకో! లేదా ఇద్దరినీ గ్యాస్ ఛాంబర్లోకి పంపిస్తాము".

కొడుకును కాపాడుకోవాలా, కుమార్తెనా? విలియం స్టిరాన్ (Willian Styron) 1979లో వ్రాసిన 515 పేజీల నవల 'Sophie's Choice'ను తరువాత Meryl Streep 'సోఫీ'గా (Best actress Academy Award-1982). సిన్మా తీసారు. ఒకరిని గ్యాస్ ఛాంబర్లోకి, ఒకరిని లేబర్ క్యాంపులోకి ఎవరిని, ఎటు పంపాలి? రెండూ మనస్సును, జీవితాన్ని అతలాకుతలం చేసేవే! 'సోఫీ' పరిస్థితి అంతే అయ్యింది. ఒకరు ఆరోజే మరణిస్తే ఇంకొకరు కొంతకాలం లేదా, పూర్తికాలం బతకవచ్చు. ఎవర్ని ఎంచుకోవాలి?

రాములమ్మకు ముగ్గురాడపిల్లలు. అత్త, ఆడపడుచులు, మొగుడూ విసుక్కోని, తిట్టని క్షణముండదు. మళ్లీ కానుపు. ఆడ, మగా ఎవరుంది కడుపులో చెప్పమంటే డాక్టర్లు చెప్పడం లేదు. రూల్స్ ఒప్పుకోవట. బాగా పైసలిచ్చుకుని ఒక డాక్టరు చెప్పిండు మళ్లా ఆడపిల్లేనని. ఇంట్లో వీరంగం. ఒకటే లొల్లి. ఉన్నోళ్లనే సాదలేక చస్తున్నాం, ఈళ్లనెవడు పోషించాలె, పెట్టుపోతలెవ్వడు పెట్టాలె, పెళ్లిళ్లెట్టా చేయాలె. ఇదే గొడవ. కడుపు తీయించుకో లేకుంటే వదిలేస్తా నంటున్నాడు మగాయన, ఇది చచ్చినా పీడా పోయేదంటది అత్తమ్మ. పుట్టింటోళ్లు పట్టించుకోరు. ఇప్పటికే నీ ముఖాన మూడెకరాలమ్మి పెట్టాము కట్నం, కానుకలు, కాన్పు ఖర్చులకి– ఇక మావల్ల కాదన్నారు వాళ్లు. ఇంట్లో ఆడపిల్లలు ఈ గొడవల్కి బిక్కుబిక్కుమంటూ తిరుగుతారు. ఏం బతుకో ఈ ఆడబతుకు! ఇప్పుడేం చేయాలి 'కడుపు తీయించుకుని కాన్పు ఆపరేషను చేయించుకో'– అని అందరిదీ ఒకటే పోరు. తప్పు నాదేనా? తప్పదా? నేనేం చెయ్యాలి?

కాలం మారింది. ఇది క్రీస్తుశకం 2015వ సంవత్సరం. ఎవరి బిడ్డ ఎవరో తేల్చడానికి జన్యు పరీక్షలు వచ్చాయి. ఇప్పుడు కత్తితో పని లేకుండానే

అసలు తల్లిని నిర్ధారణ చేయవచ్చు. దీనినే DNA Testing, Genetic Finger Printing అంటున్నారు. నోటి లోపలి బుగ్గల (Cheek) కణాలు – Buccal Mucous Membrane - లేదా రక్తనమూనా తండ్రి – పిల్లలు లేదా తల్లి–పిల్లలు ఇద్దరి నుంచి సేకరించి DNA పరీక్ష చేస్తారు.

వెనకటి రోజుల్లో గర్భస్థశిశు దశలోనే తల్లి గర్భంలోని ఉమ్మనీరు (Amniotic fluid) కొరియానిక్ విల్లై శాంప్లింగ్, (Placental tissue) ద్వారా సేకరించేవారు. వీటివల్ల ఒక్కోసారి గర్భస్రావం కావచ్చును.

నవీన పద్ధతుల్లో– గర్భిణీస్త్రీ రక్తంలో ప్రవహిస్తూ ఉండే శిశు రక్తకణాల్నుంచి DNA సేకరించి వాటిని పరీక్షించి, తల్లి లేక తండ్రి కణాల్లోని DNA తో పోల్చిచూస్తారు.

ఆ విధంగా సంతానం బాధ్యత, పోషణ, ఆస్తి–హక్కులు, వారసత్వం, సామాజిక అవసరాలు, వలస, పెంపకం, వ్యవహారాల్లో ఈ పరీక్షలు ఉపయోగపడతాయి.

మగపిల్లవాడి తండ్రి ఎవరు?

దేవతల గురువు బృహస్పతి. అతడి భార్య తార. శిష్యుడుగా అందగాడైన చంద్రుడు. తార గర్భవతి. కొడుకు పుట్టాడు బుధుడు. నా కుమారుడంటే నా కుమారుడని గురుశిష్యులు వాదించుకున్నారు. గురుద్రోహం చేసిన చంద్రుడికి శాపం తగిలి వృద్ధిక్షయాల పాలయ్యాడు. బ్రహ్మ దిగిరాక తప్పలేదు. పక్కకు పిలిచి తారనడిగాడు. నిజం చెప్పు. ఎవరు బుధుడి తండ్రి ఇంతకీ అని. తార సిగ్గుపడుతూ చంద్రుడివేపు చూపించింది.

మరి అటువంటి కథలు ఇప్పుడు కోకొల్లలు. ఒక్కోసారి ఆమెకే తెలవదు ఎవరు ఎవరి పిల్లలో. ఈ గొడవ గ్రీకు పురాణాల్లో ఉన్నది. జ్యూస్ దేవేంద్రుడి కన్ను స్పార్టారాణి 'లెడా' (Leda) పై పడింది. లెడా భర్త టిండారియస్. పగటిపూట ఆమె సరస్సులో జలకాలాడ్తుంటే హంసరూపంలో వచ్చి జ్యూస్ దేవుడు ఆమెతో శృంగారం వెలగబెట్టాడు. అదేరాత్రి భర్త టిండారియస్‌తో కాలక్షేపం చేసాక ఆమెకు రెండు గుడ్లు పుట్టాయి. ఆ గుడ్ల నుంచి పుట్టిన ఇద్దరు ఆడపిల్లలు ఒకరు క్లైటిమ్నెస్ట్రా, రెండవది హెలెన్. ఇద్దరు మగపిల్లలు– కాస్టర్, పొల్లాక్స్.

హెలెన్, పొల్లాక్స్‌లు దైవాంశ సంభూతులుగా, క్లైటిమ్నెస్ట్రా, కాస్టర్‌లు మానవులుగా పరిగణించబడ్డారు. చనిపోయాక మగపిల్లలిద్దరూ ఆకాశంలో జెమిని (Gemini) మిథునరాశిగా వ్యవహరించబడినారు (Dioscuri).

క్లైటిమ్నెస్ట్రా భర్త ఆగమెమ్నాన్. హెలెన్ భర్త ఆగమెమ్నాన్ తమ్ముడు మెనెలాస్. హెలెన్‌ను మోహించిన ట్రాయ్ రాజకుమారుడు 'పారిస్' ఆమెను లేవదీసుకుని ట్రాయ్ నగరానికి ఉడాయిస్తాడు. ఆ కారణంగా ట్రోజన్ యుద్ధం సంభవిస్తుంది.

ఇప్పుడు Paternal testing అందుబాటులోకి వచ్చింది. మగపిల్లవాడి తండ్రి ఎవరో తెలియాలంటే 'y' క్రోమోజోమ్‌ను పరీక్షిస్తే చాలు.

మైటోఖాండ్రియల్ DNA తల్లినుంచే వస్తుంది కనుక. ఆ విధంగా తల్లి ఎవరో తెలుసుకోవచ్చు.

ఫలానా వాడే తండ్రి అని, ఆమె ఖచితంగా చెబుతున్నది. కాని అతడు అందుబాటులో లేడు. మరి ఎట్లా ఋజువు చేయడం. అతడి సోదరులుంటే వాళ్ల రక్తాన్ని DNA పరీక్ష చేసి పసిబిడ్డ DNA తో పోల్చిచూసి అవునా, కాదా అని నిర్ధారించవచ్చు. దీనిని Reverse Paternity Testing అంటారు.

తల్లి ఎవరో తెలుసుకోవాలని ఎప్పుడనుకుంటారు?

1) దత్తత వెళ్లిన పిల్లలు తమ తల్లి ఎవరో తెలుసుకోవాలనుకున్నపుడు.

2) ఆస్పత్రులలోల పిల్లలు మారారని అనుమానం వచ్చినపుడు.

3) లేబరేటరీలో తన అండం కలిపారా వేరే వాళ్లదా అని తల్లికి అనుమానం వచ్చినపుడు.

**ఒక 'తివారి' కథ :** 2008లో రోహిత్ శేఖర్ అనే అతడు తన తండ్రి తనను తన కుమారుడు కాదంటున్నాడని Paternity వ్యాజ్యం వేసాడు. తల్లి ఉజ్వలశర్మ. తండ్రి తివారి అని ఋజువయ్యింది ఈ Paternity test తో, హైకోర్టు చొరవతో. అతడు 88 ఏళ్ల నారాయణదత్ తివారి – (ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిగా, ఆంధ్రప్రదేశ్‌కు గవర్నర్‌గా పనిచేసినవాడు). మొన్నీమధ్యనే ఉజ్వలశర్మను పెళ్లి చేసుకున్నాడు గత్యంతరం లేని పరిస్థితుల్లో.

'సోఫీ' కథ వేరు. ఒక తల్లిగా ఎవరికి మరణశిక్ష విధించాలో ఆమెకు అర్థం కాదు. శిక్ష విధించాక తన కన్నకూతుర్ని ఆ 'Gestapo' క్రూరులు లాక్కుపోతుంటే కన్నీరు మున్నీరయ్యింది. ఆ తరువాత తన కొడుకేమయ్యాడో తెలీదు. చివరకు తనకు తోడనుకున్న ప్రియుడి ఉగ్రప్రవృత్తితో సతమతమై అతడితో కలిసి ఆత్మహత్య చేసుకుంటుంది.

రాములమ్మ పరిస్థితి ఇంకో తీరు. సమాజం ఆడపిల్లలను ఎలా చూడాలో ఎప్పుడో నేర్పింది. పుట్టి, ఏడుస్తూ, చస్తూ బతుకుతున్న తన బతుకు కన్నా పుట్టకమునుపే దాని పీడ విరగడ  చేసుకుంటే పోలా అనిపించాక మనసు రాయి అవుతుంది. గర్భంలోని రక్తంగడ్డ ముక్కలుగా రాలిపోయినా పెద్ద బాధ అనిపించదు. అందుకే రాములమ్మలకు అంత మానసిక వేదన ఉండదు. ఎటొచ్చీ సమాజం మారాలి. మగాళ్లూ, దగ్గరవాళ్లూ మారితే ఆడపిల్ల ఏడపిల్లో కాక బంగారుతల్లిగా మనగలుగుతుంది. 'యత్ర నార్యస్తు పూజ్యతే' నిజమవుతుంది.

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 11

## (రహస్య భాష)

## (How Many Children?)

ఎక్కువమంది పిల్లల్ని కనడం తప్పుకాదారోజుల్లో! ఎవరైనా పెద్దాయనో, పెద్దమ్మో, గురువో ఇంటికి వస్తే మర్యాదలు చేసి కాళ్మొక్తే– "చిరంజీవిగా, సౌభాగ్యవతిగా, గంపెడు పిల్లల్ని కని, గొడ్డూ గోదా, పిల్లాజెల్లాతో హాయిగా నిండు నూరేళ్లు జీవించవమ్మా" అని ఆశీర్వదించేవాళ్లు.

కాలం మారింది. మనుషులూ మారిపోయారు. "ఎంతమంది బాయ్‌ఫ్రెండ్స్, గరల్‌ఫ్రెండ్సున్నా ఫర్లేదు ఒక్కర్ని కని విరమించుకో తల్లీ"– అని ప్రభుత్వాలు (చైనా), తల్లిదండ్రులు, అత్తమామలూ, భర్త ఆడబిడ్డలు ముందే అంక్షలు పెడ్తున్నారు. ఫేస్‌బుక్కు, వాట్సప్, ట్విట్టర్ రోజుల్లో, కాల్‌సెంటర్లలో కాలం గడచిపోతుంది. కనక పెళ్లికన్నా కలిసి జీవించడంలో లాభాలు కనిపించి యువతరమంతా ఎవరి గదుల్లో వాళ్లు ప్రోగ్రాములు రాసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు గనక ప్రస్తుతం శృంగార కాండలు, విరహ వేదనలూ, పిల్లల్ని కనడాలూ పెద్ద తలనెప్పి వ్యవహారాలైపోయాయి.

ముప్ఫై ఏళ్లు వయసు దాటాక పిల్లల్ని కనాలంటే బద్ధకం వేస్తుంది కదా! పిజ్జాల్ని ఆర్డర్ చేసినట్లు పిల్లల్ని ఆర్డర్ చేసే కొత్త పద్ధతుల్ని మాట్లాడుకునే ముందు ఒకే కాన్పుల్లో ఇద్దరు, ముగ్గురు, నలుగురు... ఇట్లా తొమ్మిది మందిని... ఇంకా ఎక్కువమందిని కనవచ్చా, కన్నవాళ్లున్నారా వాళ్ల కథాకమామీషూ– దానికన్నా ముందు ఓ పాత కథ చెప్పుకుందాం.

అనగా అనగా ఒక యువరాజు. వేటకి వెళ్లినపుడు అడవిలో తెల్లటి జింకను చూసి తరుముకుంటూ పోయాడు. పోగాపోగా కాకులు దూరని కారడవిలో చెట్లచీకట్ల మధ్య జింక అదృశ్యమైంది. అలిసిపోయిన యువరాజు దాహంతో అలమటిస్తూ ఉండగా దూరంగా ఓ సరస్సు కనిపించింది. ఆనందంగా అక్కడకు పోయి కాసిని నీళ్లు తాగేసరికి అల్లంత దూరంలో ఓ అందాల వనకన్య జలకాలాడ్తూ కనిపించింది. ఆమె మెడలో ధగధగా మెరుస్తున్నదో స్వర్ణహారం.

ఇద్దరూ ప్రేమలో పడ్డారు. ఆమెను గాంధర్వ వివాహం చేసుకుని తన కోటకు తీసుకువచ్చాడు యువరాజు. ఆమె పేరు రాజహంస. యువరాజు సవతితల్లికి ఆమె నచ్చలేదు. ఎందుకంటే ఎన్నిక చేసిన గొప్పగొప్ప రాచకుమార్తెలను కాదన్న యువరాజు ఈ అడవిపిల్లను ఇష్టపడడం. అంతేకాక ఈమె తనకన్నా అందంగా ఉండడం. ఆమె మంత్రగత్తె కనుక తగిన సమయం కొరకు వేచిచూసింది.

కొన్నాళ్లకు రాజహంస గర్భందాల్చి ఆరుగురు మగపిల్లలు, ఒక ఆడపిల్లను కని ఆదమరచి నిద్రపోయింది. పుట్టేప్పుడే మెడలో బంగారు గొలుసుల్తో పుట్టారు వాళ్లు. యువరాజు ఆరోజున ఇంటికి తిరిగివచ్చేసరికి మహారాణి ఆ పిల్లల్ని చంపి అడవిలో పారేయమని తన నమ్మకస్తుడైన సేవకుడికి అప్పచెప్పి ఆ పిల్లల స్థానంలో కుక్కపిల్లల్ని ఉంచి యువరాజుకు మాయమాటలు చెప్పి మనసు మార్చింది. తన మంత్రశక్తితో రాజహంసను వికృతాకారంలో చూపించింది.

సవతితల్లి మాటల్ని నమ్మిన యువరాజు ఆమెను ఆమె గదిలోనే నిర్బంధించాడు. అక్కడ సేవకుడు ఆ పసిపాపల్ని చంపడానికి మనసొప్పక అడవిలో వదిలేసి వెళ్లిపోయాడు. ఆ పసికందుల్ని హంసలు, బాతులు, ఇతర జంతువులు సాకి పెంచి పెద్దచేసాయి. అలా ఏడేళ్లు గడిచాయి. ఒకరోజు యువరాజు వేటకు వెళ్లినపుడు ఏడుగురు పిల్లలు కనబడి మాయమయ్యారు. వాళ్లెవరో కనుక్కుని రమ్మని ఓ సేవకుడిని నియోగించాడు యువరాజు. వెదకగా వెదకగా ఆ సేవకుడికి ఓ సరస్సు వద్ద ఆరుగురు మగపిల్లలు తమ మెడలోని స్వర్ణహారాల్ని ఆడపిల్లకిచ్చి హంసలుగా మారి నీళ్లలో ఈదడం కనిపించింది. వాడు ఆ ఆడపిల్ల చేతిలోని ఆరు స్వర్ణహారాలూ లాక్కుని పారిపోయి వాటిని ఓ స్వర్ణకారుడికిచ్చి కరిగించమన్నాడు.

పాపం, ఆ ఆడపిల్ల దుఃఖిస్తూ హంసలరూపంలో ఉన్న తన అన్నలతో కలిసి తన తండ్రి ఉన్న కోటలోని ఉద్యానవనం చేరుకుంది. అక్కడి సరస్సులో వాళ్లని ఉంచి వాళ్లకు రొట్టెముక్కలు తేవడానికి కోటలోకి వెళ్లింది. యువరాజు ఆ చిన్నారిని చూసి ఆశ్చర్యపోయాడెందుకంటే ఆమె అచ్చుగుద్దినట్లు ఆమె తల్లి పోలికల్తో ఉన్నది గనుక.

అసలు విషయం అర్థమయ్యింది యువరాజుకు. పశ్చాత్తాపంతో కుమిలిపోతూ రాజహంసను నిర్బంధం నుంచి విడిపించి క్షమాపణ కోరుకున్నాడు. స్వర్ణకారుడ్ని, సేవకుడిని రప్పించి స్వర్ణహారాల్ని హంసల మెడలో వేయగా అవి మగపిల్లలుగా మారిపోయాయి.

తన మంత్రశక్తి వికటించడంతో యువరాజు సవతితల్లి గుడ్లగూబగా మారి ఎగిరిపోయింది. యువరాజు, రాజహంస తమ ఏడుగురు పిల్లలతో హాయిగా కలకాలం జీవించారు.

ఒకే కాన్పులో ఏడుగురు పిల్లలు పుట్టి వాళ్లు చిరకాలం జీవించడమనేది అరుదైన సంగతి. ఈ కాలంలో అడపాదడపా ఈ సంఘటనలు Assisted Reproductive Technology (ART) వల్ల సంభవిస్తున్నాయి.

ఇంద్రియకణం (Spermatozoa), అండము (Ovum) కలిస్తే 'జైగోట్' (Zygote) ఏర్పడ్తుంది. జైగోట్ అంటే Joined కు Yoked అని అర్థం. మిల్లీమీటర్లో పదోవంతు సైజు ఉంటుంది జైగోట్.

- ఒకే జైగోట్ రెండుగా చీలి పిండాలు తయారైతే మోనో జైగొటిక్ ట్విన్స్ (కవలలు)
- రెండు జైగోట్ల నుంచి రెండు పిండాలు తయారైతే డైజైగోటిక్ కవలలు.
- రెండుకన్నా ఎక్కువ జైగోట్ల నుంచి పిండోత్పత్తి–పాలిజైగోటిక్ కవలలు.

మోనోజైగొటిక్ కవలలు ఒకేరకంగా ఉంటారు. ఒక్కోసారి ఒకే జైగోట్ మూడుగా, నాలుగుగా చీలితే ముగ్గురు, నలుగురు ఒకే కాన్పులో పుడతారు. వీళ్లను Super twins అంటారు.

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు పుట్టి ఇద్దరు ఒకే జైగోట్ నుంచి, ఇంకొకరు రెండో జైగోట్ నుంచి తయారైతే వాళ్లను Fraternal twins లేదా– 'డైజైగొటిక్ ట్రిప్‌లెట్స్' అంటారు.

1969లో On death and dying అనే పుస్తకం వ్రాసి, దానిలో Five stages of Grief ను వర్ణించి ప్రసిద్ధికెక్కిన రచయిత్రి–సైకియాట్రిస్ట్– ఎలిజబెత్ కుబ్లర్ రాస్ – డైజైగొటిక్ ట్రిప్‌లెట్స్‌లో పుట్టింది.

కవలలు, ముగ్గురు, నలుగురు ఆపైగా పిల్లలు పుట్టే నిష్పత్తిని అంచనా వేసే సూత్రాన్ని– 'Hellin's law - హెల్లిన్స్ లా' అంటారు.

$= 1 : 89^{N-1}$ లేదా $1 : 80^{N-1}$

కవలలు $= 1 : 80$ (ఎనభై కాన్పుల్లో ఒకటి)

ట్రిప్‌లెట్స్ (ముగ్గురు) $= 1 : 80^{3-1}$ $(1 : 80^2 = 6400)$

క్వాడ్రుప్లెట్స్ (నలుగురు) $= 1 : 80^3 = 5,00,000 - 7,00,000$)...

**కారణాలు :** 1) 35 సంవత్సరాలు వయసు దాటిన స్త్రీలలో
2) సంతానోత్పత్తి మందుల్ని (Fertyl) వాడుతున్నవాళ్లలో.

ఎక్కువమంది పిల్లల్ని కన్నపుడు ఆ పిల్లలు తక్కువ బరువుతో (Premature, low birth children) పుడ్తారు. కొందరికి Cerebral palsy వస్తుంది. కవల పిల్లల్లో ఒక పసిపాప బొద్దుగా, మరొకటి పీలగా ఉండవచ్చు. పసిపాపలు అతుక్కుని (Conjoined twins) పుట్టవచ్చు. పుట్టిన పిల్లల్లో ఎక్కువమంది పురిట్లోనో, వారంలోపో చనిపోవచ్చును.

గ్రీకుల పురాణాల్లో క్లైటిమ్నెస్ట్రా, కాస్టర్, హెలెన్, పొల్లాక్సులు నలుగురు పిల్లలు రెండు గుడ్లనుంచి పుడ్తారు. వాళ్లతల్లి లెడా దేవేంద్రుడు జ్యూస్‌కు ఇద్దరు దైవాంశ గలవాళ్లని, భర్త టిండారియస్‌కు మానవాంశ గలవాళ్లని కంటుంది. (క్లైటిమ్నెస్ట్రా, కాస్టర్)

రోమన్ల చరిత్ర రోములస్, రెమస్ అనే కవలల్తో మొదలువుతంది.

ఒకే కాన్పులో ఎక్కువ పిల్లలు పుట్టిన స్త్రీని అక్రమ సంబంధాలున్న జారిణిగా భావించి శిక్షించిన కాలం యూరప్ చరిత్రలో చానాళ్లున్నది.

ఎనిమిది, తొమ్మిది మంది పిల్లల్ని ఒకే కాన్పులో కన్న దృష్టాంతాలున్నా అందరూ బతికిన సంఘటన ఇది. జనవరి 26, 2009న సులేమాన్ అనే మహిళ Bell flower, California, USA లో ఎనిమిది మంది పిల్లలకు జన్మనిచ్చింది. వాళ్లకు 'Suleman Octuplets' అని ఉమ్మడి పేరు. In vitro fertilization ద్వారా Blastocysts ను ప్రవేశపెట్టాడు ఆమెకు డాక్టరు.

అక్కడ్నుంచి కథ మొదలైంది. సిజెరియన్ సెక్షన్ చేసారు. దాదాపు 46 మంది నిపుణులు ముప్పై ఒక్క వారాలు ఆమెను కాపాడి ఆపరేషన్ చేసి

ఒక్కొక్క పసికందును బయటకు తీసారు! ఆశ్చర్యం. అప్పటి వరకు ఏడుగురు పిల్లల్నే అనుకున్న డాక్టర్లకు వాళ్ల స్కాన్ మెషిన్‌కు అందకుండా ఇంకో పసిపాప మొత్తం ఎనిమిది మంది (ఆరుగురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు) వచ్చేసరికి నోళ్లు వెళ్లబెట్టారు. ఆనక తమాయించుకుని ముగ్గురు పిల్లల కన్నా ఒకే కాన్పులో ఎక్కువమంది పుట్టేందుకు సహాయం చేసి, రూల్స్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన డాక్టర్ 'కమ్రావా' లైసెన్సు రద్దు చేసారు.

విశేషమేమిటంటే ఈ సులేమాన్‌కు అప్పటికే ఆరుగురు పిల్లలు. ఆమె భర్త మూడేళ్లక్రితమే విడాకులిచ్చినాడు (2006). ఆమె చెప్పిన దాని ప్రకారం– డేవిడ్ సాలొమాన్ అనే వీర్యదాత వీర్యకణాలతో తన అండాల్ని ఫలదీకరించి డాక్టర్ కమ్రవా వద్ద భద్రపరచి తాను కావాలనుకున్నపుడు వినియోగించుకున్నదట. ఆ పిల్లల పేర్లు – నోవా, మలియా, ఈసయ్యా, నరియా, జోనా, మకాయి, సోసియా, జెరెమియా.

**మరికొన్ని చిత్రాలు :**

1) అయిదుగురు ఆడపిల్లలు ఒకే కాన్పులో– Dione పిల్లలు Quintuplets - ఓంటారియా, కెనడా.

2) ఏడుగురు పిల్లలు (నలుగురు మగ, ముగ్గురు ఆడపిల్లలు)

   Mc. Caughery Septuplets-Iowa-USA

3) ఎనిమిది మంది పిల్లలు (ఆరుగురు ఆడ, ఇద్దరు మగపిల్లలు) Chukuru Ocuplets - వీళ్లలో ఒక ఆడపిల్ల వారం లోపు మరణించింది.

4) మిసెస్ వాసిలేవ్ అనే మహిళ 27 కాన్పుల్లో 69 మంది పిల్లలకు జన్మనిచ్చింది. (1725–1765 మధ్యకాలంలో) 16 మంది కవలలు, ఏడు తడవలు ముగ్గురు పిల్లలు, నాలుగుసార్లు నలుగురేసి పిల్లల్ని కన్న సంతానలక్ష్మి ఆమె. మిస్టర్ వాసిలెవ్‌కు ఇంకో భార్య ఉంది. ఆమెకు ఎనిమిది కాన్పుల్లో పద్ధెనిమంది పిల్లలు (ఆరుగురు కవలలు, రెండు మూడేసి పిల్లల కాన్పులు) మొత్తం ఆయనకు 87 ఎనభై ఏడు మంది సంతానం.

5) ఇస్మాయెల్ ఇబిన్ షరీఫ్ అనే మొరాకొసుల్తాన్‌కు అసంఖ్యాక భార్యలు, ఉంపుడుగత్తెలు వీళ్లందరికీ పుట్టిన సంతానం వెయ్యిమందిట (1000).

6) Bertold Weisnor అనే ఫెర్టిలిటి డాక్టర్ తన వీర్యాన్ని దానం చేసి (1943-1962) ప్రాంతంలో 300-600 మంది సంతానానికి కారణమైనాడట.

7) స్వాజిలాండ్ ప్రభువు 'సొభుజా-2' (1899-1982)కు 70 మంది భార్యలు, 210 మంది సంతానం.

8) కామెరూన్ రాజు (1860-1933) ఇబ్రహీంకు 600 మంది భార్యలు, 177 మంది పిల్లలు.

9) ఈజిప్టు ఫారో-చక్రవర్తి Ramesses-II కు 162 మందికి పైగా సంతాన సభ.

10) ఒకే కాన్పులో పుట్టిన పిల్లల వయసులో తేడా ఉంటే (వేర్వేరు నెలసర్లలో అంటే ఒక పిండం గర్భసంచిలో పెరుగుతున్నపుడు మరోనెలలో ఇంకో పిండం మొదలవడం - Super foetation - అంటారు.

11) ఒకే నెలసరిలో వేర్వేరు అండాలు తయారై (విడివిడి శృంగార క్రియలవల్ల-Separate acts of Sexual intercourse) పెరిగితే Superfecundation అంటారు.

12) ఒక శ్వేతజాతి స్త్రీ వేర్వేరు వర్ణాల పురుషుల్తో కలిసినపుడు ఆమెకు కాన్పుల్లో కవలలు వేర్వేరు వర్ణాలతో పుట్టగా ఈ విషయాల్ని అధ్యయనం చేసారు.

QUIVERFUL : సువార్తా కూటములైన క్రిస్టియన్లు- ప్రొటెస్టెంట్లు కుటుంబ నియంత్రణ పద్ధతుల్ని వ్యతిరేకిస్తారు. 1985లో Mary Pride తన పుస్తకం-The Way Home - Beyond feminism Back to Reality - తో ఈ ఉద్యమాన్ని మరింత రగిల్చింది. ఇప్పుడు వేలాదిమంది ఈ ఉద్యమానికి మద్దతునిస్తున్నారు.

"దేవుని వారసత్వం పిల్లలు;
ఫలించిన గర్భం అతని కానుక;
మహా శక్తిమంతుడైన అతడి చేతి బాణాలు,
తల్లుల వింటినుండి వెలువడే పిల్లలు.
అమ్ములపొది నిండా బాణాలున్నవారు ధన్యులు.
వారు సిగ్గుపడనవసరము లేదు.
ద్వారము వద్దనున్న శత్రువుకు వారు సమాధానము చెప్పగలరు.

Old Testament -psalms-127:3-5
కీర్తనలు- 127:3-5

'Be fruitful and multiply'

ఫలించండి, తామరతంపరగా వర్ధిల్లండి'

**విమర్శలు:**

- దేవుడిచ్చిన బహుమతిని సద్వినియోగం చేయువారు ధన్యులు.
- పితృస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి శాస్త్రాలు, దైవవాక్యాలు ఆధారంగా చూపి పాతకాలంలోనికి నెట్టే మోసపూరిత ఉద్యమాలివి.

ప్రతి కానుపూ స్త్రీకి మరోజన్మ అనేది అందరికీ తెలుసు. దాదాపు మృత్యు వాకిట్లోకి అడుగుబెట్టి మరలివచ్చే మహిళలపై మగధాష్టీకాన్నాపి ఆమె వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను గౌరవించినప్పుడు ఈ సమస్యలకు సమాధానం చక్కగా దొరుకుతుంది. సమాజానికి పిల్లల అవసరమున్నపుడు ఏ తల్లీ కననని భీష్మించుకున్న దాఖలాలు లేవు. తల్లిగా మారాలని ప్రతి మహిళా పడే తాపత్రయం గాఢతను ఏ శాస్త్రీయ పరికరమూ అంచనా వేయలేదు.

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 12

## (రహస్య భాష)

## (Urinary Incontinence)

ఏ పెళ్లిళ్లకూ వెళ్లలేను. ఏ పేరంటాలకూ పోలేను. బస్సు ప్రయాణాలు చెయ్యను. కాస్తంత గట్టిగా నవ్వాలన్నా, తుమ్మాలన్నా భయం సిగ్గుతో, భయంతో కుంచించుకు పోతున్నాను. నా మనోవ్యధను ఎవరికి చెప్పుకోను? ఈ బాధకు విరుగుడు ఉందా? బొట్టుబుట్లుగా కారుతూ నన్నూ నా చుట్టు పక్కలనూ ఉప్పునీటి సముద్రపు ఉప్పెనతో ముంచెత్తే ఈ దుర్గంధ, దుస్సహ స్థితికి విముక్తి లేదా!

Whoopie Goldberg - హూపీ గోల్డ్‌బర్గ్– అకాడమి అవార్డు విజేత, నటి, హాస్యనటి ఏంకర్, ప్రసిద్ధికెక్కిన Talk show నిర్వాహకురాలు, 1990 ప్రాంతంలో ఎక్కువ పారితోషికం తీసుకున్న హాలివుడ్ నటి – 'మనం దీనిగురించి మాట్లాడుకోవాలి. ఆ ధైర్యం రావాలి! Hey, does this thing happens to you? నీకూ ఈ గొడవ ఉందా?'–

Kris Jenner - క్రిస్ జెన్నర్– నటి, ప్రఖ్యాత లాయర్ రాబర్ట్ కర్దాషియన్ భార్య, దాదాపు మిలియన్ డాలర్ల వార్షికాదాయమున్న ఆమె ఈ మధ్య స్త్రీలలో ఈ వ్యాధి గురించి అవగాహన ఏర్పరచడానికి ఉపక్రమించింది. ఆమె అంటుంది– 'ఈ LBL - Light Bladder Leakage- నన్ను చాలాసార్లు ఇబ్బంది పెట్టింది. అయినా మనం ఏదైనా సాధించాలనుకున్నపుడు ఈ రుగ్మతలు అడ్డువచ్చినా తట్టుకుని ముందుకు పోగలగాలి" –

Marie Osmond - మేరీ ఆస్మాండ్. ఆమె తన సోదరుడితో కలిసి Entertainment Business లో టీనేజి వయస్సు నుంచే పాల్గొనేది. ఒకసారి బహమా క్రూయిజ్‌లో ప్రదర్శన ఇస్తున్నపుడు Stress incontinenceతో లోపల జలం బొట్లుబొట్లుగా జారుతుంటే ఓ క్షణం మనిషి నిలువెల్లా వణికినా తమాయించుకుని ప్రదర్శన పూర్తికానిచ్చింది.

హారర్ నవలల రచయిత స్టిఫెన్ కింగ్ (Stephen King - Carrie, Salem's lot, the Shining రచయిత), నటుడు శామ్యూల్ యల్. జాక్సన్

(Samuel L. Jackson - Star wars, pulp fiction), ఫుట్‌బాల్ ఆటగాడు Tony Romo; పాప్ గాయని Katy Perry... వీళ్లందరూ ఈ Urinary incontinenceతో బాధపడినవాళ్లే. అయినా ఆ అడ్డంకిని అధిగమించి తమ తమ రంగాల్లో పేరు ప్రఖ్యాతులు సాధించారు.

క్రీస్తుపూర్వం 1500 సంవత్సరాల నాటి ఈజిప్షియన్ వైద్యగ్రంథం Eberus Papyrus లో ఈ వ్యాధి వివరణ ఉన్నది. హిప్పొక్రెటిస్, గాలెన్ సెల్సస్, లియొనార్డ్ డవిన్సి వీళ్లందరూ ఈ వ్యాధి గురించి అధ్యయనం చేసారు. ప్రపంచంలో దాదాపు ఇరవై కోట్లమంది, అమెరికాలోనే ఇరవై అయిదు మిలియన్ల మంది ఈ Urinary incontinence తో బాధపడ్తున్నారు. వారిలో 75–80 శాతం స్త్రీలు. ఏ వయసులోనైనా వచ్చే ఈ వ్యాధి ముఖ్యంగా వృద్ధాప్యంలో ఎక్కువ బాధపెడ్తుంది. ఒక్కోసారి బాత్‌రూంకు వెళ్లే సమయం కూడా ఇవ్వకుండా బట్టల్ని తడిపేస్తుంది.

**లక్షణాలు–కారణాలు :**

అతిమూత్రవ్యాధి– రోజుకు 8 సార్లు కన్నా ఎక్కువ బాత్‌రూంకు వెళ్లాల్సి రావడం. (షుగర్‌వ్యాధి–మధుమేహం–Diabetes Mellitus, ఎక్కువ నీళ్లు, కూల్‌డ్రింక్స్ తాగినప్పుడు, Diabetis insipidus, మూత్రపిండాల వ్యాధులు)

ప్రొస్టేటు గ్రంధి పెరుగుదల– నలభై ఏళ్ల వయసు దాటిన మగవాళ్లలో ఇది అధికం.

నరాల వ్యాధులు– Multiple Sclerosis, Spina Bifida, Parkinson's disease, Strokes, Spinal Cord injury ఇవన్నీ ఈ Urinary incontinence - మూత్రం బొట్లుబొట్లుగా పడడానికి కారణం.

**సంప్రదించవలసిన వైద్యులు :**

యూరాలజిస్ట్ (Urologist)
యూరో గైనకాలజిస్ట్ (Uro Gynecologist)

## Urinary incontinence లో రకాలు :

1) **Stress incontinence (Effort incontinence) :** దగ్గు, తుమ్ములు వచ్చినపుడు, బిగ్గరగా నవ్వినప్పుడు, పొట్ట కండరాలు బిగించినపుడు మూత్రం కారిపోవడం.

2) **Urge incontinence:** ఇదమిత్థమైన కారణం లేకుండానే మూత్ర విసర్జన చేయాలనిపించడం.

3) **Overflow incontinence :** మూత్రం పోసి వచ్చినాక మరల మూత్రం రావడం, మూత్రం సంచి నిండుగా ఉండి ఎక్కువగా ఉన్న మూత్రజలం కారిపోవడం.

4) **Mixed incontinence** : వృద్ధులలో కనిపిస్తుంది.

5) **Structural Incontinence :** కాన్పుల తర్వాత, పుట్టుకతో ఏర్పడే 'ఫిస్టులా'ల వలన వచ్చేవి. (కాన్సర్ల వల్ల వచ్చే 'Vesico Vaginal fistula' లు)

6) **Functional Incontinence :** మూత్రం పోసుకోవాలనుకుని బాత్‌రూం వరకు పోకముందే కారిపోవడం. (Dementia, Confusion, Depression)

7) **Nocturnal Eneuresis :** పిల్లల్లో ఎక్కువ. రాత్రిళ్లు పక్కబట్టలు తడపడం.

8) **Transient Incontinence :** మందులు వాడడం, కొన్ని మానసిక, శారీరక రుగ్మతలలో వస్తుంది.

9) **Giggle Incontinence :** నవ్వితే మూత్రం కారిపోవడం.

10) **Double Incontinence :** మూత్రం పోసేప్పుడే మల విసర్జన కూడా జరగడం.

11) **Post void dribbling :** మూత్రం పోసినాక బొట్లుబొట్లుగా కారడం.

12) **Coital Incontinence :** సంభోగ సమయంలో మూత్రం కారిపోవడం.

**నివారణోపాయాలు - చికిత్స :**

మందులు, వ్యాయామం, మానసిక వైద్యం, మూత్రం పట్టేందుకు వివిధ రకాల వస్తువులూ, శస్త్రచికిత్స. ఆహారం- కాఫీ, టీలు తగ్గించి, బరువు తగ్గాలి, తక్కువ నీరు తాగాలి.

**వ్యాయామం :** Kegel excercises, Pelvic floor excercises

**మందులు :** Fesoterodine, Tolterodine, Oxybutynin.

**శస్త్రచికిత్సలు :** Slings, Tension free tranvaginal tapes
Transobturator tape, Mini sling, Needleless Sling,
Readjustable sling. Bladder Repositioning,
MMK Operation.

**Devices :** - Collecting Systems (Men);

- Absorbent products - Pads, diapers
- Occluders
- Catheters

అరవై ఏళ్లు వయసు పైబడిన స్త్రీలలో 35 శాతం మంది ఈ Urinary Incontinence తో బాధపడుతున్నారు.

**పరీక్షలు :** - Bladder Stress Test

- మూత్ర పరీక్ష
- అల్ట్రాసౌండ్
- సిస్టొస్కొపి
- యూరొ డైనమిక్స్

**ముఖ్య విషయం :** ఈ వ్యాధి స్త్రీలలో ఎక్కువ.

అన్ని రకాల Urinary Incontinence కు చికిత్స ఉన్నది. ఏ వయసులో ఉన్నవారినైనా బాగుచేయవచ్చు. దీని గురించి ఆందోళన చెందనవసరం లేదు.

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 13

## (రహస్య భాష)

## (Forceps)

ప్రతి కానుపులోనూ స్త్రీ మృత్యుద్వారాల వద్దకు పోయి తిరిగివస్తుందన్న విషయం అందరికీ తెలుసు. ఈ మృత్యు జననాలు, చీకటి వెలుగుల, రాత్రింబవళ్ల రహస్యం కనుక్కోవాలని ప్రతి ఒక్కరూ పరితపిస్తునే ఉంటారు ఏదో ఒక సందర్భంలో.

"ఇమం జీవేభ్యం పరిధిం దధామి మైషాంనుగాద పరో అర్థమేతం
శతం జీవన్తు శరదః పురూచిరన్తన్ మృత్యుం దధతాం పర్వతేనః "
– ఋగ్వేదం (10–18–4)

"మృత్యువు నిన్ను సమీపించకుండా పర్వతాల్లాంటి రాళ్లతో అడ్డుకుంటాను" అని ఒక వీరుడు తన ప్రియురాలితో పలికిన మాటలు ఋగ్వేదంలో (10–18–4) వర్ణించబడినాయి.

ఇజనాగి భార్య ఇజనామి. వీళ్లిద్దరు జపనీయుల తొలి మానవజంట. వీళ్లిద్దరు సముద్ర మథనం చేసి, మట్టిని వెలికిదీసి వాటితో జపాను ద్వీపాల్ని, లోకాన్ని, సమస్త జంతుజాలాన్ని సృష్టించసాగినారు. అయితే అగ్నిదేవుడిని కనే సమయంలో అగ్ని గర్భం నుంచి వెలువడగానే ప్రజ్వలించగా ఆ ఉష్ణ తీవ్రతకు 'ఇజనామి' చనిపోయి పాతాళ లోకానికి చేరుకుంది. ఆ పాతాళలోకం పేరు యోమి. (మన యమలోకం లాంటిదే).

భార్య కనిపించకపోయేసరికి ఇజనాగి దుఃఖంతో వెదుక్కుంటూ 'యోమి' పాతాళలోకానికి చేరుకున్నాడు కాని ఆమె అత్యంత సుందర దేహమంతా పురుగులతో నిండి అసహ్య భీభత్స భయానకంగా ఉండడంతో తట్టుకోలేక పాతాళలోకం నుంచి నేలపైకి పారిపోతుంటే ఆమె అరుస్తూనే ఉంది– "నాతో ఉండిపో! నాతో ఉండిపో" అని. ఆ కేకలు వినలేక అతడు పాతాళబిలానికి పెద్ద రాయి అడ్డం పెట్టినాడు. ఆఖరిసారిగా ఆమె అరిచింది– "మోసగాడా! నన్ను వదిలిపోతున్నావు కదా! నేను నేలమీద జీవుల్ని రోజుకు వెయ్యిమందిని చంపుతా చూడు!"–

అతడన్నాడు ద్వారం మూసివేస్తూ "నీవు వెయ్యిమందిని చంపితే నేను పదిహేను వందల మందిని సృష్టిస్తా" -అందుకే జనాభా ఇలా తామరతంపరగా పెరిగింది. వాళ్లిద్దరి మధ్య అంతులేని అగాధం మిగిలింది.

గ్రీకుల 'ఆర్ఫియస్'ది ఇంకో రకం కథ. ఆర్ఫియస్ ఓ అపూర్వ గాయకుడు. అతడు పాడుతుంటే శిలలు కరుగుతాయి. పశుపక్ష్యాదులు అలా నిలబడి పాట వింటూ మైమరచిపోతాయి. అతడి గంధర్వ గానానికి కాలం స్తంభించిపోతుంది.

అపోలో సూర్యుడు (Apollo)- వాగ్ధాటికి, ఇతిహాస కవిత్వానికి అధిదేవత అయిన కాలియోపి (Calliope) ల కుమారుడు ఆర్ఫియస్... ఇతగాడు యురిడైసి (Eurydice) అనే వనకన్య ప్రేమలో పడ్డాడు. వివాహం వైభవంగా జరిగింది. ఆ మరుసటిరోజు ఆమె చెలికత్తెలతో వనవిహారం చేస్తుంటే 'అరిస్టియస్' అనే గొర్రెలకాపరి బలాత్కారం చేయబోయాడు. వాడిని తప్పించుకు పారిపోతుంటే పాము కాటువేయగా అక్కడికక్కడే మరణించింది యురిడైసి. పాతాళలోకం వెళ్లి ఆమె ఆత్మను తీసుకురావాలని నిశ్చయించుకుని ఆర్ఫియస్ పాతాళ బిలంలోకి దిగి సరాసరి హేడ్స్, ప్రొసెర్పిని మృత్యుదేవతల ముందు అద్భుతంగా గానం చేసాడు తన వద్దనున్న వీణను మీటుతూ. ఆ గానానికి మృత్యుదేవతలే కరిగిపోయారు.

నిరంతరంగా పరిభ్రమించే 'ఇక్షియాన్' గానుగ చక్రం ఆగిపోయింది. దాహార్తితో అలమటించే 'టాంటాలస్' తన ఆకలిదప్పులు మరిచిపోయాడు. కొండమీదకు ఆగకుండా బండరాతిని దొర్లించే 'సిసిఫస్' కాసేపు ఆ రాతిమీదనే కూర్చుని విశ్రాంతి తీసుకున్నాడు. డానాస్ కుమార్తెలు జల్లెడలో నీళ్లుపోసే పనిని ఆపి పాట విన్నారు. అలా ప్రకృతి స్తంభించిపోయింది. ఆగ్రహానల దేవతలు 'ఫ్యురీస్' కళ్లవెంబడే తొలిసారిగా నీళ్లు కారినాయి. పాతాళ దేవతలు కరుణించి- "సరే! వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లు. నీ భార్య నీకు దక్కుతుంది" అన్నారు. దురదృష్టవశాత్తూ పాతాళబిలం వద్దకు వచ్చేసరికే ఉండబట్టలేక వెనక్కి తిరిగాడు. వెనక నీడలా అనుసరిస్తున్న యురిడైసి ఆత్మ మరుక్షణం అదృశ్యమైంది. నేలపైకి రాగానే అతడికి అంతా కలలా అనిపించింది. దుఃఖిస్తూ అనంతంగా పాడసాగినాడు. చుట్టుపక్కల థ్రాసియస్ యువతులకు అది నచ్చలేదు. యురిడైసి

అంత కాకపోయినా తాముా దాదాపు అంత అందగత్తెలమే! ఆమెను మరచిపోయి తమలో ఒకరిని ఎన్నిక చేసుకోవచ్చును గదా! బతిమలాడారు... అతడు వినలేదు. తన ప్రియురాలిని స్మరించే గీతాన్ని ఆపలేదు. ఆగ్రహంతో అతడిని ముక్కలు ముక్కలుగా నరికి నదిలో పారవేసాడు. అయినా పాట ఆగలేదు. అతడి ఆత్మ పాతాళలోకంలో యురిడైసి ఆత్మతో కలిసి ఆనందపడింది. అతడికి గుర్తుగా అతడి వీణను సిగ్నస్ రాశి పక్కన 'లైర్' నక్షత్రరాశి (Lyre)గా, జూపిటర్ దేవేంద్రుడు అంతరిక్షాన అమర్చినాడు.

ఇటువంటి కథే మనకు వేదాల్లో, భారతం ఆదిపర్వం ప్రధమాశ్వాసంలో కనిపించే కథ. భృగువు పులోమల కుమారుడు చ్యవనుడు. చ్యవనుడు, సుకన్యల కుమారుడు ప్రమతి. ప్రమతి, ఘృతాచిల కుమారుడు రురుడు. ఇతడు విశ్వావసుడు, మేనకల కుమార్తె. ప్రమద్వరపై మనసు పడినాడు. ఇద్దరికి ఒకరంటే ఒకరికి అంతులేని ప్రేమ. నిశ్చితార్థం జరిగింది. ఇంతలో ఒకరోజు తోటలో చెలికత్తెలతో కలిసి విహరిస్తున్నపుడు పాముకాటుతో 'ప్రమద్వర' మరణించింది. రురుడు అతి దుఃఖితుడై యమధర్మరాజును ప్రార్థించగా అతడు- "నీ ఆయుర్దాయంలో సగమిచ్చిన ఆమె బతుకుతుంది" అన్నాడు. అలా భార్యకు సగం ఆయుర్దాయం ధారపోసి బతికించుకున్న తొలిభర్తగా (ఆఖరివాడు కూడా ఇతడేనేమో) రురుడు పేరు పొందినాడు. భార్య బతికినా రురుడి కోపం చల్లారలేదు. మంచి దుడ్డుకర్ర చేతబూని చెట్టూ, పుట్టా వెతికిమరీ పాముల్ని పట్టుకుని చావగొట్టసాగినాడు. అట్లానే 'డుండుభమ'నే పామును చంపబోతే ఆ పాము 'ముని'గా మారి తన శాపవృత్తాంతం చెబుతాడు. ఆ తరువాత రురుడికి జనమేజయుడి సర్పయాగము గురించి చెప్పి అతడితో పాములను చంపడం మాన్పిస్తాడు.

జనమేజయుడితో సర్పయాగం మొదలుబెట్టించిన వాడు ఉదంకుడు. ఉదంకుడు తన గురువుకు దక్షిణగా ఇవ్వదలుచుకున్న పౌష్య మహాదేవి కుండలాలను మార్గమధ్యంలో తక్షకుడనే నాగుడు (పాము) అపహరిస్తాడు. అతడిని వెదుక్కుంటూ ఉదంకుడు నాగలోకం వెళ్లి అక్కడ తెలుపు నలుపు దారాలతో వస్త్రాన్ని నేస్తున్న ఇద్దరు స్త్రీలను, పన్నెండు ఆకులున్న చక్రాన్ని తిప్పుతున్న ఆరుగురు బాలురను, గొప్ప గుర్రాన్ని ఎక్కి కూర్చుని ఉన్న దివ్య

పురుషుడిని చూసి అతడిని ప్రార్థించినాడు. ఆ గుర్రపు ముక్కు రంధ్రాల నుంచి వచ్చిన మహా అగ్నిజ్వాలల, పొగల వేడికి తట్టుకోలేక తక్షకుడు కుండలాల్ని తీసుకువచ్చి ఉదంకుడికిస్తాడు. తర్వాత అతడికి గురువు చెబుతాడు – ఆ స్త్రీలు ధాత, విధాతలు. తెలుపు నలుపు దారాలు పగళ్లు, రాత్రులు. పన్నెండు ఆకులున్న చక్రం సంవత్సరం. ఆరుగురు బాలకులు ఆరు ఋతువులు. గుర్రం అగ్ని, ఆ దివ్య పురుషుడే ఇంద్రుడు" అని.

ఈ జనన మరణ చక్రం గురించి రష్యా, రుమేనియా, పోలండ్, యుగొస్లేవియా ప్రాంతాల్లో ప్రసిద్ధికెక్కిన మరొక కథ ఇలా మొదలవుతుంది.

ఒకప్పుడు ఇక్కడో, ఎక్కడో ఓ తల్లి మరణశయ్యపై ఉండి తన ఏకైక కుమార్తె 'వాసాలిసా' ను పిలిచి అచ్చం ఆమెలానే ఉన్న చిన్నబొమ్మను ఇచ్చి ఇలా చెప్పింది. 'వాసాలిసా! నీవు కష్టాలో ఉన్నపుడు ఈ బొమ్మను తడుము. ఈ బొమ్మను ఎల్లప్పుడూ నీ పక్కనే ఉంచుకో. ఎవరితోనూ చెప్పకు, ఎవరికీ చూపించకు'–

తల్లి చనిపోయిన కొన్నాళ్లకు తండ్రి ఓ మంత్రగత్తె వలలో పడి ఆమెను పెళ్లిచేసుకున్నాడు. ఆమెకిద్దరు కుమార్తెలు. పైకి నవ్వుతూ కనిపించినా ఆ ముగ్గురూ మహా దుర్మార్గ స్వభావం కలిగినవాళ్లు. 'వాసాలిసా' తండ్రి పొరుగూరుకు వెళ్లాడంటే చాలు వాళ్లు 'వాసాలిసా'ను నానా కష్టాలు పెట్టేవారు. కాలం గడిచినకొద్దీ వాళ్ల పెత్తనమెక్కువై, వాసాలిసా కష్టాలు తీవ్రమైనాయి.

అయినా వాసాలిసా మారుమాట్లాడకుండా వాళ్లు చెప్పిన పనల్లా చేసేది. తమకంటే నూరురెట్లు అందం, గుణం ఉన్న 'వాసాలిసా'ను అంతం చేయడానికి వాళ్లు పథకం వేసారు. వాసాలిసా తండ్రి వ్యాపారం పనిమీద వారం రోజులు పొరుగూరు వెళ్లిన అదును చూసుకుని వాళ్లు 'వాసాలిసా'ను అడివికెళ్లి ఎండు చిదుగులు తెమ్మన్నారు. సాయంకాలం చీకటి పడేవేళకు ఎండు చిదుగుల మోపుతో ఇంటికి వచ్చిన 'వాసాలిసా'కు ఇల్లంతా అంధకారమయంగా కనిపించింది. ఎందుకని అడిగితే ఇంట్లో 'అగ్ని' ఆరిపోయింది. తొందరగా అడివి ఆవలవేపున 'నిప్పులమ్మ' కోవెలలోకెళ్లి నిప్పుకణిక తీసుకురా! నేనేమో ముసలిదానిని, నీ చెలెళ్లు చిన్నవాళ్లు పైగా వాళ్లకు భయమెక్కువ! తొందరగా వెళ్లు. పోపో! అన్నదామె తీవ్రంగా కటువుగా.

అమాయకురాలు వాసాలిసా– "అలాగేనమ్మా" అని బయల్దేరింది. కాస్త దూరం పోయేసరికి అడివిని చీకటి కమ్ముకున్నది. కీచురాళ్లు అరుపులు, అప్పుడప్పుడు నక్కల ఊళలు, పాము బుసబుసలు, గుడ్లగూబల అరుపులు. భయమేసినప్పుడల్లా 'వాసాలిసా' తన జేబులోని బొమ్మను తడుముకుని ధైర్యం తెచ్చుకుని ముందుకు నడుస్తూపోయింది. రెండుమూడు దారులు వచ్చిన చోట బొమ్మనడిగేది. 'కుడివేపా, ఎడమవేపా?' బొమ్మ చేతుల కదలికను బట్టి ఆ వేపు నడుస్తూ, విశ్రాంతి తీసుకుంటూ పోగా, పోగా... ఒక అశ్వికుడు తెల్లని గుర్రంపై ఆమెను దాటి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత ఇంకో అశ్వికుడు ఎర్రటి గుర్రంపై, ఆ తరువాత ఇంకో అతడు నల్లటి గుర్రంపై వేగంగా ఆమెను దాటిపోయాడు. అతడు వెళ్లింది నిప్పులమ్మ కోవెలలోకి. చీకటి క్రమేపీ కమ్ముకురాసాగింది.

ఆ కోవెల గోడలన్నీ కపాలాలు ఇటుకలుగా పేర్చబడి, ఆ గుడి మానవుల ఎముకలతో కట్టబడి ఉంది. వాసాలిసాకు భయంవేసి తన జేబులోని బొమ్మను తాకి ధైర్యం తెచ్చుకున్నది. కటిక చీకటిగా ఉన్న ఆ గుడిలోంచి ఏదో వింత వెలుగు.

ఏదో అలికిడై గుండె ఝల్లుమనగా వాసాలిసా ఓ చెట్టుపక్కన దాక్కుని కోవెలవేపు చూడసాగింది. ఆకాశంలో గుడ్లగూబలు, గబ్బిలాలు ఉవ్వెత్తున ఎగురుతున్నాయి. తలపైకెత్తి పైకి చూసేసరికి– నల్లటి గంగాళం మీద నల్లటి దుస్తులలో, చుట్టూ నీలిమంటలు మండుతుండగా, ఓ వికృతాకారం, తన చేతిలోని మనిషి పొడుగాటి కాలి ఎముక చివర వెంద్రుకల కుచ్చుతో తాను వస్తున్న దారిని తుడిచివేస్తూ వస్తున్నది. ఆమె చుబుకం పైకి మొనదేలి, పొడుగాటి వంపు ముక్కును తాకుతున్నది. ఒళ్లందా దద్దులు, కాయలు, గోదురుకప్పలకున్నట్లు– ఆమె కళ్లు నిప్పుకణికల్లా మండుతున్నాయి. చేతిగోళ్లు పొడుగ్గా వంపులు తిరిగి ఉన్నాయి. ఆమె గుడి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణం చేసి గంగాళం దిగి ఆవరణ లోనికి అడుగుపెట్టింది. ఆమె రాగానే ఆ కోవెల కూడా గమ్మత్తుగా కదలసాగింది. కోడి కాళ్లమీద నిలబడ్డట్టు నాట్యం చేస్తున్నట్లు కదుల్తూంటే పుర్రె తాళం, మనిషి అస్తిపంజరం చేతి ఎముకల తాళం చెవుల గుత్తి వాటంతట అవే తలుపు తెరుస్తుండగా ఆ మహా మంత్రగత్తెకు ఏదో మనిషి వాసన తగిలి ఓ క్షణం నిలబడింది.

చెట్టు చాటున ఉన్న 'వాసాలిసా' బొమ్మను అడిగింది– "ఇదే కదా నిప్పులమ్మ కోవెల!". అవునన్నది బొమ్మ. 'వాసాలిసా' కోవెల ఆవరణలోకి అడుగుపెట్టగానే మంత్రగత్తె చటుక్కున ఇటు తిరిగి భయంకరంగా అరచింది "ఎవరు నీవు?"

వాసాలిసా ఆపాదమస్తకం వణికిపోయింది. "అమ్మమ్మా... నేను... నేను... మా ఇంట్లో అగ్ని ఆరిపోయింది... చలికి వణికిపోతున్నారు అందరూ... నిప్పుకోసం వచ్చాను..."

మంత్రగత్తె మేఘంలా గర్జిస్తూ అన్నది– "మూర్ఖులు మీరు. నిప్పు ఆర్పేసుకుంటారా? అయినా నేనెందుకు ఇవ్వాలి నీకు?"

వాసాలిసా వెంటనే బొమ్మను తడిమి బొమ్మ చెప్పమన్నట్లు చెప్పింది– "ఎందుకంటే నేను అడిగాను గనుక!"

మంత్రగత్తె అరిచింది– "బతికిపోయావు, సరిగ్గా సమాధానం చెప్పి. అయినా, నీకు నేను ఊరికే నిప్పు ఇవ్వను. నేను చెప్పిన పనులు చేయి. చెయ్యకపోతే నిన్ను కాల్చుకుతినేస్తాను"

ఆ మంత్రగత్తె కళ్లు నిప్పుకణికల్లా భగభగ మండినాయి.

"పో, వంటగదిలోకి పోయి ఏం ఉడుకుతున్నదో పట్టుకు వచ్చి నాకు వడ్డించు"

వాసాలిసా వెళ్లి వంటగదిలో చూసేసరికి అక్కడ పదిమందికి సరిపడా తిండి ఉన్నది. మొత్తం మంత్రగత్తెకు వడ్డించగా ఆమె అంతా ఆవురావురమని తిని వెళ్లి పడుకున్నది. మిగిలిన చిన్న రొట్టెముక్క తిన్నది వాసాలిసా.

"పో పోయి! నా బట్టలు శుభ్రంగా ఉతికి ఇల్లు ఊడ్చి, ఆ పక్కనే ఉన్న మొక్కజొన్నల్ని మంచి చెడూ వేరుచేసి సిద్ధంగా ఉంచు. లేకుంటే నిన్ను తినాల్సి వస్తుంది" అని అరిచి గుర్రుపెట్టి నిద్రపోయింది.

ఆ మొక్కజొన్న గుట్టల్ని, వంట ఇంట్లోని గంగాళాన్ని చూడగానే 'వాసాలిసా' గుండె జారిపోయింది. తన జేబులోని బొమ్మను తడమగానే ఆ బొమ్మ ధైర్యం చెప్పింది. "కాసేపు నీవు విశ్రాంతి తీసుకో". అలిసిపోయి ఉన్న వాసాలిసా నిద్రపోయింది వెంటనే. తెల్లారేసరికి అన్ని పనులూ శుభ్రంగా చేసిపెట్టి ఉన్నాయి. మంత్రగత్తె అన్నది– "బాగానే చేసావు". ఆమె సంజ్ఞ చేయగానే

మూడు జతల చేతులు వచ్చి మొక్కజొన్నల్ని పిండి విసిరి రొట్టెలను చేస్తుంటే మంత్రగత్తె గంటలకొద్దీ తిని తిని నిద్రపోబోతూ వాసాలిసాకు పని అప్పచెప్పింది– "ఇల్లంతా శుభ్రం చేయి. అదుగో అక్కడ గంజాయి విత్తనాలు దుమ్ములో కప్పబడి ఉన్నాయి. విత్తనాలను దుమ్ముదులిపి బస్తాలలో నింపు. అర్థమైందా!" అని నిద్రపోయింది.

'వాసాలిసా'కు మళ్లీ బొమ్మ ధైర్యం చెప్పింది. తెల్లాసరేసరికి గంజాయి గింజలు బస్తాలలో నింపబడి ఉన్నాయి. ఇల్లంతా శుభ్రంగా ఉంది. మంత్రగత్తె "ఫర్లేదు. పనులు బాగానే చేస్తున్నావు" అని తన సేవకులను పిలిచేసరికి మూడు జతల చేతులు వచ్చి గింజల నుంచి నూనె తీసి సీసాల్లో నింపుతున్నారు. మంత్రగత్తె తిండి ముగించి వెళ్లిపోతూ తనవేపే చూస్తున్న 'వాసాలిసా'ను అడిగింది–

"ఏమిటి చూస్తున్నావు?"

"అమ్మమ్మా! నిన్ను ఏమైనా అడగవచ్చా?"

"అడుగు. కాని గుర్తుంచుకో! ఎక్కువ జ్ఞానం ప్రమాదకరం"

"ఎవరా తెల్లనిగుర్రంపై అశ్వికుడు?"

"అతడా, పగటిపూట"

"ఎర్రగుర్రంపై, నల్లగుర్రంపై ఎవరువాళ్లు?"

"మధ్యాహ్నం, రాత్రి. ఇంకేమైనా అడుగుతావా?" అన్నది మంత్రగత్తె. ఆ మూడు జతల చేతుల గురించి అడుగుదామనుకునేసరికి వాసాలిసా జేబులో బొమ్మ కదలసాగింది. వెంటనే వాసాలిసా ఏమీ అడగకుండా మౌనం వహించింది.

మంత్రగత్తె అడిగింది– "తెలివిగలదానివే! అయినా ఇక్కడకు ఎలా రాగలిగావు?"

వాసాలిసా అన్నది– "మా అమ్మ ఆశీస్సుల వల్ల"–

మంత్రగత్తె అరిచింది– "ఎవరి ఆశీస్సులకూ ఇక్కడ చోటులేదు. వెంటనే వెళ్లిపో ఇక్కడ నుంచి. ఇదుగో ఈ పుర్రెలో నిప్పుకణిక. ఈ కపాలదీపం ఆరిపోకుండా మీ ఇంటికి తీసుకుపో. ఇంకొక మాట మాట్లాడకుండా వెళ్లిపో!"

'వాసాలిసా' కృతజ్ఞతలు చెప్పడానికని మాట్లాడబోయింది. జేబులో బొమ్మ బాగా కదిలి హెచ్చరించేప్పటికి కపాల దీపాన్ని పట్టుకుని వెంటనే

'నిప్పులమ్మ కోవెల' దాటి వెనక్కి తిరిగి చూడకుండా ఇంటిదారి పట్టింది వాసాలిసా. కపాలదీపంలో భగభగ మండుతున్న నిప్పుకణిక. నీలి ఎరుపు మంటలు ఆ పుర్రె కళ్లు, ముక్కు రంధ్రాల నుంచి వెలువడుతూ భయం గొలుపు తున్నాయి.

బొమ్మ ఇస్తున్న ధైర్యంతో వాసాలిసా అడవి చీకటిదారులను దాటుకుంటూ ఇంటికి చేరేసరికి కిటికీలోంచి చూస్తున్న సవతితల్లి, ఆమె కుమార్తెలు గజగజ వణికిపోయారు. వాళ్లకు అర్థమయ్యింది. 'వాసాలిసా'ను ముట్టుకుంటే తమకే ముప్పని. అప్పటినుంచీ వాళ్లు బుద్ధిమారి సఖ్యతతో మెలగసాగినారు. లేకుంటే కపాలదీపం వాళ్లకు వాతలు పెట్టి దారికి తెచ్చేది.

మంత్రగత్తెకు సహాయం చేసే సేవకుల్లాంటి మూడు జతల చేతుల్లాంటివే కానుపు సమయంలో సహకరించే చేతులు 'Hands of Palfyn' అనేవారు. The obstetric forceps - పనిముట్టు క్లిష్టసమయాలలో కానుపు చేయడానికి తోడ్పడుతుంది. తొలి Forceps ఛాంబర్లేన్ (Chamberlain Family) కుటుంబానికి సంబంధించిన రహస్యంగా 150 సంవత్సరాలు ఉండింది. ఛాంబర్లేన్ కుటుంబం పారిస్‌లోని Hughenots. అప్పటి మత కలహాలకు జడిసి 1569లో వాళ్లు ఇంగ్లండ్‌కు వలసపోయినారు. విలియం ఛాంబర్లేన్‌కు ఇద్దరు కుమారులు. పియర్రె (Pierre) మొదటివాడు. పీటర్ (Peter)గా మొదటి ఛార్లెస్ ప్రభువు భార్య హెన్రియెట్టిరాణికి ఆస్థాన వైద్యుడిగా ఉన్నాడు.

అతడి తరువాత అతడి Nephew డాక్టర్ పీటర్ ఛాంబర్లేన్ (అప్పటి వరకు సర్జన్లను Barber Surgeons అనేవారు. తొలి డాక్టర్‌గా ఉత్తీర్ణుడైనది పీటర్ ఛాంబర్లేన్). అలా ఛాంబర్లేన్ కుటుంబం రాచకుటుంబాలకు ఆస్థాన వైద్యులుగా పేరు తెచ్చుకున్నారు. ఈ Obstetric Forceps వారి పేరు ప్రఖ్యాతులకు కారణమైంది.

1634లో హ్యూఘెస్ ఛాంబర్లేన్ ఈ పరికరాన్ని డచ్ వైద్యులకు అమ్మడానికి ప్రయోగించి చూపించినప్పుడు తల్లీ, బిడ్డా మరణించడంతో కొంత అపఖ్యాతి వచ్చింది.

1723లో జీన్ పాల్ఫిన్ (Jean Palfyn) పారిస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో తను రూపొందించిన పరికరాన్ని ప్రదర్శించాడు. వాటిని Hands of Palfyn అన్నారు.

డుస్సీ (Dussee), మెన్నర్డ్ (Mesnard), ఏంఢ్రి లెవ్రెట్ (Andre Levret), స్టిఫాన్ టార్నీర్ (Stephan Tarnier), హోడ్జ్ (Hodge Eclectic forceps) ఎలియాట్ (Elliott) క్రమేపీ వ్యాప్తిలోకి వచ్చాయి. ఆధునీకరించ బడినాయి. కొన్ని వందల రకాల పరికరాలు. డిజైన్ చేయబడినా వాక్యూమ్ (Vacuum Extractor, Ventouse) ఎక్స్ట్రాక్టర్, సిజేరియన్ సెక్షన్ ప్రాముఖ్యత పెరిగి Obstetric forceps వాడకం తగ్గిపోయింది.

కాన్పు సమయం తగ్గించడానికి, సిజేరియన్ సెక్షన్ చేయకుండా కానుపు చేయడానికి ఈ ఫోర్సెప్స్ ఉపయోగపడ్తుంది. అయినా శిశువు ముఖంపై గాట్లు, ముఖాకృతిలో మార్పులు, తల్లికి Rectovaginal Fistula, తల్లికి బిడ్డకు గాయాలు, ఒక్కోసారి పసిపాప మెదడులో రక్తనాళాలు చిట్లి మరణించడం, మూతి వంకర కావడం ఇవన్నీ ఈ Obstetric Forceps ప్రాముఖ్యత తగ్గడానికి కారణాలైనాయి.

అదృశ్యహస్తాల్లా పనిచేసే ఈ Obstetric Forceps ను ఇప్పుడు Outlet Forceps గా మాత్రమే వాడ్తున్నారు. ఒక్కోసారి సిజేరియన్ సెక్షన్ సమయంలో కూడా శిశువు తలను జారకుండా పట్టుకోడానికి ఈ పరికరం సమర్థవంతంగా ఉపయోగపడ్తుంది.

అయినా ఒక్కోసారి శిశువుకు ప్రమాదకారిగా పరిణమిస్తున్నందున ఈ Obsetric Forceps వాడకం దాదాపుగా తగ్గినట్లే చెప్పవచ్చును.

బహుశా అందుకే కాబోలు మూడు జతల చేతుల గురించి 'వాసాలిసా' మంత్రగత్తెను అడుగుదామనుకుంటే జేబులోని బొమ్మ (Intuition=అంతర్దృష్టి) ఆమెను వారించింది.

"A woman knows by intuition or instinct,
what is best for herself"

- Marilyn Monroe

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 14

## (రహస్య భాష)

## (Hydatidiform Mole)

ఆరోజుల్లో పుట్టబోయేది మగబిడ్డో, ఆడపిల్లో తెలుసుకోవడానికి గమ్మత్తైన పరీక్ష చేసేవారు. గర్భిణీస్త్రీ మూత్రవిసర్జన చేసిన చోటు- బార్లీ మొలిస్తే మగపిల్లాడు, గోధుమ మొలిస్తే ఆడపిల్ల. ఏదీ మొలవకపోతే కాన్పు నిలబడదు.

– (బెర్లిన్ మెడికల్ పాపిరస్, ఈజిప్టు నాగరికత)

ఇంకో పరీక్ష ఏమిటంటే- గర్భవతి అయ్యిందని అనుమానం వచ్చిన స్త్రీకి మగపిల్లవాడికి పాలిస్తున్న తల్లిపాలు తాగించేవారు. వాంతి అయ్యిందా గర్భిణి 'కన్‌ఫర్మ్' అయ్యిందనేవారు.

ఇవన్నీ గర్భిణీస్త్రీలకు వచ్చే- "మార్నింగ్ సిక్‌నెస్ (Morning Sickness) వల్లనే కావచ్చును.

హిప్పొక్రెటిస్ (460-370 B.C.) పద్ధతి- రాత్రి పడుకునేముందు తేనె (Honey) కలిపిన ద్రవాన్ని తాగించేవారు. కడుపు ఉబ్బినట్లై వాంతి అయ్యిందా నెలసరి తప్పినట్లేనన్నమాట!

మధ్యయుగాలు: గర్భిణీస్త్రీ మూత్రాన్ని చూసి అవునా కాదా చెప్పేవాళ్లను 'Piss prophets' అనేవారు. నిమ్మ పసుపు రంగులో ఉండి పైన తెల్లగా మబ్బులా ఉంటే అది గర్భిణీకి చిహ్నం (1592). కొందరు వైన్‌లో మూత్రం కలిపి గడ్డకడ్తుందా లేదా చూసేవారు. గర్భిణీస్త్రీలను తాళం చెవిమీదో, సూదిమీదో మూత్రం పోయమనేవారు. బేసిన్‌లో తాళం చెవి రూపం కనిపించినా, సూది ఎర్రరంగులోకి మారినా గర్భిణీ నిర్ధారణ అయినట్లే.

జాక్వెస్ గిల్లిమ్యూ (Jacquest Guillmeau) పదహారవ శతాబ్దం వైద్యుడు అంటాడు- "గర్భిణీస్త్రీల కళ్లు లోతుగా, చిన్ని కనుపాపలతో ఉంటాయి. కనురెప్పలు వాలి, కనుకొలకుల్లో చిన్నిచిన్ని రక్తనాళాలుంటాయి"-

పదిహేడవ శతాబ్దపు 'రిబ్బన్' టెస్టు– గర్భిణీస్త్రీ మూత్రాన్ని ఒక పాత్రలో ఉంచి దానిలో ఓ రిబ్బను పెట్టేవారు. ఆ రిబ్బను వాసన చూసి ఆమె వాంతి చేసుకున్నదంటే గర్భిణి అని నిర్ధారణ చేసేవారు.

1900 ప్రాంతంలో 'Rabbit died' కుందేలు చచ్చిందని ఎవరన్నా అంటే ఆమె గర్భిణీ అయ్యిందన్న మాటే! 1928లో జర్మన్ శాస్త్రజ్ఞులు Salmar schheim, Bernhard Zondek - హ్యూమన్ కొరియానిక్ గొనడో ట్రోఫిన్ (HCG) హార్మోన్‌ను కనుగొన్నారు. వీళ్లు గర్భిణీస్త్రీ మూత్రాన్ని ఎలుకల్లో, కుందేళ్లలో ఇంజక్ట్ చేసేవారు. ఆ తరువాత కొద్ది రోజులకు వాటిని కోసి వాటి అండాలు (Ovaris) ఉబ్బాయో లేదో చూసేవారు. మనుషుల గర్భిణి ఎలుకల, చెవుల పిల్లుల చావుకు వచ్చేదన్నమాట.

తరువాత లాబ్‌లో యూరిన్ పరీక్ష, ఇంట్లోనే ఎవరికి వారు చేసుకోగలిగిన one step stick test (1988) వాడుకలోకి వచ్చాయి. ఫలదీకరణ చెందిన అండపు కణజాలం నుంచి (Trophoblasts) - హ్యూమన్ కొరియానిక్ గొనడొట్రొఫిన్ విడుదల అవుతుంది (HCG). ఒకసారి అండము గర్భసంచిలో నాటుకున్నాక ఈ హార్మోన్ ఎక్కువవుతుంది. అల్ట్రాసౌండ్ ద్వారా కూడా ప్రెగ్నన్సీని తొలిదశలో గుర్తించవచ్చును (1960). ఇంటి దగ్గర పరీక్ష చేసుకునే వీలున్న Home Kit ను 1968లో Margaret Crane కనుక్కున్నది (న్యూయార్క్‌లో).

ఫలదీకరణం చెందిన నలభై ఎనిమిది గంటల లోపునైతే EPF (Early pregnancy factor) ను Test చేస్తారు. కాని ఈ పరీక్ష ఖరీదైనది.

- Urine Test (మూత్ర పరీక్ష) 6–12 రోజులు

- Ultrasound (అల్ట్రాసౌండ్) – అయిదు వారాలకు

ఆరోవారంలో పిండము హృదయస్పందన చూడవచ్చు. (25-30 days)

75 శాతం మందిలో ఇవి సరైన నిర్ధారణకు తోడ్పడ్తాయి. కొన్ని మందులు వాడడం వలన, హార్మోన్లలో లోపాలవల్ల తప్పుగా నిర్ధారణ జరగవచ్చు. Blood Test (రక్తపరీక్ష)లో HCG levels /mlu/ml కనుక్కోవచ్చు. మూత్రపరీక్షలో పాజిటివ్ రిజల్టు రావడానికి 10 mlu/ml - 100 mlu/ml HCG levels ఉండాలి.

అండం విడుదలైన పధ్నాలుగవ రోజున నెలసరి (menstruation) వస్తుంది. నెలసరి ఆగినట్లై, గర్భిణి అని అనుమానం వస్తే 8-10 రోజుల్లో రక్తం గాని, మూత్రం గాని పరీక్ష చేసుకొని నిర్ధారణ చేసుకోవాలి. నెలసరి కాక నెలదాటితే అల్ట్రాసౌండ్ పరీక్ష చేసుకోవచ్చు.

శుక్రణాలు (Spermatozoa) గర్భవాహికలో గర్భసంచిలో అయిదు రోజుల వరకు జీవించే ఉంటాయి కాబట్టి the act of intercourse, insemination తేదీలకన్నా ovulation ముఖ్యం. శుక్రశోణిత సంయోగంలో జైగోట్ ఏర్పడ్తుంది. ఆ తరువాత 12 రోజులకు అండము గర్భసంచి పొరల్లో నాటుకుంటుంది. (Implantation). అందుచేత 15-17 రోజుల వరకు False Negatives - గర్భిణి అయినా టెస్ట్ నెగెటివ్ రావడం ఎక్కువ.

లార్గాక్టిల్, HCG, దగ్గుమందులు, కాలేయపు వ్యాధులు, కాన్సర్, కొరియో కార్సినామా లాంటి వ్యాధుల్లో HCG లెవెల్స్ ఎక్కువ ఉంటాయి.

కొత్తగా వస్తున్న pregnancy tests లో Immuno assays - Monoclonal anti bodies తో చేసే Sandwich Elisa పద్ధతి వినియోగిస్తున్నారు. ఈ పరీక్ష సులభమైనది. ఖరీదు తక్కువ.

HCG levels మరీ ఎక్కువగా ఉండి, వాంతులు, చిరాకు, భరించ లేనంతగా ఉండి (morning sickness) అల్ట్రాసౌండ్‌లో పిండం లేకుండా గర్భసంచి పెరుగుదల మాత్రమే ఉంటే దానిని హైడటిడ్ ఫారమ్ మోల్ (Hydatid form mole) లేదా ముత్యాలగర్భిణి అంటారు.

ఈ ముత్యాల గర్భిణి వచ్చే విధానం చాల విచిత్రంగా ఉంటుంది.

శుక్రకణం, అండం కలిస్తే జైగోట్ ఏర్పడ్తుంది. అవి మార్యులా, బ్లాస్టులాగా మారి గర్భసంచి కుహరంలో కొరియానిక్ విల్లై వేళ్లుగా మారినాక గర్భసంచి పొరల్లో నాటుకుంటుంది. ఈ విల్లై – వేళ్లు సింసిషియో ట్రోఫో బ్లాస్ట్ నుంచి ఏర్పడుతాయి. శిశు వృక్షపు వేళ్లుగా వీటిని అభివర్ణించవచ్చు. వీటి పెరుగుదలను బట్టే శరీరంలో HCG లెవల్ ఇబ్బడి ముబ్బడిగా పెరుగు తుంటుంది.

ఈ ముత్యాల గర్భిణిలో– అండంలోని న్యూక్లియార్ డియన్ఏ అదృశ్యం కాగా శుక్రకణం రెండుగా చీలి 46xy గాని, రెండు శుక్ర కణాలు కలిసి 46 xy, 46 xx గా ఉండడం వలన ఈ ముత్యాల గర్భిణి పెరుగుతుంది. 46yy ఉన్నవి పెరగక నశించిపోతాయి. 46xx, 46xy లో శుక్రణాలకు సంబంధించిన న్యూక్లియార్ మెటేరియల్ ఉండడం చేత పిండం ఏర్పడదు. కాని కొరియానిక్ విల్లై విస్తృతంగా పెరిగి గర్భసంచిలోకి చొచ్చుకుపోతాయి. అవి ఉబ్బి ద్రాక్షపళ్లలా ఉండి, నీరులాంటి ద్రవంతో నిండి ముత్యాల్లా ఉంటాయి. Hydatos = (greek) Water.

హైడటిడ్ ఫారమ్ మోల్, ముత్యాల గర్భిణీగా పేరు తెచ్చుకున్నది.

ఇది రెండు రకాలు 1) సంపూర్ణ (Complete), 2) అసంపూర్ణ (Partial or incomplete).

సంపూర్ణ ముత్యాల గర్భిణిలో 90% మందికి నూక్లియస్ లేని అండంతో ఒకే శుక్రణకం కలిసి రెండుగా విడిపోయి 46xx, 46 xy డిప్లాయిడ్‌గా ఉంటుంది. మిగతా పది శాతం గర్భిణీల్లో రెండు శుక్రణాలు అండంతో కలుస్తాయి. అసంపూర్ణ ముత్యాల గర్భిణిలో 69xxy; 92 xxxy క్రోమోజోములు ఉంటాయి. (మామూలుగా శుక్రకణాలు రెండు రకాలు 23x; 23y. y క్రోమోజోము మగవాళ్లది. x క్రోమోజోము స్త్రీలది.) అండంలో 23x ఉంటుంది. 23x శుక్రకణం 23x అండం కలిస్తే ఆడపిల్ల; 23y శుక్రకణం 23x అండంతో కలిస్తే మగపిల్లవాడు జన్మిస్తాడు. ఆడ మగా నిర్ధారణ చేసేది y క్రోమోజోము.

సంపూర్ణ ముత్యాల గర్భిణీలు తరువాత కొరియొ కార్సినామాగా రూపు చెందవచ్చు. ఏతావాతా తేలిందేమిటంటే శుక్రకణాలు గర్భసంచిని ఆక్రమించుకుని ఎలా శత్రువులా ప్రవర్తిస్తాయో – న్లూక్లియస్ లేని అండాన్ని ఎలా హైడటిక్ ఫారమ్ మోల్‌గా పెంపొందించి విధ్వంసం సృష్టిస్తాయో మనకు అవగత మవుతుంది.

ఎక్కువమంది స్త్రీలలో ఇవి ఎబార్షన్‌గా బయటకు నెట్టివేయబడ్తాయి. కొందరిలో miscarriage గా లోపల పెరుగుతుంటాయి.

అమెరికా, యూరప్ దేశాల్లో వేయికి ఒక్క గర్భిణీ ముత్యాలగర్భిణీ అయితే ఇండోనేషియాలో ఇది నూటికి ఒక్కటి.

ఇరవై ఏళ్లలోపు, నలభై ఏళ్లపైబడిన వయసున్న వారిలో, ప్రొటీన్, ఫోలిక్ ఏసిడ్, కెరొటిన్ లోపాల వల్ల ఈ వ్యాధి వచ్చే అవకాశముంది.

**కొత్త సిద్ధాంతాలు :**

Sperm dominance - Sperm Patterned Methylation

Suppression of genes - వలన Syncytio trophoblast ఎక్కువగా పెరిగి – శిశువృక్షపు వేళ్లు ఎక్కువవుతాయి.

Dual egg patterned methylation - శుక్రకణం, అండం రెండిటిలోనూ న్యూకియస్ ఉన్నపుడు విల్లై, ఎంబ్రియో రెండూ పెరుగుతాయి.

మేల్ జీన్స్ – ఎంబ్రియో పెరగడానికి

ఫీమేల్ జీన్స్ – ఎక్కువమంది పిల్లలు కలగడానికి తమతమ ప్రభావాన్ని చూపిస్తాయి.

సంపూర్ణ గర్భిణీలలో– న్యూక్లియార్ జీన్సు అన్నీ తండ్రినుంచి వస్తాయి. (Androgenesis). మైటోకాండ్రియన్ జీను తల్లి నుంచి వస్తుంది. వీటిలో 46xx, 46xy తండ్రివే. అసంపూర్ణ ముత్యాల గర్భిణిలో తల్లికి సంబంధించిన '23x' తండ్రికి సంబంధించిన రెండు శుక్రకణాలు 23y, 23x మొత్తం 69xxy లేదా తల్లికి సంబంధించిన 23x; తండ్రికి సంబంధించిన శక్రకణాలు మూడు కలిసి 92xxxy ఉంటాయి. అల్ట్రాసౌండ్ పరీక్షలో– మంచుతుఫాను (snow storm), ద్రాక్షగుత్తి (Cluster of grepes); తేనెతుట్టె (Honey combed appranance) గా ఈ వ్యాధి కనిపిస్తుంది.

ఈ వ్యాధి వచ్చినప్పుడు థైరాయిడ్ హార్మోన్లు ఎక్కువగా ఉన్నప్పుడు వచ్చే Hyperthyroidism లక్షణాలను కూడా చూడవచ్చు.

**వైద్యం :**

– గర్భసంచి కడగడం – Curettage

– HCG లెవెల్స్‌ను గమనిస్తూ ఉండడం.

- మిథొట్రెక్సేట్ (Methotrexate)

  మెటాస్టెసిస్ ఉన్నవాళ్లలో

- Carboprost (కార్బొప్రొస్ట్) ఇస్తారు.

మరల వచ్చే అవకాశం 1%

మామూలు శిశువుతో పాటు ముత్యాల గర్భిణీ ఉంటే ట్రీట్‌మెంట్ చాలా కష్టం.

సంపూర్ణ ముత్యాలగర్భిణీలలో కొన్ని కొరియొకార్సినోమాగా మార్పు చెందుతాయి. చాలామంది మహిళలు ముత్యాల గర్భిణీతో బాధపడ్తున్నపుడు అప్పుడప్పుడు రక్తస్రావమై రక్తంలో తెల్లటి ముత్యాల్లా 'విల్లై' హైడటిడ్స్ (నీటిబుగ్గలు) కనిపించడం వల్ల ఈ గర్భమునకు ముత్యాల గర్భిణి అని పేరు వచ్చింది.

✧✧✧✧✧

# ఛుప్ కె ఛుప్ కె - 15

## (రహస్య భాష)

## (Pregnancy)

**'Pregnancy is not a disease' - versus -**

**- 'Pregnancy is a disease'**

'గర్భము దాల్చడం అనేది ఓ వ్యాధి' అనేది కొందరి ఆలోచన. వాళ్లు గర్భస్థ శిశువును తల్లికణాలపై దాడిచేసే పరాన్నజీవిగా (invading parasite), మాతృమూర్తిని దాడికి లోనైన Host గా భావిస్తారు. వాళ్లు చెప్పే కారణాలివి–

- తల్లి శరీరం నుంచి శిశువు జీవరసాల్ని పీల్చుకుని ఆమెను బలహీనంగా చేస్తుంది.

- తల్లి, శిశువు జీన్లు మధ్య సంఘర్షణ – శిశువు జీన్లు తల్లి శరీరం నుంచి ఎంత వీలైతే అంత ఎక్కువ జీవద్రవాల్ని, ఆహారపు లవణాల్ని గ్రహించడానికి ప్రయత్నిస్తాయి. తల్లి జీన్లు (Genes) వాటిని కొంతవరకు నియంత్రించేందుకు సంఘర్షిస్తాయి. పిండం నుంచి ట్రోఫోబ్లాస్ట్ కణాలు (Cytotrophoblasts, Syncytio trophoblasts) మొక్క వేళ్లు భూమిలోకి చొచ్చుకుపోయినట్లు– తల్లి గర్భసంచి పొరల్లోకి పోయి తల్లి గర్భసంచిలోని రక్తనాళాల (Spiral arteries) పైపొరలుగా మారి రక్తం నుంచి పిండమునకు అవసరమైన పోషక పదార్థాలను గ్రహిస్తాయి.

- ట్రోఫోబ్లాస్టు కణాలు తమ ధర్మంలో విఫలం చెందితే అది గుర్రపు వాతానికి (Pre Eclampsia, Eclampsia)కు కారణమై తల్లికి రక్తపోటు (High Blood Pressure) వచ్చేలా చేస్తాయి.

ముఖ్యంగా టీనేజ్ ప్రెగ్నన్సీలలో (13–19 సంవత్సరాల వయసున్న) ఆడపిల్లల్లో గర్భం రావడాన్ని ఓ వ్యాధిగా. శాపంగా, పాపంగా చూస్తున్నారని కొందరి వాదన.

గర్భము అనేది వ్యాధికాదు.

పిల్లలు పుట్టడం అనేది 'వ్యాధిజనక ఉత్పత్తి' కాదు.

"Pregnancy is not an illness disease...

nor are the children the side effect or

the unintended by - product of disease"

ఫ్రెంచి ఫెమినిస్టు సైమోని డి బ్యువాయిర్ (Simone De Beauvoir) తన The Second Sex అనే ప్రఖ్యాత పుస్తకంలో (1950) –'మగవాళ్లను తృప్తిపరచడానికే తామున్నామనుకునే స్త్రీలు గర్భిణిగా ఉన్నపుడు తమ నాజూకుతనం, అందం, లావణ్యంలో వచ్చే మార్పులను చూసి దుఃఖపడతారు. గర్భవతి కావడాన్ని శాపంగా భావిస్తారు' –అని అభిప్రాయపడింది.

ఇసడొరా డంకన్ (Isadora Duncan) ప్రముఖ నాట్య కళాకారిణి– "నా అందమైన శరీరం ఎంత వికారంగా మారిందంటే ఈ దేహం నాదేనా అని భయం వేసేది. నా కీర్తి, ప్రతిష్ఠలు ఏమవుతాయి? నా భవిష్యత్తు నాశనమయి పోతుందా అని భయం వేసింది"–

Our bodies, Our selves అనే పుస్తకంలో అనేకమంది స్త్రీలు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

–"నా శరీరంలోని భాగాలు నాకే శత్రువులయ్యాయా, నా స్త్రీత్వం నాకు శాపమయ్యిందా?"

"నెలసరికి ముందు వచ్చే ఉద్వేగాలు, సంక్షోభాలలాగే గర్భిణి తొలినెలల్లో వాంతులు, వికారం, వేవిళ్లు నన్ను తిప్పలు పెట్టాయి కాని, తర్వాత నెమ్మదించాయి"

1970లో Adrienne Rich - of woman Bornలో ప్రెగ్నన్సీ అనేది వ్యాధి కాదు. అది సహజమైన భౌతికమార్పు– అని పేర్కొన్నది.

"మా దేహాలు మావికావా?" అనే ప్రశ్న ప్రెగ్నన్సీతో వచ్చే ఇబ్బందుల వలన మరలమరల తలెత్తుతూనే ఉన్నది.

గర్భిణీకాలంలో స్త్రీలపై ఉండే అంక్షలు, సామాజిక ఇబ్బందులు, మనోవైకల్యాలు ఇవన్నీ స్త్రీవాదుల అనేక ప్రశ్నలకు కారణాలైనాయి.

రెండు గర్భస్రావాల తరువాత ఓ మహిళ ఇలా వ్యాఖ్యానించింది- "God! woman's body is a drug"

డాక్టర్ బెర్నార్డ్ నాథాన్ సన్ లాంటివాళ్లు పిండరూప శిశువును పరాన్నజీవి (Parasite)గా, దాడిచేసే వ్యక్తిగా (Aggressor)గా వ్యాఖ్యానించారు.

- ఎనిమిదివారాల వయసు - ఎంబ్రియో-పిండము;

- 8-40 వారాలు - Fetus - గర్భస్థశిశువు

మహిళలను మగవాళ్లకన్నా తక్కువగా చూసేవాళ్ల దృష్టి స్త్రీల ఆత్మగౌరవాన్ని గాయపరుస్తుంది. ఏనాడైతే గర్భిణీస్త్రీ తనను తాను తక్కువగా భావిస్తుందో అది మరింతగా ఆమె మనస్సును బాధపెడ్తుంది.

**అయితే ఇవి కొన్ని ప్రశ్నలు-**

- గర్భిణీ అనేది వ్యాధి కాకపోతే ఎందుకు హాస్పిటల్‌లో చేరడం? (కెనడాలో ఆస్పత్రిలో జాయిన్ కావడానికి ఉన్న అనేక కారణాలలో తొలిస్థానం ప్రెగ్నన్సీదే.)
- ఎక్కువ శస్త్రచికిత్సలు- సిజేరియన్ సెక్షను.

  పాపులర్ ఆపరేషను - సిజేరియన్ సెక్షను.
- ఆడవాళ్లు ఎక్కువగా బాధపడేది- Morning sickness తో.
- కానుపు కావడానికి అనేక మందులు, డాక్టర్ల, దాయీల పర్యవేక్షణ అవసరమవుతున్నది. కనుక Pregnancy is a disease.

**Pregnancy is not a disease:**

మనకు పూర్వకాలం నుంచి తెలుసు. కానుపు కష్టమై తల్లీబిడ్డా మరణించడం, కానుపు తరువాత తల్లి రక్తస్రావమై ప్రాణాలు కోల్పోవడం, కష్టమైన కాన్పులలో బిడ్డకు అంగవైకల్యం రావడం.

అయినా మాతృత్వమనేది స్త్రీ సహజ ధర్మంగా గుర్తించి ఆ స్థితిలో ఆమెకు అన్నివిధాలుగా సాయపడడం వలన ప్రెగ్నన్సీను ఒక వ్యాధిగా కాక ఒక సహజ దశగా భావించి ఆమె కష్టాన్ని ఓర్చుకుంటుంది.

**ప్రెగ్నన్సీతో వచ్చే వాధులలో ముఖ్యమైనవి:**

- PIH (Pregnancy induced Hypertension)

  రక్తపోటు అధికం కావడం.

- Morning Sickness - వేవుళ్లు (Hyperemesis gravidarum)
- Gestational Diabetes Mellius - మధుమేహం.
- Pre Eclampsia, Eclampsia - గుర్రపువాతం
- Anemia - రక్తహీనత
- UTI –మూత్ర సంబంధిత వ్యాధులు.
- మానసిక రుగ్మతలు– విచారం, ఏ పనిమీద ఇష్టం లేకపోవడం, ఆకలి తగ్గడం, నిరాశ
- Obesity (ఊబకాయం); Weight gain (లావెక్కడం).
- Infections, చర్మవ్యాధులు, DVT (Deep vein Thrombosis)

కొన్ని వ్యాధులు ప్రెగ్నెన్సీ సమయంలో ఉపశమిస్తాయి. Endometriosis లో ఉండే కడుపునెప్పి తగ్గుతుంది.

ప్రతిఏటా దాదాపు 22 కోట్లమంది గర్భిణులయితే వారిలో 190 మిలియన్ల మంది (19 కోట్లు) అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందినవారు. దాదాపు 3 లక్షలమంది గర్భానికి చెందినవ్యాధులు, ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రెగ్నెన్సీలో వచ్చే ప్రాణాంతకమైన వ్యాధులలో ముఖ్యమైనవి– PIH, గుర్రపువాతం, ముత్యాలగర్భిణి, కొరియొ కార్సినోమా; వీటికి ముఖ్య కారణం శిశువృక్షపు వేళ్లు, గర్భసంచి పొరలలో వచ్చే మార్పులే.

ట్రోఫోబ్లాస్టిక్ ట్యూమర్స్ మూడు రకాలు

1) ముత్యాల గర్భిణి – Molar Pregnancy

2) Placental site Trophoblastic Tumour

3) Persistent Trophoblastic disease and Chorio Carcinoma

వీటన్నిటిలో HCG లెవెల్స్ చాలా ఎక్కువగా ఉంటాయి. కారణం B-HCG ని స్రవించే సింసిషియో ట్రొఫోబ్లాస్ట్స్ అధికంగా ఉండడమే!

శిశువృక్షపు వేళ్లు లేదా కొరియానిక్ విల్లైలో ఉండే కణాలు– 1) Syncytio trophoblasts / Cytotrophoblasts 2) Mesenchymal Cells derived macrophages, fibroblasts, 3) Foetal Vascular Cells, Endothelial Cells.

ట్రొఫోబ్లాస్లులు (Tropho = (greek) to Feed - threphein) – పిండానికి ఆహారాన్ని సాధించి ఇచ్చే కణజాలం. ప్లాసెంటా (మాయ, Placenta)లో అధికభాగం ఇవే ఉంటాయి. ఫలదీకరణం చెందిన గడ్డ (Fertilized ovum) నుంచి ఏర్పడే తొలి కణజాలమిదే.

ఏడు నెలలు వయసున్న గర్భస్థశిశువు (28 weeks fetus)కు అయిదు చదరపు మీటర్ల విస్తీర్ణమున్న ఉపరితలంను ఈ Syncytio trophoblasts ఆక్రమించుకుంటాయి. పూర్ణగర్భిణీలో ఇది 11–12 చదరపు మీటర్లకు వృద్ధి చెందుతుంది. ఈ పొర పక్కనే శిశువు రక్తనాళాలుండి ఆహారాన్ని, పోషక పదార్థాల్ని, ఆక్సిజన్‌ను తల్లి నుంచి గ్రహిస్తాయి.

తల్లి గర్భసంచిలోని Spiral arteries అనే స్ప్రింగుల్లా మెలిదిరిగిన రక్తనాళాలను చుట్టుముట్టి ట్రోఫోబ్లాస్ట్స్, శిశు రక్తనాళాలు తమ కర్తవ్యాన్ని నెరవేరుస్తాయి. తల్లి రక్త నాళాల్లోన్ని పైపొరలను కరిగించడం ద్వారా అవి శిశువుకు వలసినంత జీవరసాల్ని యధేచ్ఛగా తీసుకుపోతాయి. అందుకే కొందరు శిశువును Parasite గా Aggressor గా అభివర్ణిస్తారు.

Pre eclampsia, తల్లికి రక్తపు పోటు అధికం కావడానికి కారణం ఈ ట్రోఫోబ్లాస్టులు శక్తివంతంగా లేనప్పుడు తల్లి గర్భసంచిలోని స్పైరల్ రక్తనాళాలు కుంచించుకుపోవడం వలన తల్లికి 20–22 వారాల గర్భిణిగా ఉన్నపుడు 'Low flow and high resistance' వలన రక్తపోటు అధికం కావడం, మూత్రంలో ప్రొటీన్ పోవడం, బరువు ఎక్కువవడం జరుగుతుంది.

మీసెంకైమల్ కణజాలాలు శిశు రక్తనాళాల వృద్ధికి, తల్లి కణజాలం నుంచి వచ్చే వ్యతిరేకతను తగ్గించి పిండం గర్భసంచి పొరలలో ఇమిడే శక్తియుక్తుల్ని కలిగి ఉంటాయి.

శిశు రక్తనాళాలు వేగంగా అభివృద్ధి చెందడం వలన గర్భస్థశిశువు పెరుగుదలకు అవి ముఖ్యకారణమవుతాయి.

'మాయ'గా పిలువబడే ప్లాసెంటాలో తల్లివేపు కణజాలాన్ని Decidua Basalis గా, శిశువు వేపు కణజాలాన్ని Chorion frondosum గా వర్ణిస్తారు. కొరియాన్ ఫ్రండోసమ్‌లోనే ట్రోఫోబ్లాస్టులుంటాయి. ఈ Syncytial trophoblasts

(కలిసిపోయిన ట్రోఫోబ్లాస్టులు) అధికంగా వృద్ధి చెందితే ట్యూమర్లుగా (Hydatidiform mole, placental site trophoblastic tumour, chorio carcinoma) మార్తాయి.

ప్లాసెంటా (Plaque, Cake, Slab) ఒక్కోసారి శిశువు జన్మించాక కూడా బయటకు రాక గర్భసంచికి అతుక్కుని ఉంటుంది. (Placenta Accrita, incrita, Percrita). దాని వలన కూడ తల్లికి అధికంగా రక్తస్రావమవుతుంది.

ప్లాసెంటా బయటకు వచ్చాక న్యూజిలాండ్‌లోని మావొరి (Maori) ప్రజలు దానిని భూమిలో పాతిపెట్టి, నేలతల్లికి మనిషికి ఉన్న సంబంధాన్ని గుర్తుచేస్తారు. నవజొ (Navajo) తెగవాళ్లు ప్లాసెంటాను పాతిపెట్టి అక్కడే ఒక మొక్కను నాటుతారు. కొన్ని తెగల్లో పసిపాప చనిపోయినా, కానుపు సమయంలో తల్లి చనిపోయినా ప్లాసెంటాను ఒక రహస్య ప్రదేశంలో పాతిపెడ్తారు. బొలివియాలోని అయిమారా (Aymara) తెగవాళ్లు ప్లాసెంటాను రహస్య ప్రదేశంలో పాతిపెట్టడం వలన తల్లి ఆత్మ వచ్చి పసిపాపను ఎత్తుకుపోదని నమ్ముతారు.

కొన్నిచోట్ల (బ్రిటిష్ కొలంబియా–క్వాకియుటిల్ తెగ ప్రజలు)– ఆడ శిశువుల ప్లాసెంటాలను పాతిపెట్టడం వలన ఆడపిల్లలకు నేలను తవ్వడం, సమస్యలను తవ్వి పరిష్కరించడం లాంటివి అవలీలగా పట్టుబడ్తాయని విశ్వసిస్తారు. మగశిశువుల ప్లాసెంటాలను కాకులకు ఆహారంగా వేసి తద్వారా మగపిల్లలకు జోస్యం చెప్పే శక్తులు లభిస్తాయని భావించేవారు.

కొన్ని తెగలు ప్లాసెంటాను తినేవాళ్లు (Placentophagy). చైనా, హాంగ్‌కాంగ్‌లలో 'ప్లాసెంటా'ను ఎండబెట్టి చూర్ణం చేసి మందులలో కలిపి సేవించేవారు.

ఇన్ని వ్యవహారాలున్నాయి కాబట్టే– Pregnancy is a disease or not- అనే దానిలో ఎన్నో వివాదాలున్నాయి.

అయినా మాతృత్వానికి ఉన్న మధురిమ, తల్లి కావడంలోని ఆనందం, స్త్రీత్వపు పరిపూర్ణత ఇవన్నీ గర్భధారణలోని కష్టాలనధిగమించే శక్తిని దైహికంగా, మానసికంగా తల్లికిస్తున్నాయి.

✧✧✧✧✧

**మాతృత్వం గొప్పదేకాని అది స్త్రీని బానిసకన్నా**
**అధమస్థితిలోకి నెట్టివేస్తుంది.** – ఛార్లెస్ స్టాన్లీ

**మాతృత్వంలో ప్రేమ మొదలవుతుంది, అక్కడే నశిస్తుంది.**
– రాబర్ట్ బ్రౌనింగ్.

**అసలైన నిస్వార్ధ సేవ మాతృత్వం.**
**తల్లివి కాగానే నీకున్న ప్రముఖ స్థానాన్ని నీ శిశువుకు కోల్పోతావు.**
– జెస్సికా లాంగి

**ఒకప్పుడు నా సెల్‌ఫోను నిండా నా అందమైన చిత్రాలుండేవి.**
**ఇప్పుడు నా పసిపాప 'మాసన్' ఆ స్థానాన్ని తీసుకున్నాడు.**
– కోర్ట్‌ని కర్దాషియాన్.

**దేవుని ఆశీస్సు, అద్భుతం మాతృత్వం**
– జెన్నీ ఫించ్

✧✧✧✧✧

# Bibliography


1. Women who run with the wolves - Clarissa Pinkola Estes
2. Shaw's Text Book of Gynaecology.
3. Jeffcoate's Principles of Gynaecology
4. Greek Myths - Olivia Coolidge
5. Bulfinch's Mythology
6. Wikipedia

## Dr. LANKA SIVA RAMA PRASAD



M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Member of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

# డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

1. **సత్యాన్వేషణలో (లజ్జ-2012) (నవల) :** ప్రేమ నుంచి పేదరికం వరకూ, చరిత్ర వక్రీకరణల నుంచి ఇప్పటి యుద్ధాలవరకూ అనేక అంశాలను రచయిత కథారూపాలతో పాఠకుల ముందు పెట్టిన తీరు విలక్షణంగా ఉంది. (ఇండియాటుడే).

2. **ఆల్కెమీ (కవిత్వం) :** 'కవిత్వం ఒక ఆల్కెమీ'.

3. **How to be Happy :** a highly popular book of Prasad's narration and Jayadev's Cartoons.

4. **వానమబ్బుల కాంతిఖడ్గం (కవిత్వం) :** స్త్రీ పుట్టిన నాటినుంచి గిట్టేవరకూ పడే కడగళ్లను కవిత్వీకరించిన కవితామాలిక.

5. **సంఖ్యాశాస్త్రం :** సంఖ్యలలోని అద్భుతాలను వివరించే మార్మికశాస్త్రం.

6. **డా. జయదేవ్ కార్టూన్లు :** ప్రసాదు ట్యూన్లు+డా. జయదేవ్ కార్టూన్లు - ఓ కొత్త ప్రయోగం (ఆంధ్రజ్యోతి)

7. **జీనోమ్ (సప్తమ అంతర్థానం) :** తెలుగులో తొలి బయోటెక్నాలజీ నవల. అనేక దేశాల తత్త్వ, మత, సమాజ, విజ్ఞాన శాస్త్ర రంగాలలో మానవజాతి సాగించిన అద్భుత జిజ్ఞాసాయాత్రకు ఆధునికాక్షరభాష్యం (నడుస్తున్న చరిత్ర - ఇండియాటుడే).

8. **టీకప్పులో తుఫాను (కవిత్వం) :** పంచభూతాల ఉత్పత్తిపై ప్రాచీనుల ఊహలు, నవీన మానవుని కాలుష్యదురాక్రమణలను వివరించే దీర్ఘకావ్యం.

9. **Shades (Poetry - English) :** A rare piece of work; Shades is not a collection but a revelation. ( Dr. Jayadev)

10. **The Twilight Zone (Poetry - English)** is about the final scene of a life's drama.

11. **స్వప్నశాస్త్రం (తెలుగు) :** స్వప్నాలపై, స్వప్న విశ్లేషణలో తెలుగులో వచ్చిన ఏకైక సాధికారక గ్రంథం. (వార్త)

12. **In Search of Truth (English Novel) :** What is the ultimate Truth? a book about Death with subliminal Message.

13. **తంగేటి జున్ను (కవిత్వం) :** తీయగా, స్వచ్ఛంగా ప్రవహించిన కవితాజలధార.

14. **Soundarya Lahari (Poetry-English) :** Highly acclaimed book that has reached many places. (Sankaracharya's mystic poems explained and translated in modern perspective)

15. **Bhagavatam (Poetry-English) :** An abridged Version of Potana's Bhagavatam in simple, lucid English. The second revised edition with commentary is released.

16. **మూడు స్వప్నాలు ఒక మెలకువ (కవిత్వం) :** ముగ్గురు కవులు (పొట్లపల్లి శ్రీనివాసరావు, రామా చంద్రమౌళి, లంకా శివరామప్రసాద్‌ల కవిత్వఝురి).

17. **సుప్రసన్నాచార్య 'సాంపరాయం'** - ఇంగ్లీషు అనువాదం.

18. **రామా చంద్రమౌళి 'Fire & Ice' –** ఇంగ్లీషు అనువాదం

<u>బహుళ ప్రజాదరణ పొందిన సప్త అనువాద కావ్యాలు:</u>

19. **ఇలియాడ్ (తెలుగు) :** హోమర్ ప్రఖ్యాత రచన తొలిసారిగా తెలుగులో అందరి మన్ననలను పొందిన మహాకావ్యం. (ఆంధ్రజ్యోతి)

20. **ఒడెస్సీ (తెలుగు):** హోమర్ రచించిన ఒడెస్సీ – మహాభారత కావ్యంలా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తే కథల్తో సాగే మహాకావ్యం. (ఇండియాటుడే)

21. **ఎపిక్ సైకిల్ (ఇతిహాసచక్రం–తెలుగు) :** గ్రీకువాఙ్మయంలో మూడవ భాగంగా వెలువడి ఎన్నో విశేషాలను తెలియజెప్పే కావ్యం. (ది హిందూ)

22. **ఈనీడ్ (Aeneid) :** వర్జిల్ మహాద్భుత రచన – తెలుగు అనువాదం

23. **తీర్థయాత్రికుని ప్రగతి (The Pilgrim's Progress) :** జాన్ బున్యన్ ప్రసిద్ధ రచనకు తెలుగు అనువాదం.

24. **డాంటే రచన డివైన్ కామెడీ - Dante's Divine Comedy** – తెలుగు అనువాదం.

25. **జాన్ మిల్టన్ ప్రసిద్ధ రచన – Paradise Lost - Paradise Regained (పారడైజ్ లాస్ట్ – పారడైజ్ రిగైన్డ్)** – తెలుగు అనువాదం.

26. **కత్తి అంచుపై...** – తెలుగు సాహిత్య చరిత్రలో వెలువడిన తొలి Noir (Black-చీకటి) నిశీధి కథల సంపుటి.

27. **దీప నిర్వాణగంధం** – మృత్యువు గురించి వివరించే అనేక అసాధారణ సంఘటనలు, కవిత్వాలు, నవీన శాస్త్ర విశ్లేషణలతో కూడిన పరిశోధనా గ్రంథం.

28. **అక్షరార్చన** – ఆంధ్రజ్యోతి నివేదనలో ధారావాహికంగా ప్రచురించబడిన వేదాంత విషయాల కదంబం.

29. **క్రీస్తు అద్భుతగీతాలు** – కరుణ, అద్భుత రసాలతో నిండిన కమనీయ కవిత్వ సంపుటి. ప్రపంచ ప్రసిద్ధ కవుల రచనలు క్రీస్తు జీవిత చరిత్ర.

30. **తమిళ సరస్వతి అందెల రవళి** – సంగం కాలం నాటి అద్భుత కవితా సంపద – వీర, శృంగార రసవాహిని.

31. **నామదేవొ ధసాల్ కవిత్వం** – ఈనాటి నుంచి ఎవరూ కవిత్వాన్ని అస్పష్టంగా రాయవద్దు' అని శాసించిన మరాఠీ కవి ధసాల్ కవిత్వం.

32. **శాంతి యుద్ధం** – మొదటి ప్రపంచ యుద్ధపు ఘట్టాల్ని, ప్రజలపై దాని ప్రభావాన్ని కవుల మాటల్లో వివరించే కవితల సంకలనం.

33. **డబ్బు–మని–షి** – హాస్యరస ప్రధానంగా ప్రపంచ కవుల కవితలకు తెలుగు అనువాద సంపుటి.

34. **విలియం బ్లేక్ కవిత్వం** – తన మార్మిక కవిత్వం, చిత్ర రచనలతో ప్రపంచాన్ని అబ్బురపరచిన బ్లేక్ కవిత్వ నిధి.

35. **ఫాస్ట్–గేథే రచన** – జర్మన్ సాహిత్యంలో తలమానికమై అత్యధిక ప్రాచుర్యాన్ని పొందిన విషాదాంత నాటకం. 'ఆత్మను సైతానుకు అమ్మిన మానవుడిగా' తెలుగులో వెలువడినది..

36. **ప్రపంచ ప్రసిద్ధ కథలు** – విశ్వవిఖ్యాత కథకుల ప్రసిద్ధ కథలు.

37. **కుయ్యోమొర్రో శతకం** (ఛందోబంధ రహితం)

38. **మూడు ప్రాచీన గ్రీకు నాటకాలు** – ఇడిపస్ రెక్స్, ఏంటిగొని, ట్రోజన్ వుమెన్ – ప్రపంచ ప్రసిద్ధికెక్కిన విషాదాంత నాటకాలు – తెలుగులో.

39. **భైరవ శతకం** (విభజనానంతర కవిత్వం)

40. **Bouquet of Telugu Songs and Lyrics (Telugu Learning Kit)**

41. **శిలప్పదికారం** – కాలి అందియ కథ. తమిళ మహాకావ్యానికి దీటైన తెలుగు అనువాద కావ్యం.

42. **మణిమేఖల** – 'శిలప్పదికారం' తరువాత ఘట్టం. శాత్తనార్ రచనకు తెలుగు అనువాదం.

43. **మస్నవి -** మౌలానా జలాలుద్దీన్ రూమి అలౌకిక ద్విపదలు- తెలుగుల
44. **రసధుని -** మూడు శతాబ్దాల, రెండువందల సంవత్సరాల (1770-1970) రష్యన్ కవిత్వ ప్రవాహం.
45. **రక్తకాసారం (Pool of Blood)-** అంపశయ్య నవీన్ ప్రఖ్యాత నవలకు ఇంగ్లీషు అనువాదం.
46. **మరణ శాసనం -** దీర్ఘ కావ్యం.
47. **జలపాతం (అష్టాదశ ఆంగ్ల కవుల కవిత్వం - Eighteen English Poets) -** తెలుగులో
48. **The Poems of Kuppam -** సీతారాం రచనకు ఇంగ్లీషు అనువాదం- **'Montages'.**
49. **దళిత వ్యాకరణం (The broken grammar) -** తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ రచనకు ఇంగ్లీషు అనువాదం.
50. **మాకూ ఓ భాష కావాలి (We need a language)-** తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ రచనకు ఇంగ్లీషు అనువాదం.
51. **అగ్నివృక్షం (The tree of Fire)-** ప్రొఫెసర్ అనుమాండ్ల భూమయ్య రచనకు ఇంగ్లీషు అనువాదం.
52. **This is no streaking -** K.K. Menon Stories into English.

## త్వరలో...

53. **కలలు-విశ్లేషణ - స్వప్నశాస్త్రం రెండవభాగం (త్వరలో)**
54. **క్రీస్తు నడచిన దారి -** కరుణామయుడి పదముద్రలపై కవుల కవితాభినివేశం. **(త్వరలో)**
55. **కాయగూర శతకం -** 'తినబోతూ రుచి అడగనేల'
56. **అయ్యబాబోయ్ శతకం -** వర్తమాన రాజకీయాలపై వ్యంగ్యాస్త్రాలు.
57. **బాబూ రావూ శతకం -** విభజన కవిత్వం.
58. **నమో నమో శతకం -** మరో భజన కవిత్వం.
59. **రహస్యభాష -** స్త్రీల వ్యాధుల కథారూపం
60. **మస్నవి-2** జలాలుద్దీన్ రూమి (తెలుగులో)
61. **ఒక సరస్సు-అనేక హంసలు** (కవిత్వం)
62. **Modern Bhagavad Geeta (English Poetry)**
63. **పక్షుల సభ - ఫరీరుద్దీన్ అత్తర్ -** పర్షియన్ కావ్యానికి తెలుగు అనువాదం

స్త్రీలలో వచ్చే వ్యాధుల కథారూపకాలు



# ఛుప్ కె ఛుప్ కె...

(రహస్యభాష)



డాక్టర్ లంకా శివరామప్రసాద్
డాక్టర్ పి. జానకి దేవి